ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సంపుటి : 83 విజయవాడ వెల: రు.4/-

శక సం. 1912 పుష్య మాసం 28వ తేదీ

సంచిక : 21 18-1-1991 పేజీలు: 76

విషయాను క్రమణిక

సీరియల్స్:

కథలు:

శీర్షికలు:

ముఖచిత్రం: "పీపుల్స్ ఎన్‌కౌంటర్"లో భానుప్రియ

Chairman. S. RADHAKRISHNA, *Editor* VEERAJI,

Printed and Published by S. NAGESWARA RAO *for Nageswararao Estates Ltd.,*

at the Andhra Patrika Press, Gandhinagar, VIJAYAWADA-520 003,

Phones Editorial 75667, Business 61247, 61248

సంపాదకీయం

హింస, విద్రోహం, విధ్వంసకాండ-యివే యివాళ కాశ్మీర్, పంజాబ్, అస్సాం రాష్ట్రాంతోపాటు మిగతా ప్రాంతాలలో కూడా పెచ్చరేగిపోతున్నాయి! కాశ్మీర్, పంజాబ్, అస్సాం రాష్ట్రాల సంగతి వేరు-కాని మిగతా ప్రాంతాలలో యీ కత్తుల, నాటు బాంబుల-దారుణ హత్యల సంస్కృతి ఎందుకొచ్చిందో?-"ప్రజాస్వామ్య పరిరక్షణలో మునిగితేలుతున్న" నాయకులెవరూ పరిశీలించి పరిశోధించి వీటి వెనుకగల కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. "కీ తెరిగి వాతపెట్టలేకపోతున్నారు" దేశంలో రాజకీయాలలో ఉద్యమాలలో పాల్గొనేవారి యింట వారి సిద్ధాంతాలకి సంబంధించిన కరపత్రాలు, గ్రంథాలు మాత్రం దొరికేవి-సాధారణంగా యిళ్లల్లో పణమో, బంగారు నాణెమో దొరికితే ఆశ్చర్యపడకూడదు కాని-సోదా చేస్తే చాలు- యిండ్లల్లో మంచి-కత్తులు- బాకులు-నాటు బాంబులు, తుపాకులు, గొడ్డళ్లు దొరకడమేమిటో అంతు చిక్కటం లేదు. దేవుడు పేరుమీద, మతం పేరుమీద, సిద్ధాంతం చాటున-రాజకీయకక్షల కారణంగా- నిష్కారణంగా కాలక్షేపంగా కూడా-కత్తుల దాడులు-బాంబుల ప్రేలుళ్లు నిత్యకృత్యమైపోతున్న దేశంలో మైనారిటీ వర్గాలకి మెజారిటీ వర్గాలకి కూడా రక్షణ లేకుండా పోయింది.

మందిరాలమీద దాడులు-విద్యాలయాలమీద దాడులు-దారుణ హత్యలు-నడిచే బస్సులో-పరిగెత్తే రైలులో- దారంట పోతూవున్నా సరే గమ్యం చేరేదాకా నమ్మకం లేని స్థితి-పంజాబ్, కాశ్మీర్‌ల విషయంలో చర్చల బల్లదగ్గరకి సమస్యను తేవాలన్న ప్రయత్నం జరుగుతున్నట్లే-గ్రామాల వెంట ప్రాకిపోయి-పట్టణాల మధ్య చెలరేగిపోయి -వెయ్యిపడగల విష సర్పమైపోయిన హింసాకాండను గురించి, దాని ఆయువుపట్టు గురించి అన్ని పార్టీలవారూ తలలు ఏకంచేసి ఆలోచించవలసిన తరుణమాసన్నమయింది- ప్రతి చిన్న విషయానికి మారణాయుధాలతో-నిప్పు పెట్టి పెట్రోలు డబ్బాలతో- గుంపులు-ప్రజలయొక్క-పబ్లిక్ ప్రయివేటు ఆస్తులమీద దాడులు చేస్తూంటే-దొంగతనంచేసి పరిగెట్టిపోయే వాడు కూడా వెంటపడిన జనంలో కలిసి "దొంగా దొంగా" అని అరిచినట్లు-యీ హింసకు-నిర్దయకి కారణమైన రాజకీయ పార్టీలవారు కూడా వీటిని తీవ్రంగా "ఖండిస్తూ" వుంటున్నారు. ఖండించవలసినది సంఘటనలను కాదు వాటికి కారణమైన నేరస్థులను కదా?

దేశమంతా ఆలోచనారహితమైన హింసాత్మకమైన దుస్థితి నెలకొని వుండటమొకవైత్తు- మేము వేరే దేశం అంటూ "శిఖ్కు" తీవ్రవాదులు, మానవ మారణహోమాన్ని పురాణాలలో చెప్పిన హిరణ్యాక్ష హిరణ్యకశిపుల మాదిరి ఆగడాలతో-చరిత్రలో చదివిన గజనీ ఘోరీమహమ్మదుల మాదిరి కొల్లగొట్టే విధ్వంసకాండలతో అదుపు లేకుండా- అధునాతన ఆయుధాలతో ఘోర కలి సృష్టిస్తూ వుంటే-సాలీనా అక్కడ ఒక్క పోలీసు వ్యవస్థ మీదనే 250 కోట్ల రూపాయల వ్యయాన్ని చేస్తున్న గవర్నమెంట్ నిస్సహాయ స్థితిలో వుండి

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు సంపాదకులు: శివలెంక శంభుప్రసాద్(1938-1972)

ఛెయిర్మేన్: శివలెంక రాధాకృష్ణ ఎడిటర్: వీరాజీ ప్రింటర్&పబ్లిషర్: శివలెంక నాగేశ్వరరావు

ఈ విధ్వంస విద్రోహకాండలకు అంతం లేదా?

పోడంలో-యీ దుస్థితి ప్రభావం కూడా మిగతా ప్రాంతాలలో విద్రోహకారులమీద బాగా వుంటున్నది.

పంజాబ్ సమస్యని-చర్చల బల్ల దగ్గరికి తెచ్చే ప్రయత్నంలో ముందడుగు సాధ్యమైతే- దాని ప్రభావం దేశవ్యాప్తంగా దుండగుల మీదపడే అవకాశాలు పిసరంతైనా వుండకపోవు. ప్రాణాలకు తెగించి ప్రాణాలు హరించే పంజాబ్ అల్లరి మూకలకి-డబ్బు, ఆయుధాలు, ఆహారపదార్థాలు సమకూర్చుతున్న దేశ శత్రువులు మాత్రమేనా? లేక వారికి పంజాబ్ గ్రామాలలో సమాంతర ప్రభుత్వం నడుపుతున్న కారణంగా-కిడ్నాప్‌ల ద్వారా, బెదిరింపుల ద్వారా-లభిస్తున్న సామాన్య ప్రజల కష్టార్జితం కూడా-వారి పోషణకోసం ఉపయోగపడుతున్నదా? అన్న ప్రశ్నకి జవాబు "ముంజేతి కంకణంలాగా స్పష్టంగా కనపడుతున్నది- పంజాబ్‌లో వారిదే రాజ్యం-గవర్నర్ గారిదికాదు. "ఉగ్రవాదులు", టెర్రరిస్టులు అన్న మాటలు అనకూడదు. వారిని మిలిటెంట్‌లు, ఖల్సా ముజాహిద్‌లు అని పిలవాలిట! సంత్ భింద్రేన్‌వాలా అనాలే తప్ప-మామూలుగా వారి నాయకులను సంబోధించకూడదు-పంజాబ్‌లో హిందీ బోధన జరగకూడదు-హిందీ టీచర్‌లను ఊచకోత కొయ్యాలి! గురుముఖి లిపిలోనే గవర్నమెంటు కార్యాలయం బోర్డులు మొదలు ఉత్తర ప్రత్యుత్తరాల దాకా అన్నీ జరగాలి-పత్రికలూ, రేడియో, టి.వి.లలో టెర్రరిస్టు కమిటీల ప్రకటనలు మొదటి పేజీలలో ఉచితంగా వెయ్యాలి-అన్న తాఖీదులను-రెండు రోజులలో అమలు చేసిన ప్రభుత్వ యంత్రాంగం వున్న చోట- గవర్నర్‌లు మారితేనేమి? లోంగోవాల్, బాదల్, తోహ్రాల వంటి నాయకుల జాగాలోకి సిమ్రంజిత్‌సింగ్‌మాన్ లాంటి కృపాణధారులైన దుండగీంద్ర ఏజంట్‌లు వస్తేనేమి? సామాన్యజనం-ఒక వర్గానికి చెందిన సాధారణ జనం ప్రాణాలని నిత్యం అగ్నిహోత్రంలో పడ్డ "మిడతలవలె కోల్పోతూవుంటే-అక్కడ సాగుతున్నది టెర్రరిస్టుల ఆగడాల గవర్నమెంట్ అని తెలిసిపోవటం లేదా?-అయినప్పటికీ శ్రీ మాన్‌తో శ్రీ చంద్రశేఖర్ చర్చలకి కూర్చున్నారు-విజ్ఞాపన పత్రాన్ని అందుకున్నారు-పంజాబ్‌కి సార్వభౌమాధికారం-ఒక సర్వ సంపూర్ణ దేశ ప్రతిపత్తి- కావాలి అన్న పాతపాటే అందులోవున్నది.


"శ్రీ మాన్"తో కాని మాన్ జాగాలో లోగడవున్న వారితో కాని లోగడ గద్దె నెక్కిన ముగ్గురు ప్రధాన మంత్రులు చర్చలు సాగించలేకపోయారు-పైగా శ్రీమతి ఇందిరాగాంధీ అంగరక్షకుల తుపాకీ గుండ్లకు బలి అయిపోయారు. శ్రీ రాజీవ్ గాంధీ "కవచధారి"యై తిరగాడవలసివచ్చింది-శ్రీ వి.పి. చేసిందేమీలేదు. ఇప్పుడు శ్రీ చంద్రశేఖర్ చేస్తున్న ప్రయత్నాన్ని అన్ని పార్టీలవారు అభినందించాలి. రాజ్యాంగ పరిధిలోనే చర్చ జరగాలని అన్నది ఒక షరతు కాదు తద్భిన్నంగా జరిగే వాటిని చర్చలు సంప్రదింపులు అని అనకూడదు. అవి కుట్రలు కుమ్మక్కులు అవుతాయి-అంచేత తతిమ్మా రాజకీయ పార్టీలు కూడా విడివిడిగానో, కలివిడిగానో-టెర్రరిస్టుల నాయకులతో సంప్రదింపులు కొనసాగించాలి-చర్చలకు హత్యలు దాడులు ఆపడమొక్కటే షరతు కావాలి-అదే విధంగా "బేషరతుగా మమ్మల్ని చర్చలకు పిలువ" మని కోరుతూ వున్న సిమ్రంజిత్ సింగ్‌మాన్‌ను కూడా అదే విధంగా తన అనుయాయులతో, గురువులతో కలసి "బేషరతుగానే చర్చలకు రమ్మని పిలవాలి ఈ సందర్భంలో ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష నాయకుడయిన బి.జె.పి. అధినేత శ్రీ లాల్‌కృష్ణ అద్వానీ గారి చొరవ విషయం ప్రస్తావించాలి. శ్రీ మాన్‌తో చర్చలకు తాను సిద్ధంగా వున్నానని ఆయన ప్రకటించారు. దేశంలో అంతర్భాగమై-జాతీయ గీతంలో అంతర్లీనమై- దేశం కోసం స్వతంత్ర సంగ్రామంలో అమిత త్యాగాలు చేసిన "పంజాబ్"కు మరో "దేశం"గా చెలామణీ కాగల అవకాశాలు లేవని వారికి అన్ని పార్టీలవారు నచ్చచెప్పాలి!-లేదా శ్రీమాన్ మరో భింద్రేన్‌వాలా కాగల అవకాశాలు రూపుకట్టుకుంటున్నాయి. అంతేనా? పంజాబ్‌లో కొంత 'శాంతి' అయినా ఏర్పడకపోతే మిగతా ప్రాంతాల "హింస"కూడా తొండముదిరి ఊసరవెల్లి అయిన చందాన ముదిరి పోతుంది!

చర్చలు నిష్ఫలమయినా ప్రారంభించటంలో లౌక్యం-దౌత్యం కూడా వుంటాయనుకుంటున్నాము. అయితే రెండోవేపు పాకిస్తాన్, పంజాబ్ సరిహద్దులను మూసివేసే కార్యక్రమాన్ని త్వరితంగా పూర్తి చేయాలి. ఈ మూసివేత కార్యక్రమం కొంతవరకుసాగి ఆగిపోయిందని పత్రికలలో వార్తలు వచ్చాయి ఎందుకని? పార్లమెంటులో రకరకాల ప్రహసనాలకేగాని యిటువంటి అంశాలకు పాయింటాఫ్ ఆర్డర్‌లు వుండవా?

పంజాబ్‌లో సాగుతున్న టెర్రరిస్టుల సమాంతర ప్రభుత్వాన్ని ఉపేక్షించినందువల్ల- పరిస్థితులు చేజారిపోతాయి. ప్రధానులు పోతారు, వస్తారు కాని ప్రజలు పోరు-పోతే మళ్ళీ రారు-అందుకనే తెరచివుంచిన పాక్, పంజాబ్ సరిహద్దులను "కంచె"తో మూసి వెయ్యండి, తెరచి వుంచిన చర్చల ద్వారాలను-అట్లాగే వుంచి "గుర్రాన్ని చెరువు దగ్గరకు తెచ్చినట్లే" అనుకుందాం-అలాగే కానివ్వండి, రానివ్వండి సామదానభేద దండోపాయాలను అమలు చేయలేని ప్రభుత్వం చేత ప్రతిపక్షాలు ఆ పనులు చేయించాలి కాని-ప్రభుత్వ వైఫల్యం తమకు "వప్పణ్ణం"అనుకోకూడదు. ఇప్పటికే దేశభక్తిలో కల్తీ చేరిపోయింది-ఇంకా దిగజారనీయకండి అని మాత్రమే మనందరి మనవి-

4-1-'91

ఋణానుబంధం



పుల్లాలంతుల వేంకట సుబ్బారావు

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ సూర్యుడు నడినెత్తిన చేరి నిప్పులు కురుస్తున్నాడు ఫ్యానుగాలి వేడిగా తగులు తుండడం వలన నిద్ర పట్టక పక్క మీద పొర్లుతున్న నాకు హఠాత్తుగా బయట పెద్దపెద్ద కేకలు వినిపించ సాగాయి 'ఏమిటా'ని బయటకు వచ్చిన నాకు ఎదురుగా అల్లంత దూరంలో ఆకాశంలోకి నాలుకలు సాచుకుంటూ ఎగిసి పడుతున్న పెద్దమంటలు కనిపించాయి కేకలు వేసుకొంటూ జనం మంటల దిశగా పరుగులు పెడుతున్నారు పరుగెడుతూ నన్ను దాటి వెడుతున్న ఒకతన్ని ఏమయిందని అడిగాను 'చిన్నపల్లె'లో ఇళ్ళంటుకొన్నాయిట' అతను పరుగెడుతూనే సమాధాన మిచ్చాడు

నేను మాష్టరుగా చిన్నపల్లె స్కూలులోనే పని చేస్తుండడం వలన అక్కడ అందరూ పరిచయమున్న వాళ్ళే దానికి తోడు నన్ను రోజూ రిక్షాలో తీసుకు వెళ్ళే రామయ్యా, ఇంట్లో పని చేసే ముత్యాలమ్మ కూడ అక్కడే ఉంటున్నారు గబగబా చొక్కా, ప్యాంటు వేసుకొని ఆత్రుతగా నేను కూడ చిన్నపల్లె చేరుకొన్నాను.

నేను చేరకముందే చాల మంది జనం గుంపులు గుంపులుగా అక్కడ పోగయ్యారు ఎదురుగా ప్రళయకాల

భీకరనృత్యం చేస్తున్న అగ్నిదేవుడి ప్రతాపానికి దిక్కుతోచని స్థితిలో వాళ్ళు మతి తప్పిన వాళ్ళలా చూస్తూ నిలబడి పోయారు వాళ్ళ మధ్య నుంచి దూసుకు వచ్చిన రామయ్య చేతిలోని బకెట్‌తో నీళ్ళు మంటలపై గుమ్మరించారు. జనం చైతన్యవంతులై తమ కందిన పాత్రలతో నీళ్ళు తీసుకు వచ్చి గుమ్మరించసాగారు అప్పటికే ఒక గుడిసె పూర్తిగా పరశురామ ప్రీతి అయిపోయింది. ఆ లైనులోనే రామయ్య, ముత్యాలమ్మ ఉంటున్న ఇళ్ళు ఉన్నాయి. అక్కడ చేరిన జనం ఒకళ్ళ కొకళ్ళు చేదోడు కాసాగారు మంటల నార్పే ప్రయత్నంలో. నేను కూడ ఓ బకెట్ సంపాదించి వాళ్ళతో పాటుగా నా వంతు కర్తవ్యం నిర్వర్తించసాగాను అగ్నికి తోడుగా పెద్దగాలి వీచసాగింది. ప్రాణాధారమైన గాలి ఆ సమయంలో ప్రాణసంకటంగా మారింది. పరిస్థితి ప్రమాదకరంగా మారి వాడ మొత్తాన్నే మింగేసేటట్టు తయారయింది.

కొంతమంది గృహస్థులు జాగ్రత్త చర్యగా ఇళ్ళమీది ఆకులు తీసివేయ సాగారు. మరికొంతమంది తట్టా బుట్టా సర్దుకొని పిల్లాజెల్లలతో ఇళ్ళు ఖాళీ చేయసాగారు. పెద్దవాళ్ళ కంగారు, అరుపులు, ఆడవాళ్ళ, పిల్లల ఏడుపుల్తో అక్కడి వాతావరణం గందరగోళంగా, బీభత్సంగా, హృదయ విదారకంగా తయారయింది.

ఒకవైపునుంచి నీళ్ళు పోస్తుంటే ధిక్కారమును సైతునా అన్నట్టు మరోవైపునుంచి మంటలు ఒక ఇంటి నుంచి ఇంకో ఇంటిపైకి పాకిపోతున్నాయి

“ముత్యాలమ్మ” ఇల్లు అంటుకొంది అని అరిచా రెవరో.

“ఒర్నాయనో పిల్లాడు నిద్దరోతున్నాడు లోపల దేవుడో” అంటూ చేతిలో పాత్ర పారేసి ఒక్క ఉదుటున సందులో మరోవేపునుంచి ఇంటివైపు దూసుకుపోతున్న ముత్యాలమ్మ కనిపించింది

నేను బకెట్‌తో సహా ముత్యాలమ్మ ఇంటికి పరుగు దీసాను. వెనకాలే రామయ్య కూడ వచ్చాడు.

మిత్రుడు

ఎన్నో ఆశయాల సిద్ధికోసం-
ప్రారంభించిన జీవితం!
దారివెంట చేయూత ఉంటే-
అడుగు ముందుకు పడుతుంది!
పూలు పరిమళిస్తాయి
కాలు పరుగందుకుంటుంది!
ఒక దశలో బరువులు-బాధ్యతలు
పరుగును బంధిస్తాయి.
సూర్యుడు నిలచినట్టు తోస్తుంది
కాలిపై వాత పడుతుంటే-
అడుగు సాగదు. అప్పుడు-
చిక్కబట్టుకోవాలి ధైర్యాన్ని
సాహసమే మిత్రుడు.
లేకుంటే పిడుగు పడుతుంది-నెత్తిన!

కాణిపాకం లింగన్న

ఋణానుబంధం

క్షణాలమీద మంటలు నడికొప్పు మీదకి వచ్చాయి. తాటాకులు బాగా పాతపడి పోవడం వలన మంటలు వేగంగా పాకుతున్నాయి. మంటలనుండి వస్తున్న సెగలకి అక్కడ నిలబడ్డమే చాల కష్టమయిపోతోంది. లోపలకి వెళ్ళనీకుండా నలుగురాడాళ్ళు ముత్యాలమ్మను పట్టుకొన్నారు.

“నా పిల్లాడు దేవుడోయ్. నన్నొదలండో, గింజాకొంటోంది వాళ్ళ చేతుల్లో ముత్యాలమ్మ. మంటల ధాటి చూసి ముత్యాలమ్మని వదలడానికి భయపడుతున్నారు వాళ్ళు.

ఆ పరిస్థితిలో ఏం చేయాలో ఎవరికీ ఏం పాలు పోలేదు. ‘అమ్మా’ అన్న ఆర్తనాదం మంటల్లోంచి దూసుకు వచ్చింది. అంతే అప్పటిదాకా నా పక్కనే ఉన్న రామయ్య రెప్పపాటులో సంధించిన బాణంలా మంటల మధ్యకు దూసుకుపోయాడు.

అందరం ‘హాహాకారాలు’ చేశాం రెండు క్షణాల్లో రామయ్య పిల్లాడితో సహా ఒంటినిండా మంటలతో బయటకొచ్చి పడ్డాడు. వెంటనే గబగబా గొంగళీ కప్పి వాళ్ళ మంటలు ఆర్పేసి ఆసుపత్రికి తీసుకెళ్ళడం నా కర్తవ్యమయింది.

ఎవరు ఫోను చేశారో ఏమో గణగణ గంటలు మోగించుకొంటూ ఫైరింజను వేగంగా వచ్చి ఆగింది. అందరిదృష్టి గంటల కారువైపు మళ్ళింది. అగుతూనే బిలబిలమని దిగిన ఫైర్‌మెన్‌లు టాంకర్ వైపు ఆన్‌చేసి గొట్టాలగుండా నీరు మంటలమీదకు పంపి క్షణాలమీద అదుపులోకి తెచ్చారు. పది నిముషాల్లో మంటలు పూర్తిగా ఆర్పేసారు.

* * * *

ఈ సంఘటన జరిగాక సుమారు పదిహేనేళ్ళు కాలగర్భంలో కలిసి పోయాయి దీని ప్రభావం వలన రామయ్య, ముత్యాలమ్మ జీవితాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. ఆసుపత్రిలో ఉన్నంత కాలం కొడుకుతో పాటుగా కంటికి రెప్పలా చూసు కొన్న ముత్యాలమ్మలో రామయ్య ఏనాడో పోయిన తన కన్న కూతురుని చూసుకొన్నాడు. భర్తపోయి ఒంటరిగా జీవన సమరాన్ని సాగిస్తున్న ముత్యాలమ్మ కుటుంబానికి పెద్ద దిక్కయ్యాడు ముత్యాలమ్మ కొడుకు ఈ ప్రపంచంలో ఏకాకిగా మిగిలిన రామయ్యకు ఆరోప్రాణ మయ్యాడు. ఎప్పుడూ ‘తాతా, తాతా’ అని కూడా తిరిగే ముత్యాలమ్మ కొడుకే వాడికి ప్రపంచ మయ్యాడు.

రామయ్య, ముత్యాలమ్మలు కాయకష్టంతో జీవన సమరం సాగిస్తున్నా కుర్రవాడి అభివృద్ధే వాళ్ళకి కేంద్రబిందువయింది. స్వతహాగా చురుకైనవాడు, బుద్ధిమంతుడు కావడం వలన నా ఆధ్వర్యంలోనే వాడు కొద్ది క్రమతో బడిలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసాడు. అనతి కాలంలో వాడి అదృష్టం బాగుండి ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మ్యాన్‌గా సెలక్టయ్యాడు. రామయ్య, ముత్యాలమ్మలు కుర్రవాడిని అంతదూరం పంపడానికి మొదట అంగీకరించకపోయినా నేను కలుగచేసుకొని మంచి చెడ్డలు ఎంచిచిన మిదట అయిష్టంగానే అంగీకరించారు. ఉద్యోగంలో స్థిరపడ్డాక సెలవలకి కుర్రవాడు ఇంటికి వచ్చి వెడుతుండడం వలన వాళ్ళు కూడ తర్వాత

స్థిమితపడ్డారు

ఒరోజు ఉదయాన్నే వాకిట్లో వాలు కుర్చీలో కూర్చొని పేపరుచూస్తూ కాఫీ తాగుతుండగా ముత్యాలమ్మ గాభరాగా వచ్చింది

"బాబుగారూ, మా అయ్య నాలుగు రోజలనుండి మూసిన కన్ను తెరవడం లేదండి. ఒళ్ళంతా కాలిపోతావుంది. నాకేదో భయంగా ఉంది అబ్బాయికి టెలిగ్రామిచ్చి పిలిపించిపెట్టండి" గుక్క తిప్పుకోకుండా అంది

"డాక్టరుగారికి చూపించలేక పోయావా! అవసరమయితే అలాగే అబ్బాయికి టెలిగ్రాం ఇద్దాం. ప్రతి చిన్న దానికి ఊరికే కంగారుపడి అక్కడ కుర్రాడిని కంగారు పెట్టడం దేనికి. వాడికీ సెలవులు అవీ ఉండొద్దూ" అన్నాను కాఫీ కప్పు పక్కనపెట్టి పేపరు మడుస్తూ

"చూపించానండి డాక్టరుబాబు రోజూ వచ్చి ఇంజీసన్లు చేసి వెడుతున్నారండి మందులు వాడుతున్నాను బాబూ. అయినా ఏం తేడా కనిపించడం లేదండి ఓసారెట్టాగయినా అబ్బాయికి కబురెట్టండి బాబుగారూ" అంది గద్గద స్వరంతో.

"సరే నే వొస్తానుగానీ నువ్వు పద" అని ఆమెను పంపేసి బట్టలు మార్చుకొని రామయ్య ఇంటికి బయలు దేరాను నేను వెళ్ళేసరికి డాక్టరు వచ్చి ఇంజక్షన్ చేస్తున్నాడు. రామయ్య నులక మంచంమీద నీరసంగా పడుకొని ఉన్నాడు బాగా చిక్కిపోయి మంచానికి బల్లిలా అతుక్కుపోయి ఉన్నాడు.

డాక్టరు ఇంజక్షన్ చేసి చీటిమీద మందులు వ్రాసి ముత్యాలమ్మ చేతికి ఇచ్చాడు కిట్ సర్దుకొని బయటకు వచ్చాక "ఎలా ఉంది డాక్టరుగారూ రామయ్య పరిస్థితి" అన్నాను నేను

"రోగం బాగా ముదిరి పోయింది మాష్టారూ మందు కూడా పట్టివ్వడం లేదు. అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలిగదా" అన్నాడు డాక్టరు. అంతేగాని ఇతమిద్ధంగా తేల్చి చెప్పలేదు.

డాక్టరు వెళ్ళిపోయాక ముత్యాలమ్మ "ఏవన్నారండయ్యగారూ డాక్టరుబాబు" ఆందోళనతో ప్రశ్నించింది.

"ఫరవాలేదు అదే తగ్గిపోతుందన్నారు" అన్నాను అసలు విషయం చెపితే మరింత బెంబేలెత్తిపోతుందని

"కుర్రాడికి కాస్త కబు రెట్టించం డయ్యగారు" మళ్ళీ అభ్యర్థించింది ముత్యాలమ్మ

"సర్లే. అలాగే. ఇంటికి వెడుతూ దోవలో ఎలానూ పోస్టాఫీసు ఉందిగదా టెలిగ్రాం ఇచ్చి వెడతాను నువ్వనవసరంగా కంగారుపడి దిగులు పడకు" అని చెప్పి ఇంటికి బయలుదేరాను

* * * * *

పోస్టాపీసులో టెలిగ్రాం ఇచ్చిన తర్వాత పేపర్లు దిద్దుకోవడం, ఇంటి పనులు, బయటి పనులతో సతమతమవుతున్న నాకు వారం రోజులుగా రామయ్యను చూడడానికి వెళ్ళడం కుదరలేదు. ముత్యాలమ్మ కూడా ఏ కబురూ తెలియచెయ్య లేదేమిటి చెప్మా అని అనుకొంటున్న సమయంలో సరిగ్గా గేటు దగ్గర చప్పుడయింది

మా స్కూలు ప్యూను రామ్మూర్తి గేటు తీసుకుని లోపలకి వచ్చాడు

"ఏమిటి రామ్మూర్తి ఇలా వచ్చావు ఏమిటి విశేషం' అన్నాను నేను.

"మీకు తెలీదాండి మాష్టారూ ఉదయం రామయ్య పోయాడు ఇప్పుడె శవాన్ని దహనానికి తీసుకెడు తున్నారు" అన్నాడు రామ్మూర్తి.

అటువంటి వార్త వినవలసి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్న నన్ను ఆ వార్త ఆశ్చర్యపెట్టక పోయినా క్షణకాలం బాధగా అనిపించింది.

"ముత్యాలమ్మ కొడుకు వచ్చాడా" అన్నాను రామ్మూర్తి నుద్దేశించి

"నిన్న సాయంకాలం వచ్చాడుటండీ. ఆ అబ్బాయే దగ్గరుండి అన్నీ చూస్తున్నాడు ఏటో ఆళ్ళిద్దరిదీవిచిత్ర సంబంధమండి" అన్నాడు రామ్మూర్తి


మరి ఆలస్యం చేయకుండా నేను చొక్కా తగిలించుకొని రామ్మూర్తిని వెంట పెట్టుకొని స్మశానానికి బయలు దేరాను

నేను వెళ్ళేసరికి చితికి నిప్పంటించే కార్యక్రమం జరిగి పోయింది మంటల్లో రామయ్య శరీరం సంస్కరింప బడుతోంది నన్ను చూడగానే ఎటునుంచి వచ్చాడో ఏమో ముత్యాలమ్మ కొడుకు ప్రత్యక్షమయ్యాడు

"అయిపోయిందండి మాష్టారూ అయిపోయింది నన్ను మంటల నుండి కాపాడిన రామయ్య తాతకి స్వయంగా నిప్పంటించాల్సి వచ్చింది" అంటూ బావురుమన్నాడు

ఋణాను బంధం అంటే ఇదేకాబోలు అనిపించింది ఆ క్షణంలో తెలీకుండానే చెమర్చిన నా కళ్ళ నుంచి రెండు అశ్రుబిందువులు రాలాయి

O



సీరియల్

మోహినీ తాండవం

డా. కొత్త రవీంద్రబాబు

ఇంతవరకూ సాగిన కథ-20 : ప్రణవనాథ్‌ను హత్యచేసిన మోహిని గురించి వివరాలు ఆరా తీయాలనుకున్న నందికేశ్వర చావుదెబ్బ తింటాడు. ప్లూటోగా పిలువబడే రవితేజను రేఖ కలుసుకుంటుంది. అతనికి దగ్గరవుతుంది జైనవిహారంలో వున్న డేవిడ్‌ను రవి, భీంలు కలుసుకుంటారు. అనర్థాలకు కారణమైన మోహినిని మట్టుపెట్టాలన్న ఉద్దేశ్యంతో రవి, రేఖ, భీం - ఉదయ్‌పూర్ వెళ్తారు. అనేక దోపిడీలతో సంబంధం వున్న మోహిని మరణించిందని రవికి ప్రతాప్‌సింగ్ తెలియజేస్తాడు. కైలాసగిరి వెళ్లి కపర్దిని కలుసుకోవాలనుకుంటాడు రవితేజ.

(గత సంచిక తరువాయి)

రేఖ, భీం టాక్సీ దిగి ఇరానీహోటల్ పక్కన వేసి వున్న కుర్చీలలో కూర్చున్నారు టాక్సీ డ్రైవర్ అరటి గెల తెచ్చి భీం పక్కన పెట్టి జానీ వాకర్ బాటిల్ బల్ల మీదుంచి వెళ్లాడు.

"ముఖరం భాయ్- చెల్లాయి న హోటల్ టీ రుచి చూస్తానంటె తీసుకుని వచ్చా"

ముఖరం నవ్వుతూ దగ్గరకు వచ్చి- "అయిదు నిముషాలలో చా తెస్తా" అని వెళ్ళిపోయాడు

కోతి అరటి గెల నుండి కాయలు పీక్కొని అవతలకు వెళ్ళిపోవడం చూచి భీం తేలికగా వూపిరి పీల్చుకొగలిగాడు

ఆవిర్లు గక్కుతున్న కప్పులతో వచ్చాడు ముఖరం గుక్కెడు టీ తాగి "ఓహ్! అమృతం- న టీ ముందు విస్కీ కూడా దిగదుడుపే" అన్నాడు భీం

ముఖరం పక్కున నవ్వి పలకరించాడు

"భాయ్- ఖాళీ గ్లాసులు పట్రా- జానీవాకర్ కొంచెం పుచ్చుకుందాం" అన్నాడు భీం

ముఖరం కళ్ళు మిలమిల మెరిసాయి వెళ్ళి రెండు ఖాళీ గ్లాసులు, నీళ్ళ జగ్గు తెచ్చాడు భీం గ్లాసులో జానీవాకర్ పోసి నీళ్ళు కలిపి ఒక గ్లాసు ముఖరం ముందుకు నెట్టాడు ముఖరం గ్లాసందుకుని రేఖ వంక ఇబ్బందిగా చూశాడు

"భాయ్ చెల్లాయి చాలా మంచిది ఏమనుకోదు" అన్నాడు భీం

అయిదు నిముషాలలో రెండు గ్లాసులు ఖాళీ చేసాడు ముఖరం

భీం గ్లాసు అందుకోబోయి రేఖను చూచి ఆగాడు

కోతి రేకుల షెడ్ మీద నుండి వెంగున దూకి మిగిలిన కాయలతో అరటి గెలను ఎత్తుకుని అవతలకు వెళ్ళిపోయింది

"కడుపు నొప్పి పుడుతుంది రా చెంగిజ్ ఖాన్ అన్నీ తినకు!" అన్నాడు ముఖరం కోతితో

"మీ కోతి పేరు చెంగిజ్‌ఖాన్- ఎంత గొప్ప వీరుడి పేరు!" అంది రేఖ మెచ్చికోలుగా

"అవును చెల్లెమ్మా- కాంబేలో వుండగా ఒనారి మా హోటల్‌లో నేను నిద్రపోతుండగా దొంగ వచ్చాడు వీడా దొంగను కొరికి గాట్లు పెట్టేసరికి గగ్గోలుగా ఏడ్చాడు వాడు!

"ఏమిత్రా నా హోటల్‌లో దోపిడికొచ్చావ్" అని రెండు బాదాను

"సాబ్- పొరపాటయింది మీ హోటల్‌లో కోతి వుందని తెలీక వచ్చాను"

"కోతంటావా బద్మాష్!"

"కోతిగాదు సాబ్ చెంగిజ్‌ఖాన్ తెలీక వచ్చా!" లెంపలేసుకుని వెళ్ళిపోయాడు

అప్పట్నుంచీ వీడిని చెంగిజ్‌ఖాన్ అని పిలుస్తున్నా"

"చెంగిజ్‌ఖాన్‌కు [illegible] గలంటే ఇష్టమట గదా?"

"అవును- కాంబేలో వుండగా వోడలు పోర్టులోకి రావడం పోవడం చూస్తూ వుండేవాడు"

"కాంబేలో ఎక్కువ వోడలుండేవా?"

"వస్తుండేవి, పోతుండేవి వచ్చేవి ఎక్కువ పోయేవి తక్కువ!"

"అదేం భాయ్- వచ్చినవన్నీ పోవాలి గదా?!"

"ప్రపంచంలోని అన్ని దేశాలకు సంబంధించి పద్ద పెద్ద **ఆయిల్ టాంకర్లను కొనేవాడు పూర్ణా క్రూడాయిల్** కంపెనీ ఓనరు అతని పేరేదో వుండాలి"

'శేఖర్"

"అవును శేఖర్- ఆఖరుకు పనికిరాకుండా పోయిన టాంకర్లయినా సరే కొని రిపేరు చేయించేవాడు"

"అలాగా- ఆ వోడలన్నీ ఏం చేసేవాడు?"

"ఏమో మరి ఎవరికి అర్థం అయ్యేది గాదు! కొన్నిటిని సౌదీ అరేబియా నుంచి

ఆయిల్ తేవటానికి ఉపయోగించేవాడు "

"ప్రపంచంలోని పెద్ద ఆయిల్ రవాణా కంపెనీలలో పూర్ణా క్రూడ్ ఆయిల్ కంపెనీ వొకటి " అంది రేఖ

"అవునేమో! ఒకసారి చెంగిజ్ఖాన్ ఓ వోడలోకి వెళ్ళి రానని మొరాయిస్తే తీసుకు రాటానికి నేనూ వెళ్ళా పాత వోడని ఎంతో రిపేరు చేయించి పెయింట్లేయించారు అవసరం అయితే సముద్రంలో కిందకు దిగిపోటానికి వీలుగా బాలాస్ట్ టాంకు కట్టారు

ఎందుకు భాయ్ ఇది? అని వోడ సరంగు నడిగా

"అవసరం అయితే అడుగుకి వెళ్తుంది లేకపోతే తేలుతుంది" అన్నాడు.

"శేఖర్ ఎప్పుడన్నా కాంపే వచ్చేవాడా ముఖరం భాయ్"

'వచ్చేవాడే చెల్లెమ్మా వోడలు రిపేరు పర్కు తనిఖీ చేస్తుండేవాడు పాపం ఒక రోజు మధ్యాహ్నం వోడ మీదే విరుచుకు పడిపోయాడు ఆస్పత్రికి తీసుకు వెళ్ళాక కొంతసేపటికి చనిపోయాడు గుండెపోటు వచ్చిందన్నారు

"పాపం!"

"చాలా లావుగా వుండేవాడులే అందుకే గుండె దెబ్బ తిన్నదన్నారు!"

"ఆయన పోయాక నేనక్కడ ఎక్కువ రోజులుండలా ఇంతలో మా అన్నను చంపేసారు- భయంతో యిలా వచ్చేసాను"

"మంచి పని చేసావన్నా- బతికుంటే బలుసాకు తినొచ్చన్నారు".

"ఇక్కడ ఉదయపూర్లో అన్నీ బాగానే వున్నాయ్ గాని వోడలు కనపడక చెంగిజ్ఖాన్ దిగులేసుకుంటున్నాడు"

"వస్తానన్నా నాకు కోతులంటే యిష్టం- అన్న యిక్కడ కోతి వుందని చెప్పగానే వచ్చేసాను!" పర్స్లోంచి డబ్బివ్వబోయింది

"వద్దు వద్దు! ఇక్కడ చూడాల్సినవన్నీ చూసారా చెల్లెమ్మా ఎన్నాళ్ళుంటారు?"

"చూసామన్నా- ఒకటి రెండు రోజుల్లో వెళ్ళిపోతాం" పదిమంది టూరిస్టులు వ్యాన్లో వచ్చి దిగటంతో ముఖరం వెళ్ళిపోయాడు

"చూసావా చెల్లెమ్మా సీసా ఖాళీ అయింది గాని వాడికి కైపు రాలేదు"



అన్నాడు భీం ఆశ్చర్యంగా.

"వాడికి కైపు వచ్చినట్లయితే మన పని అయ్యేది గాదు - పద వెళ్దాం".

"లావుగా వుంటే గుండె జబ్బు వస్తుందని భయపెట్టి వెళ్లాడే వీడు!"

"నీలా వుషారుగా వుండేవాడికి గుండె జబ్బు రాదులే భీం- పద వెళ్దాం".

★ ★ ★ ★ ★

అహర్ గ్రామంలోని ముఖ్య వీధిలో నడుస్తూ ఆలోచించసాగాడు రవి.

ఎదురుగా కైలాసగిరి కనపడింది. కొండ మీద దుర్గం, బురుజులు, కొండ మీదకు వెళ్లే దారి, కొండ మీద కొండ నానుకుని దట్టంగా పెరిగిన అడవి.

"మోహినీ నీ ఆటకట్టు- పరమ క్రూరంగానూ భయంకరంగానూ సాగే మోహినీ తాండవం చరమాంకంలో పడింది!"

నువ్వెవరైనా గానీ, మనిషివిగానీ, పిశాచానివి గానీ వదలిపెట్టను. నీ అంతు చూస్తాను".

గ్రామంలోని మెటల్ రోడ్డు స్థానే సిమెంట్ రోడ్ మొదలయింది. కొండ మీదకు పాము మెలికలా తిరుగుతూ వెళ్లిందా రోడ్డు. రోడ్డు కిరు వైపులా ఎత్తైన గోడలు మనిషి దూకి రావటానికి వీల్లేనంత ఎత్తుగా వున్నాయి. గోడల మీద యినుప చువ్వలతో బిగించిన ముళ్ల తీగ వలన రోడ్డు మీదకు కొండ మీద నుండి రావడం కష్టతరం అవుతుంది.

పది అడుగుల ఎత్తున్న పెద్ద యినుప గేట్లు కొండ పైకి వెళ్లే దారికి అడ్డంగా మూసి వున్నాయి.

రవి గేటు ముందు నిలబడగానే-"ఎవరు నువ్వు" అని ఖంగుమని కంచులా మోగిందొక కంఠం.

"రంజిత్‌సింగ్"

"దుర్గంలోకి వెళ్లటానికి పర్మిషన్ వుందా?"

"వుంది".

"వుండు కనుక్కుంటా" గేటు పక్కన వున్న అవుట్ హౌస్‌లోకి వెళ్లి ఫోన్ చేసాడు సెంట్రీ.

తిరిగివచ్చి "ఏం పని చేస్తారు?"

"పత్రికా విలేఖరి".


గేటు లోపల మనిషి వెళ్లటానికి వీలుగా ఏర్పాటుచేసిన చిన్న గేటు తీసి "లోపలకు రావచ్చు" అన్నాడు సెంట్రీ

రవి గేటు లోపలకు రాగానే అతన్ని ఆపాదమస్తకం సోదా చేసాడతను వేసుకున్న కాకీ దుస్తులు పట్టినంతగా కండలు తిరిగి వున్నదతని దేహం. రైఫిల్ గేటు కానించి వుంచాడతను

తలలో వున్న కృపాణం వంక చూశాడు సెంట్రీ రవి అతని వంక చురుక్కున చూసాడు.

ఏమనుకున్నాడో ఏమో "సరే వెళ్లండి!" అన్నాడు. అతని భుజం మీద "రుద్రకోశ కైలాసగిరి ఎంటర్‌ప్రైజెస్ సెంట్రీ" అని చెక్కి వున్న ప్లాస్టిక్ ఐడెంటిటీ ప్లేటు వుండటం గమనించాడు రవి.

రవి కొండ పైకి నడిచి వెళ్లసాగాడు



అదీ కారణం

కుటుంబ నియంత్రణ కేంద్రంలో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుందామె ఇంటర్వ్యూకు రమ్మని కబురు వచ్చింది

"నీ కెంత మంది పిల్లలు?" అని అడిగింది ఇంటర్వ్యూ చేస్తున్న అధికారిణి.

"తొమ్మిది మంది మేడమ్!"

"మైగాడ్! అంత మంది సంతానమున్న నీవు ఇక్కడ ఉద్యోగానికి ప్రయత్నించడ మేమిటి?"

"అంత మందిని పోషించలేకనే కదమ్మా మీకు దరఖాస్తు పెట్టుకున్నది!" అందామె. – జి. వి. జి.

చిన్న గేటు తాళం వేస్తూ "జాగ్రత్తగా చెక్ చేసి మర్యాదగా పైకి పంపించు" అని ఫోన్‌లో వచ్చిన ఆర్డరు గుర్తు తెచ్చుకున్నాడు రుద్రకోశ.

రోడ్డు కిరువైపులా వున్న ఎత్తైన గోడల వలన కొండ మీద దూరంగా వున్న చెట్లు కనపడసాగాయి. వెనుదిరిగి చూస్తే ఉదయపూర్ పిచోలా సరస్సు సరస్సు మధ్య ప్యాలెస్ కనపడ్డాయి.

అరగంట తర్వాత కొండ పైన సమతల ప్రదేశానికి వచ్చాడు రవి.

ఎత్తైన కోట బురుజు కింద పెద్ద చెక్క గేటు- గేటు తలుపులు ఇరుసుల కమర్చి వున్నాయి రైఫిల్ పట్టుకున్న సెంట్రీ బురుజు పైనుండి తనను గమనించి కింద వున్నతనితో ఏదో చెప్పడం అతను చెక్క తలుపులోని చిన్న కంతలోంచి పరీక్షించి చూచి

"మీ పేరు?" అని అడిగాడు

"రంజిత్‌సింగ్"

చెక్క గేటులోని చిన్న తలుపు తెరచి "లోపలకు రండి" అన్నాడు సెంట్రీ.

గేటులోపల కడుగెట్టిన రవిని ఆపాదమస్తకం శోధించాడు సెంట్రీ అతని యూనిఫాంకు పిన్ చేసి "రుద్రానంద కైలాసగిరి ఎంటర్‌ప్రైజెస్ సెంట్రీ" అని వుంది.

ముందుకు నడిచాడు రవి.

అరమైలు పొడుగు అరమైలు వెడల్పు వున్న గిరిదుర్గం చుట్టూ బలమైన బురుజులనేకం వున్నాయి.

ఒక్కో బురుజు మీద ఒక్కో సెంట్రీ రైఫిల్ పుచ్చుకుని కాపలా వుండడం గమనించాడు రవి.

మూడు శతాబ్దాల క్రితం రాజపుత్ర రాజులు శత్రు దుర్భేద్యంగా నిర్మించిన ఆ గిరిదుర్గం కొత్తగా అప్పుడే కట్టిన నిర్మాణంలా కనపడడం చూచిన రవి "సర్దార్ కపర్ది దుర్గాన్ని బాగా రిపేరు చేయించి వుంచాడు" అనుకున్నాడు.

నలు చదరంగా వున్న ఆ దుర్గం మధ్య భాగంలో పెద్ద భవంతి నాలుగు మూలలా నాలుగు పెద్ద డాబాలు దక్షిణపు వేపున పొడవాటి డాబా, ఉత్తరపు వేపున పొడవాటి వసారా కనపడ్డాయి.

ఉత్తరపు వేపు వసారాలో వరుసగా

నిలబడి వున్న కార్లను జీపులను చూచి "గుర్రపుశాలను కారు గ్యారేజీగా మార్చాడు కపర్ది! దక్షిణపు వైపునున్న డాబా సైనికులు కాపురం వుండటానికి కట్టి వుంటారు. ఇప్పుడు సెంట్రీలుండి వుంటారు. పెద్ద భవంతి రాణీవాసం మహల్ అయివుంటుంది. ప్రస్తుతం కపర్ది అందులో వుంటుండి వుండాలి.

వెనుకటి రోజుల్లో నాలుగు వైపులా వున్న డాబాలు కచేరీలుగా ఉపయోగపడి వుంటాయి. ఇప్పుడు ఆఫీసులుగా వాడుకుంటున్నారేమో!"

"రండి రంజిత్‌సింగ్‌జీ" కాకీ యూనిఫాం వేసుకున్న సెంట్రీ రవిని మర్యాదగా ఆహ్వానించాడు. ముందుకు కదిల్తాడు రవి.

డాబాలను వసారాలను దులుపుతూ సున్నం కొడుతు దర్వాజాలకూ కిటికీలకూ రంగులు వేస్తూ కొంతమంది పనివారు కనపడ్డారు రవికి.

"సత్యం యిలా పనిచేస్తున్నందువల్లే యీ దుర్గం కొత్తగా కట్టిన దానిలా కనపడుతున్నది" అనుకున్నాడు రవి.

పెద్ద భవంతికి, డాబాలకు వసారాలకు మధ్య పైన కప్పు వున్న దారులు కనపడ్డాయి. దారుల కిరువైపులా పైకి కిందకు ఇనుప కమ్మీలు అమర్చి వుంచారు.

"కపర్ది దుర్గంలోపల కూడా అప్రమత్తంగా వుంటాడు అనుకుంటున్న రవికి ఎదురుగా వున్న పెద్ద భవంతి పై భాగాన మూడు పెద్ద సాటిలైట్ డిష్‌లు, కొన్ని శక్తివంతమైన స్పాట్ లైట్లు కనపడ్డాయి.

"ఎవరో నన్ను గమనిస్తున్నారన్న భావం మనసులో మెదలి తల పక్కకు తిప్పాడు రవి. మేడ మీద నిలబడి తనను నిశితంగా గమనిస్తున్న ఆకారం కనపడింది.

అంత దూరాన్నుంచి కూడా క్రూరంగా చూస్తున్న అతని కన్ను స్పష్టంగా కనపడింది. ముఖంలో అర్ధ భాగాన్ని మాస్క్ కప్పి వుంచడం కనపడింది! మరు క్షణం అతను రవికి కనపడకుండా తప్పుకున్నాడు!

అతను తనను అంత నిశితంగా గమనించవలసిన అవసరం ఏమిటి అని ఆలోచించసాగాడు రవి.

మనసులో వొక మూల యితన్నెక్కడో చూచాను అన్న భావన, మొదలైంది. ఎక్కడ చూచిందీ అతనెవరైందీ గుర్తు తెచ్చుకునే లోపల భవంతి సింహద్వారం ముందు నిలబడ్డ సెంట్రీ "లోపలకు రండి" అని పిలిచాడు.

భవంతి ముందు భాగంలో విశాలమైన హాలుంది. గోడలకానుకుని సోఫాలు, మధ్య డెస్క్- డెస్క్ ముందు కూర్చుని వున్నాడొక యువకుడు. డెస్క్ మీద ఫోన్, ఇంటర్‌కం వున్నాయి.

డెస్క్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేయబడి తెల్లగా మెరుస్తున్నది.

చిన్న టెలివిజన్ కెమెరాలు పైకప్పు నుండి గోడల నుండి నిత్యం హాలులోని వివిధ భాగాలను వీడియో తీస్తున్నాయి. గోడలకు ఆరడుగుల ఎత్తువరకు మెటల్, ఎలక్ట్రానిక్‌చిప్ డిటక్టర్లు అమర్చబడి వున్నాయి.

అంటే హాలు నుంచి లోపలకు వెళ్లే ప్రతి వ్యక్తి లోపల వున్న మానిటర్ రూంలోని టి.వి.స్క్రీన్‌లో కనపడుతారు. లోహపు వనిముట్లు గాని ఎలక్ట్రానిక్ పనిముట్లు గాని వున్న వాళ్లెవరూ లోపలకు వెళ్లే వీలుండదు!

హాలు పెద్ద భవంతి మొగదలలో వుంది గనుక ఎవరూ అభ్యంతరకర, ప్రమాదకర పరికరాలను తీసుకొని లోపలకు వెళ్లే వీలులేదు.

డెస్క్ వెనుక కూర్చున్నతను కాకీ యూనిఫాంలో వున్నాడు. భుజం మీద సుబేదార్ ర్యాంక్ సూచిస్తున్న నక్షత్రం గుర్తు. అతని భుజాలు విశాలంగా వుండి, నడుము సన్నగా వుండి వెనుక నుండి చూస్తే త్రిభుజం కుర్చీలో కూర్చున్నట్లున్నాడు.

పలుగుకు చొక్కా తొడిగినట్లు తిన్నగా వున్నాడు తను మెలిదిరిగిన కండలు చూచి "యితను వజ్రకాయుడు" అనుకున్నాడు రవి.

నడుము చుట్టూ వున్న తోలు పటకా నుండి పిస్టల్ వేలాడుతున్నది.

ముఖం నిశ్చలంగా పోతపోసిన ఉక్కు విగ్రహం ముఖంలా నిశ్చలంగా వుంది.

"ఇతని జీవితంలో నవ్వు ఎరుగడేమో?" అనిపించింది. అతని జేబు మీద "సుబేదార్ రుద్రారుణ" అని వుంది.

"కైలాసగిరి పర్వతం మీద అందరూ శివాంశ సంభూతులే!" అనుకుంటూ ముందుకు నడిచాడు రవి.

హాలు అవతల మరో హాలు కొంచెం చిన్నది వుంది. దాన్లో అడుగెట్టిన రవిని పెద్ద డెస్క్ వెనుక కూర్చున్న వ్యక్తి

"స్వాగతం రంజిత్ సింగ్‌జీ!" అని సాదరంగా ఆహ్వానించాడు.

"మీరు- నరసింహం కదూ?" గుర్తు పట్టటం ఏమంత కష్టం అనిపించలేదు రవికి.

"అవును- గుర్తుపట్టావే!"

"మిమ్మల్ని గుర్తు పట్టలేక పోవటమా? స్వాతంత్ర్య సమర యోధునిగా సర్దార్ కపర్ది అనుచరునిగా మీ ఫోటో అనేక మార్లు పేపర్లలో చూసాను. చూస్తున్నాను.


మిమ్మల్ని టి.వి.లోనూ చూసాను!"

ఆదర్శ మార్గం

పొరుగు వారిని ప్రేమించడం
మనస్సు విప్పి మాట్లాడడం
అవసరానికి ఆదుకోడం
అబద్ధాలను అసహ్యించుకోడం
కలసి మెలసి మసలుకోడం
బుద్ధి నెరిగి నడచుకోడం
ఆత్మ విశ్వాసాల అండతో
అడుగు ముందుకు వేయడం
పంజరాలను ప్రక్కకు నెట్టి
పణిళ్ళను ధైర్యంగా దాటి
బంగరు భవిష్యత్తు కోసం
బ్రతుకు బాటను ఎన్నుకోడం
సంస్కార వంతుల సూత్రం
సౌజన్య మూర్తుల మంత్రం.

—డా. కె. ఎల్. వి. ప్రసాద్

పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారా? అవున్నిజమే!



సాహిత్యంలో 'సెక్స్' సాధారణమై పోయింది ఏ పత్రిక చూసిన- సెక్స్‌కు ఎక్కువగా ప్రాధాన్యత నిస్తున్నారు శృంగార కథలన్నా, అలాంటి కథలన్నా, సరసమైన కథలన్నా, ఎక్స్‌ట్రా కథలన్నా, 'ఎ'- కథలన్నా, భాషలేమైనా, భావ మొక్కటే అన్నట్లు టైటిల్స్ ఏవైనా, విషయమొక్కటే కథా?

పాఠకులు సెక్స్ కథలు చదవబట్టే కదా? పత్రికలు వాటికి- అధిక ప్రాధాన్యత నిస్తున్నారు.

పాఠకులు 'సెక్స్' కథలు వెయ్యవద్దని తీర్పునిస్తే- పత్రికలు మాత్రం పబ్లిష్ చేస్తాయా? ఆలోచించండి.

శృంగారానికే అధిక ప్రాధాన్యత నిస్తే ఓ పత్రిక విడుదలైన -మూడు రోజులకే మార్కెట్లో మాయమై పోతున్నా యంటే- పాఠకుల అభిరుచి అర్థమైపోతుంది.

అన్ని ప్రయోజనాలు కోరే 'భారతి' మాసపత్రికను ఎంత మంది చూస్తున్నారు. చదువుతున్నారు?

పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారా? అంటే అవును- అక్షరాలా పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారు అని ఖచ్చితంగా చెప్పగలను

నా వాదన మీకు అర్థరహితంగానూ, అసమంజసంగానూ,- వుంది కదూ? అవున్నిజమే- ఎందు కంటే నిజ మెప్పుడూ నిష్ఠూరమే కదా?

—కొండల అక్కారావు/కంచరపాలెం

అది గత చరిత్ర! గంభీరంగా అన్నాడు నరసింహం.

"గతంలేంది వర్తమానానికి విలువేముంది? మీబోటి దేశభక్తుల త్యాగఫలమే నేడు స్వతంత్ర భారతదేశ ప్రగతికి సోపాన పంక్తి

సర్దార్ కపర్ది, మీరు ఎందరో యువకులకు ఆదర్శప్రాయులు!

మీకు నా వందన పూర్వక ప్రణామాలు"

"ధన్యవాదాలు 'రంజిత్‌సింగ్' పద- సర్దార్ నీ కోసం ఎదురు చూస్తున్నారు" ముక్తసరిగా అన్నాడు నరసింహం

హాలులోంచి వెళ్తున్న రవికి ఎలక్ట్రిక్ టైప్ రైటర్ల కదలికలు బీప్ మంటున్న కంప్యూటర్లు, రివైండ్ అవుతున్న టేప్ రికార్డర్లు చేస్తున్న శబ్దాలు గోడలవతల నుండి అస్పష్టంగా వినవచ్చాయి.

"ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యీ భవంతిలో చాలా బాగా వుపయోగించుకుంటున్నారు" రవి ఆలోచన లను భగ్నం చేస్తూ "లోపలకు వెళ్ళండి" అన్నాడు నరసింహం.

ఎనిమిది అడుగుల ఎత్తున్న దర్వాజా నుండి హాలు లోపల కడుగెట్టాడు రవి.

మరుక్షణం మూడంగుళాల మందం వున్న టేకు తలుపులు మూసి వేసాడు నరసింహం.

వినవస్తున్న శబ్దాలన్నీ ఆగి పోయాయి గుండు సూది కింద పడితే విన వచ్చేంత నిశ్శబ్దంగా వుంది హాలు.

అంత పెద్ద హాలును యిదివరకు చూడని రవి వాకిలి దగ్గరున్న సోఫాలో కూర్చుని పరిశీలించ సాగాడు. మూసి వున్న కిటికీలలోని పూలచెట్ల కుండీలు, సింహం బొమ్మలు కనపడ్డాయి. గదిలో ఉక్కగా వుండి పొగాకు వాసన స్వల్పంగా రాసాగింది

క్షణాలలో రవికి చెమటలు పట్టాయి.

మనోశక్తి ని శ్రవణేంద్రియ కేంద్రం పై ని గుడించి వినసాగాడు రవి.

గోడ మీద పాకుతున్న సాలె పురుగు చేస్తున్న సవ్వడి ట్యూబ్‌లైట్ చేస్తున్న స్వల్పాతి స్వల్ప శబ్దం, టిక్ టిక్‌మని కొట్టుకుంటున్న గడియారం శబ్దం, వాటికి తోడు ఎవరో మరో వ్యక్తి ఉచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దం వినవచ్చింది.

ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వినవస్తున్న దిశగా దృష్టి సారించాడు రవి.

అగ్గిపుల్ల గీసిన చప్పుడు, క్షణం తర్వాత అగ్గిపుల్ల వెలుగులో కపర్ది ముఖం- కోటేరు లాటి ముక్కు.

చెక్కిన గ్రీక్ శిల్పం ముఖంలాటి ముఖం కనపడింది.

"అద్భుతం రంజిత్‌సింగ్- కేవలం ముప్పై సెకండ్లలో నేనెక్కడున్నదీ కనుగొన్నావు! ఇంతవరకు అలా కనుక్కోగల్గిన వ్యక్తివి నీ వొక్కడివే" గొప్ప శబ్దగ్రహణ శక్తి, నిశిత దృష్టి వలన అంత చప్పున కనుగొన్నావు" అంటూ డెస్క్ పక్కనున్న స్విచ్ నొక్కాడు కపర్ది.

తపసు చేసుకుంటున్న ఈశ్వరుడి నుదుటి నుండి ఎర్రని లైటు వెలిగి గదిని కొంత వరకు కాంతివంతం చేసింది.

లైటు వెలుగుతున్నప్పుడు మూడో కన్ను తెరచిన శివుడిలా వుందా టేబిల్ ల్యాంప్!

"శివుడు మీ యిష్టదైవమా?" అప్రయత్నంగా అడిగాడు రవి.

"అవును లోక కళ్యాణం కోసం కాలకూట విషాన్ని కంఠంలో యిముడ్చుకున్న పరమశివుని కంటే మహాదేవు డెవరుంటారు?" ఖంగుమని మోగింది కపర్ది కంఠం.

"నా వ్యాపార సంస్థలలో పని చేసే వారిలో ఎక్కువ మందికి శివుడు నామాంతరాలు పేర్లుగా పెట్టుకున్నారు ఒక్క నరసింహం తప్ప. నా పేరు నీకు వింతగా అనిపిస్తుంది గదూ మా అమ్మ గొప్ప శివభక్తురాలు. లేకలేక పుట్టిన నాకు శివుడి పేరు కపర్ది పెట్టిందామె!"

రవి మనసులో ఆలోచనలు మెదలసాగాయి. "నీ పేరున పని చేసే కిరాయి హంతకులకు కూడా శివుడి పేర్లే పెట్టావు గదూ

కేశవ, బృహదీశ్వర, నందికేశ్వర, శివ, దాక్షారామప్రసాద్, యోగీశ్వర, రుద్రకేశ, రుద్రానంద, రుద్రారుణ.

శివుడు లోకకళ్యాణార్థం విధ్వంసం మొదలెడితే నువ్వు స్వలాభాపేక్షతో, హత్యలు విధ్వంసకాండ మొదలెట్టావు"

"రంజిత్‌సింగ్ ఏం పుచ్చు కుంటారు? కాఫీ, టీ, షర్బత్, హాట్‌డ్రింక్?" మర్యాదగా అడిగాడు కపర్ది

"నిమ్మకాయ షర్బత్ పుచ్చు కుంటాను!"

"ఉ! అన్నీ మంచి అలవాట్లే!" బెల్ కొట్టాడు కపర్ది రుద్రారుణ వచ్చి ఎదురుగా నిలబడ్డాడు

"సుబేదార్ రంజిత్‌సింగ్ గారికి ఐస్ వేసిన నిమ్మకాయ షర్బత్, నాకు గ్లాసు మంచినీళ్ళు"

తల వూపి వెళ్ళాడు రుద్రారుణ

"సర్దార్ మీరు మీ దగ్గర పని చేసే వాళ్ళను మిలటరీ రేంకులతో పిలుస్తున్నారేం" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"అవును. స్వాతంత్ర్య సమర పోరాటంలో అనేక యుద్ధాలు చేసాను- అహింసాయుతంగా-

రాజకీయాల నుండి తప్పుకున్నాక హింసా వాతావరణాన్ని తట్టుకోటానికి

మోహినీతాండవం

మిలట్రీలో పని చేసిన వాళ్ళను పనిలో పెట్టుకుంటున్నాను! మిలట్రీలో రిటైరైన వాళ్ళను వాళ్ళ జీవితాంతం మిలటరీ హోదాతో - పిలుస్తారని మీకు తెలుసనుకుంటాను"

తలూపాడు రవి

"మీ రక్షక దళంలో చాలా మంది సభ్యులున్నట్టున్నారు అన్నాడు రవి

"అవును జాగ్రత్తగా వున్నందు వలన నష్టం ఏముంటుంది? ఉదయ పూర్‌ను 1559 లో ఉదయసింగ్ అనే మేవార్ రాజు నిర్మించాడు మొగలు సైనికులు చిత్తూరు ఆక్రమించడంతో ఆయన రాజధానిని ఇక్కడకు మార్చారు

తర్వాత వంద సంవత్సరాలకు ఆయన వారసులు చిత్తూరు గిరి దుర్గం లాటి దుర్గాన్ని ఉదయపూర్ దగ్గర నిర్మించాలని అనుకుని కైలాసగిరి దుర్గాన్ని నిర్మించారు.

దుర్గ నిర్మాణం పాతిక సంవత్సరాలు పట్టింది

చిత్తూరు దుర్గం పద్దెనిమిది సంవత్సరాల ముట్టడిని ఎదుర్కొని నిలదొక్కుకోగల్గింది కైలాసగిరి దుర్గం వంద సంవత్సరాల ముట్టడినైనా ఎదుర్కొగలదని అనుకునే వారు!

కాని నిజానికి దుర్గాన్నెవరూ ముట్ట డించలేదు!

చిత్తూరు దుర్గాన్ని చూసావా రంజిత్‌సింగ్?"

"చూసాను సర్దార్ సాబ్. మీరు వివరించి చెప్పాక చిత్తూరు దుర్గానికి కైలాసగిరి దుర్గానికి మధ్య పోలికలు తెలుస్తున్నాయి! కాని మీ హెడ్ క్వార్టర్స్ యిక్కడెందుకు ఏర్పాటు చేసారు"

"నాకు యిక్కడ వాతావరణం నచ్చింది! రాజకీయాల నుండి విచ్చికంగా తప్పుకున్నాక కైలాసగిరి దుర్గం కొనుక్కుని ఇక్కడే నివాస ముంటున్నాను."

(ఇంకా వుంది)

కాదంటే కాదు

బల్లగుద్ది వాగ్దానాలు చెయ్యన్దే ఉపన్యాసం కాదు.
రంగులు మార్చన్దే రాజకీయం కాదు.
చెప్పు లిసురుకోన్దే పార్లమెంటు కాదు.
బార్ కెళ్ళన్దే భక్తి కాదు.
పైసలుబెట్టి పేకాడన్దే శివరాత్రి కాదు.
డబల్ మీనింగులేన్దే సినిమా పాటేకాదు.
సుత్తి, వేలో లేకపోతే సినిమాయే కాదు.
రుకావత్ కెలియే ఖేద్ లేకపోతే దూ(ఘో)రదర్శన్ కాదు.
సూటిగా చెప్పితే కవిత్వం కాదు.
వ్యాపార ప్రకటన కోసం పాడితే పాటేకాదు
మెలికలు తిరగన్దే ట్విస్టు డాన్సు కాదు.
అబద్ధం చెప్పనివాడు మనిషే కాదు.
అప్పు చెయ్యనివాడు అప్పారావే కాదు
మందులేన్దే పార్టీయే కాదు.
పట్టుచీర వద్దనేది పెళ్లామే కాదు.
పైసంపాదన లేనివాడు మొగుడే కాదు.
తిన్నఇంటి బీరువా సొరుగులు లెక్కపెట్టనివాడు
చుట్టమే కాదు.
డొనేషన్ వసూలు చేయన్దే స్కూలు కాదు
కాన్వెంటులో చేర్పించన్దే చదువే కాదు.
మమ్మీ డాడీ అంటేగాని సంతానమే కాదు
రాళ్ళల్లో బియ్యం కలపకపోతే వ్యాపారమే కాదు.
బిల్లు ఎక్కువ వసూలు చెయ్యన్దే డాక్టరే కాదు.
కోర్టు వ్యవహారం తొందరగా తేలుస్తే లాయరే కాదు.
మేకప్పు చెరగకుండా బయటపడితే సిటీబస్సే కాదు.
యా హూ అనకపోతే అది కరాటే కాదు.
ధిమిం, ధిమిం అననివాడు పిల్లగాడే కాదు.
అర్థం అయిందంటే అది మళయాళమే కాదు.
గిన్నీస్‌బుక్కులోకి ఎక్కన్దే విడ్డూరమే కాదు
అడగంగానే అప్పుగా ఇచ్చాడంటే అది పెట్రోలే కాదు
నడుంనెప్పి రాకుండా తిరిగి వచ్చాడంటే
అది హైదరాబాదే కాదు.
కాదంటే కాదు!

-మాదిరాజు మురళీకృష్ణ

పెళ్ళిచూపులు

టేబిల్ మీద ఉన్న ఫైలు చూస్తున్నా డన్న మాటే కానీ సుందరం మనసు మనసులో లేదు. అతని ఆలోచనలన్నీ సుహాసిని మీదే ఉన్నాయి. కనులముందు పదే పదే ఆమె రూపమే కదులుతూంది.

ఫైల్లో నుంచి తల ఎత్తి ఒక్కసారి తనచుట్టూ ఉన్న తోటి ఉద్యోగుల వైపు చూశాడు. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగి పోయివున్నారు అతను దృష్టిని మరలించి కిటికీనించి రోడ్డు మీదికి చూశాడు రోడ్డు వారగా ఉన్న బస్ స్టాపు దగ్గర ఒక ఆమె నిలబడిఉంది ఆమెను చూడగానే అప్రయత్నంగా సుందరం ముఖం విప్పారింది. ఆమె దాదాపు సుహాసినీ లాగానే కనుపించింది.

ఆ క్రితం రోజు సాయంత్రమే సుందరం, అతని తల్లి కలిసి పెళ్ళి చూపులు చూడటానికి ఆ వూళ్ళోనే మరొక వీధిలో ఉంటున్న ఒకరి ఇంటికి వెళ్ళారు. పెళ్ళి కూతురు పేరు సుహాసిని. ఆమెకు తండ్రి లేదు. తల్లి ఉంది.

పెళ్ళి చూపులు మొదలయ్యాయి. సుహాసిని వచ్చి సుందరం ఎదురుగా కూర్చున్నది. మొదటి చూపులోనే ఆమె సుందరం మనసును దోచుకున్నది ఆమె అందంగా ఉంది. మంచి ఎత్తు, ఎత్తుకు తగినలావు, పొడుగాటి జడ, పొందికగా ఉంది.

సుహాసినిలో ఎలాంటి లోపము సుందరానికి కనుపించలేదు. ఆమె ఇంటర్ పాసయింది. ప్రస్తుతం ఒక ప్రయివేట్ కంపెనీలో టైపిస్ట్‌గా ఉద్యోగం చేస్తూంది. అతనికే కాకుండా అతని తల్లికి కూడా సుహాసిని బాగానే నచ్చింది. ఆమె సుహాసినిని కొన్ని ప్రశ్నలు అడిగింది. సుహాసిని అన్నింటికి చిరునవ్వుతో జవాబు లిచ్చింది. సుహాసిని గొంతు కూడా బాగానే ఉందనుకున్నారు తల్లీ, కొడుకూ.

రెండు గంటల తరవాత పెళ్ళి చూపులు ముగిశాయి. సుహాసిని లోపలికి వెళ్ళబోతూ ఒక్కసారి సుందరం కళ్ళలోకి చిలిపిగా చూసి వెళ్ళిపోయింది అతనికి ఆ చూపులో నరనరాల్లోనూ విద్యుత్తు ప్రవహించి నట్లనిపించింది

బయటికి వస్తూ ఏ విషయం రెండు, మూడు రోజుల్లో కబురు చేస్తానన్నది సుందరం తల్లి సుహాసిని తల్లితో.

సరేనన్నదామె.

ఇద్దరూ ఇంటికి వచ్చారు

ఇంట్లోకి వచ్చిన తరవాత- "నాకు ఆ అమ్మాయి నచ్చిందమ్మా కట్నం విషయంలో మనకు పట్టింపు లేదుకదా? మనకు ఇష్టమే నని రేపు కబురు చెయ్యవచ్చును గదా?" అన్నాడు సుందరం తల్లితో.

ఆమె నవ్వి కొడుకుతో --"పిచ్చివాడా! అమ్మాయి అందంగా ఉండగానే సరిపోయిందా? గుణం కూడా చూసు కోవాలి అందులోనూ ఉద్యోగం చేస్తున్న అమ్మాయి. మనం ఆ అమ్మాయి గురించి బాగా విచారించి చేసుకోవాలి. ఆమె పనిచేసే కంపెనీలో నీకు తెలిసిన వాళ్ళెవరయినా ఉంటే అమ్మాయి గురించి అడిగి చూడు" అన్నది

సుందరం మాట్లాడలేదు. నిజానికి తల్లి ఆలోచన అతనికి నచ్చలేదు. సుహాసిని క్యారెక్టర్ గురించి ఎంక్వయిరీ చెయ్యటం చాలా నీచమయిన పనిలా తోచింది ఉద్యోగం చేస్తున్న అమ్మాయి అయితే గుణం మంచిది కాకుండా ఉండాలని లేదుకదా అనుకున్నాడు. అయినా, అతనికి ఆరా తీయక తప్పలేదు. లేకపోతే తల్లి వూరుకోదు. ఇలా అనుకొని ఆమె పనిచేసే కంపెనీలో తన స్నేహితు లెవరయినా పని చేస్తున్నారేమో గుర్తు చేసుకున్నాడు సుందరం. అతనికి హనుమంతరావు గుర్తుకు వచ్చాడు. అతనికి ఆరు నెలల క్రితమే ఆ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఆ మరురోజు సాయంత్రమే అతన్ని కలవాలను కున్నాడు సుందరం. ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. అతని గుండె నిండా సుహాసిని. తన భార్య అయినట్టుగానే కలలు కన్నాడు సుందరం ఎప్పటికో తెల్లవారు జాముకు నిద్రపోయాడు.

తెల్లవారిన తరవాత సుందరం రోజుకంటే ఉత్సాహంగా ఉన్నాడు. ఈ



వేలొప్ర బాలకేశవులు

రోజు ఈ ఎంక్వయిరి పూర్తి అయితే త్వరలో సుహాసినిని తన భార్యను చేసుకోవచ్చు ననుకున్నాడు. సుహాసిని గురించిన ఆలోచనలతోనే ఆఫీసుకు వచ్చాడు

వేగంగా వచ్చి హోటలు ముందు ఆగిన బస్సు చూడగానే సుందరం ఆలోచనలు

చెదిరిపోయాయి సుహాసినిలా ఉన్న ఆ అమ్మాయి బస్సులో ఎక్కింది. వెంటనే వెళ్ళిపోయింది బస్సు

ఒకసారి చేతికి ఉన్న వాచీ కేసి చూసుకున్నాడు సుందరం లంచ్‌కి ఇంకో ఇరవై నిమిషాలు వ్యవధి ఉంది. అతనికి సుహాసిని గురించి తెలుసుకోవటానికి సాయంత్రం వరకు ఆఫీసులోనే ఉండాలనుకుంటే విసుగనిపించింది అతనికి అప్పటి కప్పుడే ఆమె గురించి ఫార్మల్‌గా తెలుసుకుంటే సగం భారం తీరినట్లుంటుం దనిపించింది. తనకు సుహాసిని గురించి ఇన్ఫర్మేషనిచ్చే హనుమంతరావును కలవాలంటే అతని



ఇంటికి వెళ్ళవలసిందే. అతని ఇల్లు చాలాదూరం తీరా వెళ్ళితే ఉంటాడో ఉండడో? లంచ్ టైములో అయితే ఆఫీసులోనే కలుసుకోవచ్చు ఆఫీసు అక్కడికి దగ్గరే అందుకని సుందరం పెర్మిషన్ తీసుకుని ఆఫీసు నుంచి బయటికి వచ్చాడు రోడ్డు మీదికి రాగానే అతనికి బస్సు స్టాపు దగ్గర ఆగి ఉన్న రిక్షా కనుపించింది అతను దానిలో ఎక్కి అడ్రసు చెప్పాడు కదిలింది రిక్షా

ప్యాంటు జేబులోంచి సిగరెట్టు ప్యాక్ బయటికి తీసి. ఒక సిగరెట్టు ముట్టించాడు సుందరం నున్నగా ఉన్న తారు రోడ్డు మీద వాలు గాలిలో రివ్వున దూసుకు పోతోంది రిక్షా సుందరం గుండెలో సన్నగా అలజడి మొదలయింది సుహాసిని గురించి హనుమంతరావు ఏమని చెబుతాడో? నిజానికి ఆమె ప్రవర్తన ఎటువంటిదో? ఏమో? ఎలా తెలుస్తుంది? పావు గంట తరవాత అదురుతున్న గుండెను అదుపులో ఉంచుకుంటూ ఆ ఆఫీసు ముందు దిగాడు రిక్షావాడికి డబ్బులిచ్చి లోపలకు నడిచాడు అప్పుడే ఆఫీసులో నించి ఉద్యోగులు బయటికి వచ్చి క్యాంటీన్ వైపు వెళుతున్నారు వాళ్ళలో సుందరానికి హనుమంతరావు కనుపించలేదు నిముషం తర్వాత ఒక్కడే వస్తూ కనిపించాడు హనుమంతరావు అతను సుందరంను చూడగానే నవ్వుతూ విష్ చేశాడు

ఏం గురూ. ఇలా వచ్చావ్? ఏమిటి కథ?"

"ఒక చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి చెప్పాడు సుందరం

"క్యాంటీన్‌కు వెళ్ళి మాట్లాడుకుందాం పద" అని ఆ వైపు నడిచాడు

ఇద్దరూ క్యాంటీన్‌లోకి వెళ్ళి ఒక మూలగా ఎదురెదురుగా కూర్చున్నారు

హనుమంతరావు ఏవో పదార్థాలకు ఆర్డరిచ్చాడు క్యాంటీనంతా కోలాహలంగా ఉంది

"ఇంతకూ నీకు దేని గురించి ఇన్ఫర్మేషన్ కావాలి, బాయ్" అడిగాడు హనుమంతరావు బల్ల మీదికి వంగి

"మీ ఆఫీసులో పనిచేస్తున్న సుహాసిని గురించి"

"సుహాసిని గురించా?"

"అవును"

"లైన్‌లోకి వస్తున్నావా?" నవ్వుతూ అడిగాడు హనుమంతరావు

"అదేంలేదు ఆమె ఎలాంటిదో తెలియాలి"

హనుమంతరావు ఏదో అనబోయేంతలో సర్వరు పదార్థాలను వారి ముందు ఉంచి వెళ్ళిపోయాడు.

ఇంతకూ అసలు విషయం చెప్పలేదు నువ్వు" అంటూ అడిగాడు హనుమంతరావు

"నా స్నేహితుడు ఒకతను ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు ఆమె ఇక్కడ పని చేస్తూందని తెలిసింది అతనికి ఈ ఆఫీసులో తెలిసిన వాళ్ళు ఎవ్వరూ లేరు నన్నడిగితే నువ్వు తెలుసునని చెప్పాను వెంటనే నన్ను ఆమె గురించి తెలుసుకు రమ్మని పంపించాడు ఇదీ విషయం" అన్నాడు

హనుమంతరావు రెండు నిమిషాల తరవాత- తను నీకు మంచి ఫ్రెండా?" అని అడిగాడు

తల వూపాడు సుందరం కావాలనే హనుమంతరావుకు అలా చెప్పాడు

ఉన్న విషయం ఉన్నట్టుగా చె అతను బాధపడడు గదా?" ... అడిగాడు

పెళ్ళి చూపులు

'బాధపడేదేముంది' ఆమె కాపాడే ఇంకొకరు' అన్నాడు మెల్లగా అతను అప్పుడే ఏదో అనుమానం పొడచూపింది

సుందరం అలా అనగానే- "అయితే, అతన్ని ఈ సంబంధం వదులుకోమని చెప్పు అన్నాడు హనుమంతరావు

వదులుకోమనా?!"

"అవును సుహాసిని మంచిదికాదు మా ఆఫీసర్‌కూ, దానికీ లావాదేవీలు ఉన్నాయి / ఈ విషయం అందరికీ తెలుసు అసలు ఈ ఉద్యోగం దానిక ఎట్లా వచ్చిందనుకున్నావ్? వాడే ఇచ్చాడు వాడొక్కడితోనే కాదు ఇంకో ఇద్దరితో కూడా సుహాసినికి చాలా గట్టి సంబంధాలు ఉన్నాయి దానికి వచ్చే జీతంతో అది ఫ్యామిలీని పోషిస్తూందనుకుంటున్నావా' తల ఒక చెయ్యి వేసి ముందుకు నెట్టుతున్నారు మీ స్నేహితున్ని ఈ సంబంధం గురించి మరచిపొమ్మని చెప్పు ఏమయినా నన్ను కలుసుకోవటం మంచిదే అయింది" అన్నాడు హనుమంతరావు, సీరియస్‌గా.

విస్తుబోయాడు సుందరం. అతనికి మతిపోయినట్టనిపించింది. ఒక్క క్షణం అతనికి ఏమీ అర్థం కాలేదు అతని అంచనాలన్నీ తలకిందులయినాయి సుహాసిని మంచిది కాదా? ఆఫీసర్‌తో ఆమెకు సంబంధం వుందా? ఇంకో ఇద్దరితో కూడా ఆమెకు సంబంధాలు ఉన్నాయా? ఇది నిజమా?

"ఏమిటో హనుమంతరావుగారు సీరియస్‌గా మాట్లాడుతున్నారు?' అంటూ వచ్చి అతని పక్కనే కూర్చున్నాడు మరొక ఉద్యోగి

సుందరం ఎందు కోసం వచ్చింది, తను ఏమి చెప్పింది అంతా చెప్పాడు హనుమంతరావు

"సుహాసినా! అది పెద్దకాటా, సార్ దాన్నెవడండీ పెళ్ళి చేసుకొనేది? కాటాకు పెళ్లా?" పెద్దగా నవ్వాడతను

నిజంగానే సుందరంకు తల తిరిగి పోయింది ఇక నిమిషం కూడా అక్కడ కూర్చో బుద్ధి కాలేదు. ఒకసారి వాచీకేసి చూసుకొని, "ఇక నే వెళతాను ఆఫీసు టైమవుతూంది ఈ విషయాలన్నీ మా ఫ్రెండ్‌తో చెబుతాను థాంక్స్!" అని లేచి నిలుచున్నాడు

"నాకు తెలిసిన విషయం నేను చెప్పాను మీ ఫ్రెండ్‌కు సుహాసినిని చేసుకోవద్దని చెప్పు" మరొకసారి హెచ్చరిక చేశాడు హనుమంతరావు

తల ఊపుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ బయటికి వచ్చాడు సుందరం

మనసంతా అదోకలా అయిపోయింది తను సుహాసిని మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు ఆమెను తన భార్యగా వూహించుకుని ఎన్నో కలలు కన్నాడు. చివరికి ఇలా జరిగిందేమిటి? ఇంకా నయం' తను గుడ్డిగా పెళ్ళికి ఒప్పుకోలేదు- అనుకున్నాడు ఆఫీసుకు వెళ్ల బుద్ధి కాలేదు రిక్షా ఎక్కి తన ఇంటి అడ్రెసు చెప్పాడు సుందరం

* * *

నెల రోజులు గడిచాయి.

ఒక రోజు లంచ్ అవర్‌లో సుందరం మరి కొందరు ఉద్యోగులు వాళ్ళ ఆఫీసు కాంటిన్‌లో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళలా మాట్లాడుకుంటున్నప్పుడు సుందరం కోలీగ్ శివరావు ఒక ముప్పై ఏళ్లతన్ని వెంట తీసుకువచ్చాడు

రండి శివరావుగారూ. ఎవరో అతిథిని తీసుకువచ్చారో?" అన్నాడు ఒక ఉద్యోగి

శివరావు నవ్వుతూ తను తీసుకువచ్చిన




ఉత్తమ నటీనటులు విజయశాంతి, రాజశేఖర్

1990 సంవత్సరానికి ఉత్తమ నటీనటులుగా విజయశాంతి, రాజశేఖర్ ఎన్నికయ్యారు. గత ఏడాది విడుదలయిన చిత్రాలకు, నటీనటులకు, సాంకేతిక వర్గానికి ఆర్ట్ అకాడమీ అవార్డులు ప్రకటించింది.



'రౌడీయిజం నశించాలి' చిత్రంలో నటనకు గుర్తింపుగా రాజశేఖర్‌ను



ఉత్తమ నటుడిగాను, 'కర్తవ్యం' చిత్రంలో నటించిన విజయశాంతిని ఉత్తమ నటిగాను అకాడమీ ప్రకటించింది. 'మనసు-మమత' దర్శకుడు మౌళికి ఉత్తమ దర్శకుడి అవార్డు లభించింది. ఉత్తమ సంగీత దర్శకుడుగా ఇళయరాజా (కోకిల), ఉత్తమ గాయకుడిగా ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం (నారీనారీ నడుమ మురారి)లకు అవార్డులు లభించాయి.

అతన్ని వారందరికీ పరిచయం చేశాడు.

అతని పేరు గౌతమ్‌ప్రసాద్. ఒక బ్యాంకులో పని చేస్తున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదు.

ఇంతకూ ఇతను వచ్చిన పనేమిటో చెబుతాను. ఇరవై రోజుల క్రితం మన సెక్షన్‌లో టైపిస్టుగా వచ్చిన రాజేశ్వరిని ఇతడు పెళ్ళి చేసుకోవాలనుకుంటు న్నాడు. ఆమె గురించి తెలుసుకోవాలని వచ్చాడు అందరికీ చెప్పాడు శివరావు.

వెంటనే సుందరం కనుల ముందు సుహాసిని రూపం కదిలింది. తను ఆమెను పెళ్ళి చేసుకోవాలని కోరుకోవటం తన కోరిక మీద ఆమె ప్రవర్తన గురించి చేసిన ఎంక్వయిరీ అన్నీ గుర్తు వచ్చాయి. ఎవరో మాట్లాడటంతో అతని ఆలోచనలు చెదిరిపోయాయి.

గౌతమ్‌ప్రసాద్‌గారూ! చెయ్యి అబద్ధాలాడి ఒకమారైనా పెళ్ళి చెయ్యమన్నారు. నిజమే కానీ మీరు శివరావుగారి స్నేహితులు అంటే మాకు స్నేహితులే కదా? అటువంటి మీకు ఘోరమైన అన్యాయం జరగబోతూంటే చూస్తూ ఎలా వూరుకోగలం చెప్పండి? దయచేసి మీరు రాజేశ్వరిని గురించి ఆలోచించటమే మానుకొని ఆమెను మరచిపొండి అన్నాడు ఒక క్లర్కు ప్రార్థిస్తున్నట్టుగా.

ఎందుకలా అంటున్నారు? ఏమీ అర్థంకాకపోవడంతో అడిగాడు గౌతమ్‌ప్రసాద్.

ఎందుకేమిటి సార్? రాజేశ్వరి గురించి ఈ ఆఫీసులో అటెండరు మొదలు ఆఫీసరు వరకు ఎవర్ని అడిగినా చెబుతారు ఆమె ఎలాంటిదో? అదొక పెద్ద బాంకు మేనేజరుతో విపరీతంగా తిరుగుతూంది. వాడే దాన్ని ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అలాంటి మనిషిని మీరు చేసుకుంటారా? వద్దు సార్, వద్దు. ఆంధ్రదేశంలో అందమైన అమ్మాయిలకు కొరతలేదు. ఇంకెవరినయినా చేసుకొండి అన్నాడు తను మళ్ళీ శ్రేయోభిలాషిలా.

అతని మాటలు వినగానే సుందరంకు ఎవరో కొరడాతో ఛళ్ళుమని కొట్టినట్లనిపించింది. ఇతనేమిటి రాజేశ్వరి గురించి ఇలా చెబుతున్నాడు? అనుకున్నాడు సుందరం. వెంటనే– అంతా అబద్ధం వీళ్ళ మాటలు నమ్మవద్దు గౌతమ్‌ప్రసాద్. వీళ్ళంతా నీచులు. రాజేశ్వరి మంచిది, నిప్పులాంటిది అని పెద్దగా అరవాలనిపించింది. అతనికి మాటలు బయటకి రాలేదు. అయోమయంగా తోచింది.

రాజేశ్వరి ఇరవై రోజుల క్రితం మరో చోటు నుంచి బదిలీ అయి ఆ ఆఫీసుకు వచ్చింది. ఆమె అందమైనది. ఎవరినయినా సులభంగా ఆకర్షించగలదు. ఆమె ఆ ఆఫీసులో అడుగుపెట్టిన రోజు నుంచి ప్రతి ఒక్కరూ (ఒకరిద్దరు ముసలివాళ్ళు కూడా) ఆమెకు వలలు విసిరారు. కాని రాజేశ్వరిలో అలాంటి వికారాలు ఏమీ లేకపోవటం వల్ల ఎవ్వరి వలలోనూ ఇరుక్కోలేదు. చాలా మంది ఆమె దగ్గర మరి వెకిలిగా ప్రవర్తించారు. వాళ్ళను తిట్లతో సత్కరించింది ఆమె. ఆఫీసులో అందరూ ఒక అత్యవసర సమావేశం జరిపి ఆమె మంచిది కాదనే ప్రచారం చెయ్యాలనే గట్టి నిర్ణయానికి వచ్చారు.

సుందరం చూస్తుండగానే గౌతమ్‌ప్రసాద్ చిన్నబుచ్చుకున్న మొహంతో ఇంకేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. అతను వెళ్ళగానే అందరూ పెద్దగా నవ్వారు.

వాళ్ళ నవ్వు చూస్తుంటే సుందరంకు వాళ్ళంటే అసహ్యం కలిగింది. 'వెధవ మనుషులు' అనుకున్నాడు.

అతనికి ఆ క్షణంలో తన మిత్రుడు అనుకున్న హనుమంతరావు చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. అతను సుహాసిని గురించి ఎందుకలా చెప్పాడో కూడా అర్థమయింది. ఎంత అన్యాయం జరిగింది? సుహాసిని కూడా రాజేశ్వరి ఉన్న పరిస్థితిలోనే ఉండి ఉంటుంది. అప్పట్లో తను ఇలా చెప్పే మనుషులు కూడా ఉంటారని వూహించలేకపోయాడు.

సుందరం కనుల ముందు మంచు తెరలు తొలగాయి. అతనికి మనసు నిలువలేదు. వెంటనే సుహాసిని దగ్గరికి పరుగున వెళ్ళి ఆమెను చేసుకోవటం తనకు ఇష్టమేనని చెబుదామనుకున్నాడు. కాని ఆమె ఆ సమయంలో ఆఫీసులో ఉంటుందనే

మీకు తెలుసా?

టెస్ట్ సెంచరీ చేసిన ప్రథమ భారతీయుడు

టెస్ట్ క్రికెట్‌లో సెంచరీ చేసిన తొలి భారతీయుడు లాలాఅమర్‌నాథ్. బొంబాయిలో 1933-34 లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 118 పరుగులు చేశాడు.

ఎక్కువ సమయంలో డబుల్ సెంచరీ

ఎక్కువ సమయంలో డబుల్ సెంచరీ చేసిన ఖ్యాతి ఎ.డి. గయక్వాడ్‌దే. 1983లో పాకిస్తాన్‌తో జరిగిన క్రికెట్ పోటీలో 652 నిముషాలలో 201 పరుగులు సాధించాడు.

డబుల్ సెంచరీ చేసిన ప్రథముడు

క్రికెట్‌లో ప్రథమంగా డబుల్ సెంచరీ చేసిన ఘనత పోలీ ఉమ్రిగర్‌కు దక్కుతుంది. 1955లో హైదరాబాద్‌లో న్యూజిలాం



డ్‌తో జరిగిన టెస్ట్‌లో ఉమ్రిగర్ 233 పరుగులు చేశాడు.

ఎక్కువ నాటౌట్లు

ఎక్కువ క్రికెట్ టెస్ట్ పోటీలలో నాటౌట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచిపోయిన ఘనత బి.ఎస్. చంద్రశేఖర్‌కు దక్కుతుంది. అతను పాల్గొన్న 58 టెస్ట్‌లలో 39సార్లు నాటౌట్ బ్యాట్స్‌మెన్‌గా మిగిలిపోయాడు.

ఎక్కువ సమయంలో సెంచరీ

సెంచరీ సాధించటానికి ఎక్కువ సమయాన్ని తీసుకున్న ఘనత దిలీప్ వెంగ్‌సర్కార్‌కు దక్కుతుంది. 1979లో పాకి



స్తాన్‌తో జరిగిన క్రికెట్ పోటీలో వెంగ్‌సర్కార్ 437 నిముషాలు ఆడి సెంచరీ సాధించాడు.

తక్కువ బంతులలో సెంచరీ

క్రికెట్‌లో తక్కువ బంతులలో సెంచరీ సాధించిన ఘనత సునీల్ గవాస్కర్‌దే. 1983లో ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండవ టెస్ట్‌లో గవాస్కర్ 94 బంతులలో సెంచరీ సాధించాడు.

50 పరుగులు

తక్కువ సమయంలో 50 పరుగులు (హాఫ్ సెంచరీ) సాధించిన ఘనత సలీమ్ దురానీకి దక్కుతుంది. 1964లో కాన్పూరులో ఇంగ్లండ్‌తో జరిగిన పోటీలో 29 నిముషాలలోనే దురానీ 50 పరుగులు సాధించాడు.

డక్ అవుట్, సెంచరీ

క్రికెట్ టెస్ట్ చరిత్రలో డక్ అవుట్, సెంచరీ చేసిన క్రీడాకారుడు జి.ఆర్. విశ్వనాథ్. 1969-70లో కాన్పూరులో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌లో విశ్వనాథ్ 0,137 పరుగులు చేశాడు.

సేకరణ: తిలక్

పెళ్ళిచూపులు

విషయం గుర్తుకు వచ్చింది. సాయంత్రం ఆఫీసు వదలగానే ఆమె ఇంటికి వెళ్ళాలనుకున్నాడు.

సాయంత్రం వరకూ అసహనంగా గడిపాడు.

చివరికి సాయంత్రమయింది. ఆఫీసు వదిలాడు.

రివ్వున బయటికి వచ్చాడు సుందరం. అతనికి ఎంతో సంతోషంగా ఉంది. తన కలలు మళ్ళీ నిజం కాబోతున్నాయి. రిక్షాలో వెళితే ఆలస్యమవుతుందనుకున్నాడు. అందుకని ఆటో ఎక్కి సుహాసిని అడ్రెస్ చెప్పాడు.

పదినిమిషాలు గడిచాయి.

ఆటో సుహాసిని ఇంటిముందు ఆగింది, ఆ ఇంటి తలుపుల మీద అదురుతున్న గుండెతో టకటకా కొట్టాడు.

సుహాసిని తలుపు తెరిస్తే ఆమెకు ఏమని చెప్పాలి? ఎలా చెప్పాలి? సుందరంకు సిగ్గు అనిపించింది.

భళ్ళున తలుపులు తెరచుకున్నాయి.

ఎదురుగా— పాల నురుగులాంటి షిఫాన్ చీరలో బొమ్మలా నిలుచున్న సుహాసిని! ఎత్తయిన గుండె మీద వ్రేలాడుతున్న మంగళ సూత్రం!

సుందరంకు షాక్ కొట్టినట్టనిపించింది.

సుహాసినికి పెళ్ళయిందా?!

ఆమె కూడా సుందరంను చూసి ఆశ్చర్యపోయింది. అతను ఎందుకు వచ్చింది అర్థం కాలేదు. ఏదో అడగబోయింది.

అప్పటికి సుందరం ఆ షాక్ నించీ, తనను ఆవహించుకున్న నిరుత్సాహం నించీ బయటపడ్డాడు.

"సారీ!" అని తనలో తనే గొణుక్కుంటూ గుమ్మం దిగి గబగబా రోడ్డు మీదికి తడబడే అడుగులతో వెళ్ళిపోయాడు.

అతని ప్రవర్తన వింతగా అనిపించి అతన్నే చూస్తూ గుమ్మం దగ్గర బొమ్మలాగా నిలబడిపోయింది, పెళ్ళయిన సుహాసిని. ○

హలో! డాక్టర్ నేనేం చెయ్యాలి?

డా. కొత్త రవీంద్రబాబు



ఎన్.ఎస్.రెడ్డి,కొత్తవలస.

ప్ర:హెర్నియా అపరేషన్ చేయించుకుని ఆరు నెలలయింది. భార్యతో రతి కార్యక్రమంసల్పవచ్చా?

జ : అపరేషన్ అయిన మూడు నెలల తర్వాత నిర్భయంగా రతిలో పాల్గొనవచ్చు.

ఎం.ఈశ్వరి,గుడివాడ.

ప్ర : రెండు రొమ్ములలో కుంకుడు గింజలంత కణితులున్నాయి. బహిష్టు సమయంలో విపరీతమైన నొప్పులు పుడుతున్నాయి.

జ : ఎలియాన్ 600 మిల్లీ గ్రాముల గొట్టాం రోజు కొకటి చొప్పున రెండు నెలలువాడండి.

ఎఫ్.శివరావు,నందికొట్కూరు.

ప్ర : కామెర్లు, జ్వరం, కడుపు నొప్పి డాక్టరు గారికి చూపితే పసరు తిత్తిలో రాళ్ళున్నయ్యన్నారు.

జ:కోలిసిస్టోగ్రఫీ,అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయించి చూడండి. పసరు తిత్తిలో రాళ్ళుంటే అపరేషన్ చేయించుకోండి.

ఎ.శివాలక,మంగళగిరి.

ప్ర:మీకు బాగా నచ్చిన పుస్తకాలేవిటి?

జ : మనసు చికాకుగా వున్నపుడు కన్యాశుల్కం ప్రైడ్ అండ్ ప్రెజుడిస్,గాన్ విత్ ద విండ్ పుస్తకాలు తెరచి అవి తెరచుకున్న పేజీ నుండి చదువుకు వెళ్ళటం నాకలవాటు.

ఎన్.ఆర్., విజయవాడ

హెర్నియా వచ్చిన పది సంవత్సరముల తర్వాత ఆపరేషన్ చేయించుకున్నాను. అందువలన అంగం చిన్నదై నపుంసకత్వం వచ్చిందనుకుంటున్నాను.

అలస్యంగా హెర్నియా ఆపరేషన్ చేయించుకున్నందువలన ఏవిధమైననష్టమూ జరుగలేదు. మీకు నపుంసకత్వం వచ్చిందన్నది అపోహ మాత్రమే! ఇక ఆ విషయం గురించి భయపడవద్దు.

మహమ్మద్ సద్దాం

రాత్రిపూట వీర్యస్ఖలనం. ఏదైనా కంగారు అదుర్దా తొందరకలిగినప్పుడు ఇంద్రియ స్ఖలనం జరుగుతుంది.

స్పీమన్ బిళ్ళలు రోజూ మూడు చొప్పన మూడు నెలలు వాడండి. అవివాహితులలో అలా రావడం అసహజం కాదు.

డి. ఉమ, పామిడి:

గుండెనొప్పి వస్తుంది. జుట్టు పెరగాలి. గుండె జబ్బు ఎలా తగ్గుతుంది?

గుండెనొప్పి రాగానే గుండె జబ్బుందని అనుకోనక్కర్లేదు. డాక్టర్ గారికి చూపించుకోండి. జెబెక్స్ బిళ్ల రోజుకొకటి భోజనానంతరం మూడు నెలలు వాడండి.

పి.సుదర్శనరావు,ఏలూరు.

ప్ర : దేముడున్నాడని నమ్ముతున్నారా? లేదా?

జ : ఆ విషయం గురించి నె నెవరితో నూ చర్చించను!

సి.కావేరి,గుంటూరు.

ప్ర : మా మనుమరాలికి తొర్రి పెదవి వుంది. ఏం చేయాలి. వయసు రెండు సంవత్సరములు.

జ : వెంటనే అపరేషన్ చేయించండి. మాటలు రాకముందే చేయించటం ఉత్తమం.

మనోహర్ బాబు, నెల్లూరు:

కుడి బీజం బాధగా నొప్పిగా వుంటుంది.

పాడ్రజాన్ వంద మిల్లీగ్రాముల బిళ్లలు రోజూ మూడు భోజనానంతరం ఇరవై రోజులు, సైన్ స్టాట్ పోర్ట్ బిళ్లలు రోజు రెండు చొప్పన పది రోజులు వాడండి. తగ్గకపోతే డాక్టరు గారికి చూపించుకోండి.

గీత, పామిడి:

బలానికి,లావు పెరగడానికి మందుకావాలి.

స్రొంబా బిళ్ల రోజుకొకటి చొప్పన నెలవాడండి. పాలు, పళ్లు, గుడ్లు అహారంతో పాటు తీసుకోండి.

కె.ఎస్., అనకాపల్లి


చదువుపట్ల ఆసక్తి వుండడం లేదు. జ్ఞాపకశక్తి తక్కువ.

చదివిన విషయం నెమరువేసుకుంటుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఫైన్ సిఫ్లబాల్ బిళ్లలు రోజుకొకటి చొప్పన రెండు నెలలు వాడండి.


ఇ.రమణి,కాకినాడ.

ప్ర.మీకునచ్చినమీనవలఏది?

జ నేను రాసిన నవలల్లో నాకు నచ్చనిదేదీలేదు! ○



సీరియల్



నేత్రధనుస్సు

సాతవాహన

ఇంతవరకూ సాగిన కథ-10 : డేగర్ మురా సి.బి.ఐ. ఆఫీసర్ యశ్వంత్‌కుమార్ కూతురు మనోజను కాల్చి చంపి అతణ్ణి కిడ్నాప్ చేస్తుంది. ఈ సంఘటనపై ఇన్‌స్పెక్టర్ కార్తికేయ దర్యాప్తు ప్రారంభిస్తాడు. గతంలోని సి.బి.ఐ. ఆఫీసర్ల ఆచూకీపై దర్యాప్తు చేస్తున్న ఫైలును అందజేయమని మురానాయకుడు చిదానందం - యశ్వంత్‌ను బలవంత పెడతాడు. బాధల్లో వున్న నయనతారకు ధైర్యం చెప్పేందుకు పూర్ణా మేడమ్ రాగా అనాధశరణాలయ వార్షికోత్సవంలో చిదానందం కొడుకు ముద్దుకి బుద్ధి చెప్పిన విషయం జ్ఞప్తికి వస్తుంది.

(గత సంచిక తరువాయి)

చిదానందం తన బంగళాలోని హాల్లో నిలబడి అక్కడ సాగుతున్న తతంగాన్ని పర్యవేక్షిస్తున్నాడు.

ఆ హాల్లో దాదాపు ఇరవైమంది వ్యక్తులు చకచకా పనిచేస్తున్నారు. హాల్లో ఓ వైపు వికలాంగులకు పనికొచ్చే క్రచెస్, వీల్‌ఛైర్స్ మొదలైన వస్తువులు కోకొల్లలుగా వున్నాయి. ఆ ఇరవైమంది వ్యక్తులూ వాటిని అతి జాగ్రత్తగా ప్యాక్ చేస్తున్నారు. పంజాబ్‌లోని వికలాంగులకు వుచితంగా అందజేస్తానని చిదానందం మేజర్ చక్రవర్తికి మాటిచ్చిన పదిలారీల సామాను అదే.

చిదానందం పైకెంతో దయార్ద్ర హృదయంతో సాగిస్తున్నట్టుగా కనిపించే ఆ సేవా కార్యక్రమం వెనక బయటి ప్రపంచానికి ఎంత మాత్రం తెలీని భయంకర రహస్యం ఒకటి దాగుంది. వికలాంగులకు పనికొచ్చే ఆ వస్తువుల్లో డ్రగ్స్‌దాచి దేశంలోని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తాడు చిదానందం. వికలాంగుల దీనమైన జీవితాలకు ఒక అర్థాన్ని కల్పించే ఆ వస్తువుల్లో సాటి మనుషుల ప్రాణాలు తీసే మాదకద్రవ్యాలు సరఫరా చేస్తాడు. తనకంటూ పెద్దలాభం లేందే యేపనీ చేసే అలవాటు చిదానందానికి లేదు.

చిదానందం పక్కనే మణి నిలబడి వున్నాడు.

"జాగ్రత్త! వికలాంగులకు మనముదా సప్లైచేసే ఈ వస్తువుల్లో నిండా డ్రగ్స్‌దా పెట్టి ప్యాక్ చేస్తుండామని మూడో కంటి వానికిదా తెలియరాదు అండర్‌స్టాండ్?" అంటున్నాడు చిదానందం.

మణి తలూపాడు.

ఇంతలో ప్యాకింగ్ జరుగుతున్న వైపు నుంచి ఏదో కిందపడ్డ చప్పుడు బిగ్గరగా వినిపించింది. చిదానందం అదిరిపడి ఆ వైపు చూశాడు.

చిదానందం ఒక్కడే కాదు, ఆ హాల్లో ప్రతి ఒక్కరూ చేస్తున్న పనాపి ఆ వైపు చూశారు.

సుమ్మం దగ్గర బక్క చిక్కిపోయి దీనంగా కనిపిస్తున్న ఓ వ్యక్తి గజగజా వణికిపోతూ నిలబడివున్నాడు. ప్యాక్ చేసిన సామాను అక్కడ్నించి బయటికి మోసుకుపోతున్నవాళ్ళలో అతనొకడు. ఓ పెద్ద ప్యాకేజ్ నెత్తిమీద పెట్టుకుని బయటికి తీసుకుపోబోతూ తూలి కిందపడిపోయాడతను. అతన్తోపాటే అతను మోసుకెళ్తున్న ప్యాకేజీ కూడా కిందపడిపోయింది 'ప్యాకేజీ కిందపడడంతో ... లో వున్న వస్తువులన్నీ బైటపడిపోయా ... . వాటిలో పెద్ద ఎత్తున బ్రౌన్‌షుగర్ ప్యాకెట్లు కూడా వున్నాయి. ఆ ప్యాకెట్లన్నీ చిట్లి బ్రౌన్ షుగరంతా నేలమీద చెల్లాచెదురుగా పడిపోయింది.

ఆ దృశ్యం చూస్తూనే చిదానందం ఒక్కసారిగా ఆగ్రహోదగ్రుడై పోయాడు. చరచరా ఆ మనిషి దగ్గరికి నడిచి ఫెడీమంటూ అతని మొహం మీద కొట్టాడు ఆ దెబ్బకు అతని పెదవి చిట్లి రక్తం కారసాగింది. కళ్ళు బైర్లు కమ్మి తూలికిందపడబోతూ అతికష్టం మీద నిలదొక్కుకోగలిగాడు.

"రాస్కెల్! లక్షలుదా ఖరీదుచేసే బ్రౌన్ షుగర్దా నిండా నేలపాలు చేస్తివిగదరా! నీ చర్మందా ఒలిపిస్తు," హుంకరించాడు చిదానందం.

"క్ష...క్ష...క్షమించండి బాబూ. నాలుగు రోజుల్నుంచీ అన్నం లేదు ఒరువులెత్తుతుంటే కళ్ళు తిరిగి కిందపడ్డాను," గజగజా వణికిపోతూ దీనంగా అన్నాడా మనిషి.

చిదానందం మళ్ళీ అతని మొహం మీద ఫెడీమని కొట్టాడు ఈసారి ఆ దెబ్బకు నిలదొక్కుకోలేక తూలి కిందపడిపోయాడా మనిషి. క్షమాపణలు చెప్పుకున్నా చిదానందం తనని కొట్టినందుకు అతనికి గుండె రగిలిపోయింది.

"యేటి బాబూ, పనిచేయించుకుని డబ్బులైతే ఎగ్గొడతారుగానీ కళ్ళు తిరిగి 'కింద పడితే కొడతారు. ఇదన్యాయం బాబూ, చాలా అన్యాయం," ఆక్రోశిస్తున్నట్టుగా అన్నాడతను.

ఆ మరుక్షణం మణి యమకింకరుడిలా అతనిమీదికెళ్ళి బలవంతంగా రెక్కపట్టుకుని పైకెత్తాడు.

"ఎంత పొగర్రా నీకు! దొంగనాయాలా, అయ్యగారికే తిరగబడతావా?" వురిమాడు.

ఆ మనిషి మరింత వుక్రోషంగా చూశాడు.

"రెక్కలు ముక్కలు చేసుకున్నాక కూలి డబ్బు లెగ్గొట్టే ఈ పెద్ద మనిషట్టంటోళ్ళకు తిరగబడాలా, వీళ్ళని నరికి పోగులె

ట్టాలా! ఈయనగారి కొడుకు మాయట్టాంటి బీదోళ్ళ కడుపు కొట్టి మాకు రావాల్సిన కూలి డబ్బు కూడా దోచుకుపోతాడు. నీ యట్టాంటి కుక్కల్ని అండగా చేసుకుని ఈ పెద్దమనిషి మా మీద జబర్దస్తీ చలాయిస్తాడు. ఇంక ఈ దౌర్జన్యాన్ని సహించేది లేదు," నీరసంగానే వున్నా చాలా ఆవేశంతో చెప్పాడతను.

"ఏం కూశావ్?" అంటూ మణి బొడ్లోంచి కత్తి బైటికి లాగి అతన్ని పొడవబోయాడు.

సరిగ్గా అదే క్షణంలో చిదానందం అతని భుజం పట్టి ఆపాడు.

"మణీ! నీవుదా పక్కకు జరుగుమీ. వీని సంగతి నేనుదా చూస్తాను," అన్నాడు.

మణి ఒకసారి ఆ మనిషికేసి వురిమి చూసి పక్కకు జరిగిపోయాడు

చిదానందం చిరునవ్వులు చిందిస్తూ ముందుకొచ్చి చనువుగా ఆ మనిషి భుజం మీద చెయ్యేశాడు.

"పాలం, దెబ్బ తగిల్నావి తానె? ఆకలి వేస్తా వుండాదా? నీకు వణ్ణం నేనుదా పెడుదు- కడుపునిండా పెడుదు," అంటూ నెమ్మదిగా కిందికి వంగాడు.

ఆ మనిషి కళ్ళప్పగించి అతనికేసే చూస్తున్నాడు.

కిందికి వంగిన వాడల్లా చిదానందం ఓ బ్రౌన్ షుగర్ ప్యాకెట్ చేతిలోకి తీసుకున్నాడు.

"తంబీ, ఆకలిదా వేస్తా వుండాలి తానె? ఇంద, ఇదిదా తిను," అంటూ ప్యాకెట్లోని బ్రౌన్‌షుగర్ అతని మొహం మీదికి విరజిమ్మాడు.

"యామిరా నిండా కోపంగా చూస్తువు? తినుమీ," అనునయంగా చెబుతున్న వాడిలా చూశాడు.

ఆ మనిషికళ్లు అప్రయత్నంగా పెద్దవయ్యాయి. ఆ కళ్ళలో అకస్మాత్తుగా అంతులేని భయం ప్రవేశించింది. మనిషి మళ్లీ గజగజా వణికి పోనారంభించాడు.



వినపడుతోందా నా పిలుపు

నా పిలుపు నీకు వినపడుతోందా?
గాలినీ నీటినీ నెట్టి
సముద్రాల్నీ అడవుల్నీ తట్టి
ఎడారుల్నీ పర్వతాల్నీ చుట్టి ప్రతిధ్వనిస్తోంది
సంవత్సరాల తరబడి
వందల వేల సంవత్సరాలుగా నిలబడి
నేను పిలుస్తూనే వున్నాను
చెంతనే వున్నా
నీ చెవికి చేరడం లేదా?
మన మధ్య సమాంతర రేఖలు గీచి
సరిహద్దులు నాటి
మతోన్మాద జాతి విధ్వంసక ఉన్మాదులు
లౌకిక భావనా ఛిద్రకులు
మత కరాళ దాంష్ట్రా కిరాయి కసాయిలు
నీ ముందు వింధ్య పర్వతాల్ని పాతుతున్నారు
బెర్లిన్ గోడల్ని నిలుపుతున్నారు
అగాధాలను అగడ్తలను త్రవ్వుతున్నారు
నీ చెవిలో చెట్లను పెంచుతున్నారు!
వారి పాశవిక వ్యూహ రచనా వలయంలో
మనల్ని మనమే ఉరేసుకొంటున్నాం
విచ్చుకత్తుల్తో హత్య చేసుకొంటున్నాం
పైగంబరులం దిగంబరులమై కాల్చుకొంటున్నాం!
మనిషిని మనిషి చంపుకొనే మన పోకడులు
మతమే బ్రతుకనే మన ఆరాధనలు
ప్రపంచానికి నవ్య ప్రభోదాలై నిలిచాయి!
నా పిలుపు నీకు వినపడుతోందా?
నీ ప్రతిస్పందన కనబడకుండా వుంది
వెలుగులో గుడ్లగూబలా గూటిలో నక్కి కూర్చుంటావు
చిత్తడిలో తడిసిన అగ్గిపుల్లలా
సహాయ నిరాకరణ చేస్తుంటావు
మనం రెండు నీటి బిందువుల్లా కలిసిపోవాలి
ఏ శాస్త్రజ్ఞుడికీ
ఏ పరిశోధనకీ
అందనంత
అందుకోలేనంత
అర్థం కానంతగా
అరేబియా హిందూ మహాసముద్రంలా సంగమించాలి!

- అడిగోపుల వెంకటరత్నమ్

"వద్దు...ఆ విషం నాకొద్దు," అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ అనగలిగాడు.

"వూహూ! నీ ఆకలిదా తీరాలె. తినుమీ," వత్తిడిచేశాడు చిదానందం పెదవులు నవ్వుతున్నట్లుగానే వున్నా అతని కళ్లు విషపూరితంగా చూస్తున్నాయి.

"వద్దు .. నా కొద్దు."

"తినుమీ! తినకుంటె వా నీ తలదా పేలిపోవును. తినుమీ," ఆజ్ఞాపించాడు చిదానందం.

"వద్దు."

"తినుమీ!" అకస్మాత్తుగా గర్జించాడు చిదానందం.

ఆ గర్జనకు అక్కడున్నవాళ్లందరూ ఒక్కసారిగా వులిక్కిపడ్డారు ఈ సారి చిదానందం గొంతులో ధ్వనించిన కర్కశత్వానికి అతను పూర్తిగా బెదిరిపోయాడు.

"వూ!" వురిమాడు చిదానందం.

ఆ మనిషి వణికిపోతున్న చేతుల్తో ఆ ప్యాకెట్లోంచి బ్రౌన్ షుగర్ తీసి ఒకసారి చిదానందంవంక బెదురు కళ్లతో చూశాడు.

"మణీ! మన మిత్రునికిదా ఆకలి వేస్తా వుండాది తిండి తినిపించుమీ," ఆర్డర్ జారీ చేశాడు చిదానందం.

అంతే ఆ మరుక్షణం మణి పులిలా ఆ మనిషిమీద పడ్డాడు. అతని తల ఓ చేత్తో దొరకబుచ్చుకుని రెండో చేత్తో బలవంతంగా అతని చేత బ్రౌన్‌షుగర్ తినిపించాడు. ఆ పొడి ముక్కులోకీ గొంతులోకీ పోవడంతో వూపిరందక అతను వుక్కిరి బిక్కిరయ్యాడు. కళ్ళు తిరగనారంభించాయి.

"వూ , ఇంకా తినిపించుమీ," అన్నాడు చిదానందం.

మణి వెంటనే తనవాళ్ళిద్దరికి సైగచేయడంతో వాళ్ళు చప్పున ఆ మనిషిని రెక్కలు విరిచి పట్టుకున్నారు. మణి బలవంతంగా అతని నోరు తెరిచి బ్రౌన్‌షుగర్ గుమ్మరించాడు.

అతను మొదట దాన్ని బయటికి వూసెయ్యడానికి ప్రయత్నించాడు. అయితే అదతనికి సాధ్యం కాలేదు. కొద్ది క్షణాల తర్వాత నెమ్మదిగా కిందికి జారిపోయాడు

చిదానందం మణి భుజం మీద చెయ్యేశాడు.

"వీడ్నిదా ఈడ్చుకొనిపోయి ల్యాబొరేటరీలో పడవేయుమీ," ఆదేశించాడు.

ఆ మాటకర్థం మణికి బాగా తెలుసు. చిదానందానికి డ్రగ్స్ రిఫైనింగ్ ల్యాబొరేటరి ఒకటుంది. ఆ ల్యాబ్‌లో డ్రగ్స్ రిఫైన్ చేయగా మిగిలే రెసిడ్యువరీని ఓ కందకంలో పారేసి దాంట్లోంచి విషవాయువులు వెలువడకుండా జాగ్రత్తగా గ్లాస్ లిడ్స్‌తో కప్పెట్టేస్తారు. చిదానందానికి ఎదురు తిరిగేవాళ్ళను

నేత్రధనుస్సు

ఆ కందకంలో పారేస్తారు. ఆ కందకం లోంచి వెలువడే విషవాయువులు అందులో పడినవాళ్ళ ప్రాణాలు నెమ్మదిగా హరిస్తాయి.

చిదానందం ఆజ్ఞాపించిన వెంటనే మణి ఆ మనిషిని ఈడ్చుకెళ్ళిపోయాడు

చిదానందం అక్కడ పనిచేస్తున్న వాళ్ళ వైపోసారి విషపూరితంగా చూశాడు.

"చూస్తిరా వాడి గతి? నాకుదా ఎదురు తిరిగినవానికి ఇదిదా శిక్ష", హుంకరించాడు.

అక్కడ పనిచేస్తున్న వాళ్ళ కళ్ళలో అపరిమితమైన భయం తొంగి చూసింది. అతనలా హుంకరించగానే వాళ్ళందరూ ఒకేసారి వులిక్కిపడి చకచకా పనిచేయడంలో మునిగిపోయారు.

మణి అతన్నక్కడ్నించి ఈడ్చుకెళ్ళిపోతుండగానే ముద్దు ఆ హాల్లో ప్రవేశించాడు. మణి ఈడ్చుకెళ్ళిపోతున్నతని కేసి విచిత్రంగా చూసి తండ్రివైపు తిరిగాడు.

"అప్పా, ఇదేమిటి?" కేజువల్‌గా అడిగాడు.

చిదానందం కొడుక్కేసి అంతులేని ప్రేమ కురిపిస్తున్నవాడిలా చూశాడు.

"నా చిట్టితండ్రీ, నీవ్ వా నాతో," అంటూ అతని బుగ్గ నిమిరాడు.

ఆ కాస్తంతకే ముద్దు ఐసైపోతూ తండ్రి వెంట అతని పర్సనల్ ఛేంబర్స్‌లోకి నడిచాడు. ఆ గదిలోకెళ్ళగానే చిదానందం తలుపు మూసి గొళ్ళెంపెట్టాడు. తర్వాత నెమ్మదిగా కొడుకువైపు తిరిగాడు. ముద్దు అతనికేసి వాటంత మొహం చేసుకుని చూస్తున్నాడు.

చిదానందం అమాంతం కొడుకు జుట్టు పట్టుకుని చావబాదనారంభించాడు ముద్దు కుయ్యో మొర్రోమంటూ తండ్రి చేతుల్లోంచి విడిపించుకున్నాడు.

"అప్పా, యేమిటిది?" సగం వుక్రోషంగానూ, సగం ఏడుస్తున్నట్టుగానూ అన్నాడు. "నిన్ననేమో శరణాలయంలో ఆడపిల్లల ముందు తేలుకుట్టినవాడ్ని కొట్టినట్టు చెప్పుతో ఎడాపెడా వాయించేశావ్. ఇప్పుడేమో దెయ్యం పట్టినవాడ్ని వేపమండల్తో చావబాదినట్టు బాదేస్తున్నావ్. అసలు నేనెలా కనిపిస్తున్నాను నీకళ్ళకు?" ఖస్సుమన్నాడు.

"నీకు దెయ్యముదా పట్టినాది చిట్టి తండ్రీ," వెటకారంగా అన్నాడు చిదానందం. "దాన్నిదా వదిలిస్తా వుంటి. దినామూ నీ సోకుకు వేలకు వేలుదా డబ్బు పూడుస్తా వుండావ్. కూలివాండ్ల డబ్బు వెయ్యడానికి, నీకేమి పూడ్చేకాలం వచ్చిందిరా నాయినా?"

"నాయినా? అప్పా, నన్ను కుక్కంటావా," దాదాపుగా ఏడ్చేస్తూ అన్నాడు ముద్దు.

"దినామూ పాయసందా మింగుతా చెప్పనాకే వానిని నాయుదా అంటారు శరణాలయములో నీవుదా కుంటిపెణ్ణునీ, గుడ్డి పెణ్ణునీ ఎప్పుదా ఆడదానికి సిగ్గులేదా? నీ మరదలు చిలకని తెచ్చి నీకుదా పెండిలి చేస్తె. అప్పుడు నీ తిక్కదా కుదురును," అన్నాడు చిదానందం.

ఆ మాట వింటూనే ముద్దుకు దిమ్మ తిరిగిపోయింది.

"అప్పా, నా పిలక నీ చేతుల్లో వుందనా ఆ చిలకని తెచ్చి నాకు పెళ్ళి చేస్తానంటున్నావ్? నీ ముద్దు బొద్దుగా ముద్దుగా వుంటాడు. ఆ ఎద్దులాంటి చిలకని తెచ్చి చేశావంటే దానిముందు నేను ఎలకలా వుంటాను," అంటూనే ముద్దు అకస్మాత్తుగా సీరియస్‌గా మారిపోయాడు. "నీకు నిజంగా నా మీద ప్రేమే వుంటే ఆ చిలకని కాదు, మరో చిలకని తెచ్చి నాకు పెళ్ళి చేసుండేవాడివి," నిష్ఠూరంగా అన్నాడు.

చిదానందం ఈసారి కాస్త విస్తుపోయాడు.

"ఎవర్రా ఆ చిలక?" అనుమానంగా చూస్తూ అడిగాడు.

"నయనతార," గర్వంగా చెప్పాడు ముద్దు.

చిదానందం ఈసారి పూర్తిగా నిర్ఘాంతపోయాడు.

"ఎవరు? ఆ గుడ్డి పెణ్ణుతానె?" అన్నాడాశ్చర్యంగా.

"గుడ్డి కాదప్పా, అది బంగారు కడ్డీ. నేను చేసుకుంటే దాన్నే చేసుకుంటాను," నిక్కచ్చిగా చెప్పేశాడు ముద్దు.

"యామిరా, నీకుదా పిచ్చి పట్టలేదు తానె?"


ముద్దు విషపూరితంగా నవ్వాడు.

"పిచ్చి కాదప్పా, పగ! ప్రతీకారం!"

"పగా?!"

"అవునప్పా, శరణాలయంలో అందరి ముందూ నన్ను ఘోరంగా అవమానించిందే ఆ నయనతార, దాన్ని నా కాలికింద పెట్టి తొక్కిపారెయ్యాలి. దాన్ని తెచ్చి నాకు పెళ్ళి చెయ్. దాన్నెలా అవమానిస్తానో చూడు. ఏ విధంగా నన్నది నీచేత నలుగురి ముందూ చెప్పుతో కొట్టించిందో అంతకంటే ఘోరంగా దాన్ని నలుగురి ముందూ పిచ్చికుక్కని కొట్టినట్టు కొట్టి వీధుల్లోకి తరిమేస్తాను. ఇది నా గుండెలో రగుల్తున్న అగ్నిగుండం అప్పా, నాకు దాన్ని తెచ్చివ్వు."

కొడుకు చెప్పిన మాటవింటూనే చిదానందం బ్రహ్మానంద పడిపోయాడు.



"శభాష్‌రా కణ్ణా, శభాష్. ఇప్పుడుదా నా చిట్టితండ్రివనిపించుకొంటివి. అటు మాడుమీ, ఆ చదరంగం బల్లదా కనిపిస్తా వుండాది తానె? జీవితందా చదరంగం వంటిదే. ఈ ఆటను గెలుపుకోసరమే ఆడవాలె. ఆడి గెలవాలె నీ పావుదా ఒరు పూడిస్తే నీవుదా నాలుగు పావులు తినవాలె. అదిదా నీవిప్పుడు తెలుసుకొంటివి. నీకే ఆ గుడ్డిపెణ్ణుని బుట్టలోదా పెట్టుకొనుమీ. అదిదా తిరగబడితే దాని సంగతి నాన్ చూస్తు," కొడుక్కి లైసెన్స్ ఇచ్చేశాడు.

ముద్దు మొహం వెంటనే చింకిచాటంతయ్యింది.

"అప్పా, నా బంగారుకుప్పా.... ఇహ చూస్కో. నీ కొడుకు ప్రేమలో ఎలా విజృంభిస్తాడో, ఆ నయనతారనెలా మచ్చిక చేసుకుంటాడో చూస్తూనే నువ్వు గిర్రున కళ్ళు

నేత్రధనుస్సు

తిరిగి కిందపడిపోవాలి. ఆ నయనతారని నా గుప్పిట్లో పెట్టుకోకపోతే నా పేరు ముద్దు కాదు- మొద్దు పనికిరాని ఎద్దు. ఈ క్షణం నుంచే నేనా పనిమీదుంటాను. వస్తానప్పా, వెళ్ళొస్తాను," అంటూ గుమ్మం దాకా వెళ్ళి తలుపు తెరుచుకుని పోబోతూ ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా ఆగిపోయాడు.

గిరుక్కున వెనక్కి తిరిగి నేరుగా వచ్చి చిదానందం ముందు సీరియస్‌గా నిలబడ్డాడు.

చిదానందం ఏదో అనబోయాడు.

ముద్దు అమాంతం తండ్రిని కావలించేసుకుంటూ అతని బుగ్గమీద గాఢంగా ముద్దు పెట్టేశాడు.

"అప్ప! వజ్రాల తిప్ప!" అంటూనే రివ్వున బయటికి పరిగెత్తాడు.

కొడుకువైపు ఒక్కక్షణం విస్మయంగా చూసిన చిదానందం అంతలోనే తనలో తను నవ్వుకుంటూ గర్వంగా మీసం దువ్వుకుంటూ చదరంగం బల్లముందు కూర్చున్నాడు.

చదరంగం బల్లమీద అన్ని పావులూ క్రమబద్ధంగా పేర్చివున్నాయి.

చిదానందం తనవైపున్న రాజుతో ఎదుటివైపున్న రాణిని నేరుగా తినేసి బిగ్గరగా నవ్వుకున్నాడు.

* * * * * * * *

ముద్దు హుషారుగా ఈల వేసుకుంటూ షోగ్గా తయారై తన గదిలోంచి బైటికి రాబోతూ ఏదో గుర్తుకొచ్చినట్టుగా ఆగిపోయాడు. మరింత హుషారుగా ఈలవేసుకుంటూ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గిరకి తిరిగివెళ్ళి సొరుగు తీశాడు. సొరుగులో వున్న నయనతార ఫోటో తీసుకుని ఒకసారి ఆ ఫోటో వైపు స్టైల్‌గా చూసి ముద్దు పెట్టుకున్నాడు. అది శరణాలయం వార్షికోత్సవంనాడు నయనతార స్టేజీమీద పాట పాడుతుండగా తీయించిన ఫోటో.

"నయనతారా! నా గుండెను మీటే సితారా! నిన్నెలా పట్టుకుంటానో చూడు. ఎలా పట్టి నా గుప్పిట్లో పెట్టుకుంటానో చూడు" అంటూ జాగ్రత్తగా ఆ ఫోటోని జేబులో పెట్టుకుని వెనక్కి తిరగబోయాడు.

సరిగ్గా అదే సమయంలో వెనకనుంచి ఎవరిదో గాజుల చప్పుడు వినిపించింది. ఆ మరుక్షణంలో ఆ గాజుల తాలూకు చేతులు రెండు అతని కళ్ళు మూసేశాయి.

ముద్దు వులిక్కిపడుతూ చప్పున ఆ చేతులు పట్టుకున్నాడు. ఆ చేతులు తన అరచేతులకు లావుగా తగిలాయి. వెంటనే ఆ చేతులెవరివో అతని కర్థమైపోయింది. బలవంతంగా తన కళ్ళమీద నుంచి ఆ చేతులు లాగిపారేసి గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఎదురుగా చిలక నిలబడివుంది.

"చిలకా! రోజ్‌వుడ్ చెక్కపలకా! ఇవ్వెప్పుడొచ్చావ్?" మొహం చేదుగా పెడుతూ అడిగాడు.

చిలక వెంటనే బుంగమూతి పెట్టుకుంది

"పో బావా, నీ కెప్పుడూ నేనంటే పరాచికాలే. ఏం? నేను రాకూడదేంటి?" అతని భుజంమీద తలానిస్తూ అడిగింది.

ముద్దు కంపరం పుట్టినట్టుగా పక్కకు జరిగిపోయాడు.

"అలా నీ తల ఈ భుజంమీద పెట్టొద్దు చిలకా. అలాచేస్తే నా భుజం యిలా విరిగిపోతుంది" అంటూ ఓ చేత్తో భుజం నొక్కుకున్నాడు.

"అలా అయితే నీ వొళ్ళో తల పెట్టుకోనా?"

"వద్దు ఆ యినపగుండు మోసే శక్తి ఈ ముద్దు శరీరానికిలేదు" వాపోయాడు ముద్దు

"పో బావా! నీ కసలు సరసమే తెలీదు!"

"సరసమా! నీతో సరసమా! నీతో సరసం పట్టి విరసం. ఆపైన వస్తుంది నాకు నీరసం."

"నువ్వు భలే బాగా మాట్లాడతావు బావా. అందుకే నువ్వంటే నాకు చాలా యిష్టం. నన్ను పెళ్ళిచేసుకోవా బావా?" అమాయకంగా అడిగింది చిలక.

"పెళ్ళా! నీతోనా! చిలకా, నా మందార మొలకా, నీ వయసెంతో చెప్పు బంగారు చిలకా?"

"పదహారు" చెప్పింది చిలక.

"పదహారు! అయ్యో! ఈ వయసులోనే యిలా రుబ్బురోలులా వున్నావే! నిన్ను చేసుకుంటే రేపు రోడ్డురోలర్‌లా తయారై నన్ను అప్పచ్చిచేస్తే నేనేమైపోవాలి చెప్పు?"

"ఆ మాటకొస్తే నువ్వు మాత్రం కుండలా నిండుగా లేవాబావా? మనిద్దరిదీ భలే జోడీ అని మా అమ్మ చెప్పింది."

"ఆ! అలా అని చెప్పిందా! అత్తా, గుమ్మపాలు దుత్తా! నామీద ఎందుకొదిలావే ఈ గిత్త? మా అప్ప డబ్బు కాజేయడానికిది నువ్వేసిన ఎత్తా? నేనూ చూస్తా నీ సత్తా" వూపిరి సలపకుండా చెప్పుకుపోయాడు ముద్దు.

"ఏం బావా నేను బాగాలేనా?" గోముగా అడిగింది చిలక.

"బావున్నావ్. కానీ నాక్కాదు - దున్నపోతుకి."

చిలక ఆ మాట వినగానే ఏడుస్తున్నట్టుగా గోలపెట్టింది.


"నువ్వలా ఏడుస్తూనే వుండు. నేను వెళ్ళి నీకు తగిన పీపాని పట్టుకొస్తా. వస్తా" అంటూ అక్కడ్నించి పోబోయి అకస్మాత్తుగా ఏదో ఐడియా తట్టినట్టుగా చటుక్కునాగిపోయాడు.

అంత గొప్ప ఐడియా తనకంతకుముందే రానందుకు తనని తాను తిట్టుకుంటూ మళ్ళీ చిలకవైపు తిరిగాడు.

"చిలకా....." ఆప్యాయత ఒలకబోస్తూ ఆమె భుజంమీద చెయ్యేశాడు.

"ఛ! నువ్వు నాకేం వద్దుపో" వుక్రోషంతో కసిరింది చిలక.

"చిలకా! నా ప్రేమ మొలకా, నీకెందుకే ఈ అలక? నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?" అడిగాడు ముద్దు.



సుప్రసిద్ధ రచయిత
హరికిషన్ స్మృతి



సుప్రసిద్ధ కథకుడు, నవలా రచయిత శ్రీ హరికిషన్ (బోడపాటి శివ రామకృష్ణారావు) ఇటీవల తమ 65వ యేట కన్నుమూశారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. వీరు ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు సుపరిచితులే. శ్రీ హరికిషన్ వ్రాసిన నవలల్లో పెక్కింటికి బహుమతులు లభించాయి. ఎండమావులు, లోకంపోకడ, నీళ్ళు రానికళ్ళు, బలిహోరం, రాయిలాంటి ఆడది మొదలైన నవలలు వ్రాశారు. రామాయణ కల్పవృక్షం , గీతా మాధుర్యం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా ఈయన వ్రాశారు.

"ఆ మాట నా మనసునే అడుగు."

"అబ్బా! సినిమా డైలాగులొద్దు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా లేదా?"

"ప్రేమిస్తున్నాను."

"అయితే నేను చెప్పినట్టు చేస్తావా?"

చిలక అమాయకంగా తలూపింది.

"ఇప్పుడు నాకు వచ్చావె నా రామ చిలక, గోడకు చెవులుంటాయ్! ఏదీ నీ చెవి ఇలా పారెయ్" అంటూ ఆమె చెవిని బలవంతంగా దొరకబుచ్చుకుని గబగబా ఏదో చెప్పసాగాడు.

అతను చెప్పేదంతా వింటూ చిలక అమాయకంగా తలూపుతోంది.

* * * * * * * *

"హలో నయనతారగారూ!"

ట్యాంక్ బండ్ మీద కూర్చుని ఏదో ఆలోచనలో మునిగివున్న నయనతార వులిక్కిపడి ఆ పిలుపు వినిపించినవైపు తిరిగింది.

"మిస్టర్ యశ్వంత్?"

యశ్వంత్ నవ్వుతూ వచ్చి ఆమె పక్కన కూర్చున్నాడు.

"అడుగుల చప్పుడు వింటూనే ఆ మనిషెవరో గుర్తుపట్టగలిగే మీరు గొంతునిబట్టి నేనెవరో గుర్తుపట్టడంలో ఆశ్చర్యంలేదు. మీకు నా జోహార్లు నయనతారగారూ" అన్నాడతను.

నయనతార నవ్వింది.

"ఆ మాట ఎన్నిసార్లు చెబుతారు?" అడిగింది.

"ఎన్నిసార్లైనా చెబుతాను. నిజంచెప్పనా? మిమ్మల్నిలా ఎంతసేపైనా పొగుడుతూ వుండిపోగలననిపిస్తుంది" చెప్పాడతను.

"పొండి, మరీ పొగిడేస్తున్నారు" అందామె

"మిమ్మల్నిచూస్తే పొగడాలనిపిస్తుంది. ఇందులో నా దోషం లేదు సుమా!"

"అయితే దోషమంతా నాదేనంటారు!"

"ఏమిటిలా వచ్చారు? చల్లగాలికోసమా?" మాట మరో దారికి మళ్ళిస్తూ అడిగాడతను.

"ఇలాంటి చోట్లకొచ్చి కూర్చోవడం నా కిష్టమని ముందే చెప్పానుగా. ఇంతకీ తమరెందుకిలా వచ్చారో?" ఆమె గొంతులో లీలగా చిలిపితనం ధ్వనించింది.

"నిజం చెప్పమన్నారా, అబద్ధం చెప్పమన్నారా?"

"ఆ డైలాగు చాలా పాతదైపోయింది."

"అలాగైతే నిజమే చెప్తాను. నేను మీకోసం వచ్చాను నయనతారాగారూ" అన్నాడతను.

"నా కోసమా!"

"అవును. మిమ్మల్ని మొట్టమొదటిసారిగా చూసినప్పట్నుంచీ ఎందుకో మళ్ళీమళ్ళీ మిమ్మల్నే చూడాలనిపిస్తోంది. నా ఆటోగ్రాఫ్ పుస్తకం మీ ఆటోగ్రాఫ్ కోసం తహతహలాడిపోతోంది. ఇప్పటికైనా దయతలుస్తారా?" అంటూ ఆటోగ్రాఫ్ పుస్తకం బయటికి తీశాడు.

నయనతార ఏదో చెప్పబోయింది.

సరిగ్గా అదే సమయంలో లావుగావున్న ఓ అమ్మాయి ఆపసోపాలుపడుతూ వాళ్ళున్నచోటుకు పరిగెత్తుకుంటూ వచ్చింది.

"నయనతారగారూ! అమ్మయ్య, మీరిక్కడున్నారా! మీకోసం ఎక్కడెక్కడో వెతికాను" ఆయాసంతో రొప్పుతూ అందామె.

"మీరు.....?" నయనతార ప్రశ్నార్థకంగా అడిగింది.

"నా పేరు చిలక. నేను ఆనంద బాలవిహార్ సెక్రటరీని. మొన్న మీ శరదాలయం వార్షికోత్సవంనాడు మీరు పాడిన పాట విన్నాను. అబ్బ! మీరెంత బాగా పాడతారో! మా బాలవిహార్ వార్షికోత్సవం రేపే. రేపు మీ రొచ్చి తప్పకుండా ఓ పాట పాడాలి" ఊపిరి సలపనట్టుగా చెప్తుతుంటూ పోయింది చిలక.

"నేను.,...." నయనతార ఏదో చెప్పబోయింది.

"మీరేం అడ్డుచెప్పగూడదు. మీరు రేపొస్తున్నారు - మా బాలవిహార్లో పాట పాడుతున్నారు. సరేనవండి" తొందరపెట్టింది చిలక.

నయనతార నవ్వేసింది.

"సరే."

చిలక మొహం వికసించింది.

"అబ్బ మీ రెంత మంచివారో. ఇదిగోండి ఇన్విటేషన్ కార్డు. ప్రోగ్రాం ఎన్నింటికో అందులోనే వుంది. వస్తాను. ఇంకా చాలా పనులు చేయాలి" అంటూ ఎంత హడావుడిగా వచ్చిందో అంత హడావుడిగానే వెళ్ళిపోయింది చిలక.

"ఎవరో అమాయకురాల్లా వుంది" తన చేతిలోని ఇన్విటేషన్ కార్డు తడుముకుంటూ అంది నయనతార.

యశ్వంత్ కు ఆమె చెబుతున్న మాటలు వినిపించలేదు.

అతను కనుబొమలు ముడివేసి అక్కడ్నించి వెళ్ళిపోతున్న చిలకవైపే చూస్తున్నాడు.

అక్కడికి కొంచెం దూరంలో ఓ తెలుగుప్రముఖుడి విగ్రహం చాటున నిలబడివున్న ముద్దు చిలకవైపు ఆనందంగా చూశాడు.

"నా చిన్నారి రామచిలక. నీ యాక్షన్, అద్భుతంగా వుంది" ఆనందంతో పొంగిపోతూ అన్నాడతను.

"మరి యికనైనా నన్ను ప్రేమిస్తావా బావా?" అమాయకంగా అడిగింది చిలక.

ఆ మాట వింటూనే ముద్దు మొహం మారిపోయింది.

"ఆ సంగతి తర్వాత ఆలోచిస్తాం" అంటూ స్టైల్ గా వెనక్కి తిరిగాడతను.

చిలక ఆ తెలుగు ప్రముఖుడి విగ్రహం దగ్గరికి వెళ్ళడం, ఆ విగ్రహం చాటున ఎవరో నిలబడి వుండడం, వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం దూరం నుంచి గాస్తూనే వున్నాడు యశ్వంత్

అతని మనసులో ఏదో సందేహం తలెత్తింది.

నయనతార చేతిలోవున్న కార్డువంక కొద్దిక్షణాలు కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు.

అతని మొహం ఆందోళనగా వుంది.

[ఇంకావుంది]





నాటి మూకీ చిత్రాల కాలం నుంచి- నేటి టాకీ చిత్రాల వరకు సుమారు 200 చిత్రాలలో పాత్ర ధారణ గావించి ప్రేక్షక హృదయాల్లో ఊహా సుందరిగా రసిక యువకులకు స్వప్న సుందరిగా గిలిగింతలు పెట్టిన వెండితెర సుందరి సులోచనకు 1974 సం లో దాదాఫాల్కే అవార్డు అందజేసి కేంద్ర ప్రభుత్వం గౌరవించింది

మూకీ చిత్రం అనార్కలి (1927)లో అనార్కలిగా నటించి అందరి అభిమానానికి పాత్రురాలైంది నాడు సులోచన ప్రేక్షకులకు ఆకర్షణ తారగా ప్రకాశించింది అప్పట్లో ఆమెకు అభిమానుల నుంచి రోజుకు 70 లేఖలు వరకు వస్తుండేవంటే మీరే ఆలోచించండి!

1982 సం లో జాతీయ శబ్ద చిత్ర స్వర్ణోత్సవం జరిగినప్పుడు- నాటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ చే సన్మానింపబడింది సులోచన

అంచమైన ఈ మహానటి గురించి మననం చేసుకుందా మిప్పుడు

ఆమె 9 10-1907లో జన్మించింది కాన్వెంట్ విద్య గరపింది

టెలిఫోన్ ఆపరేటర్

రూబీ మేయర్స్ అనే పేరుగల ఆంగ్లో ఇండియన్ యువతికి అప్పుడు 17 ఏళ్ళ వయసుంటుంది. ఒక ప్రైవేట్ సంస్థలో ఆమె టెలిఫోన్ ఆపరేటర్గా పనిచేస్తుంది. అందమైన ఆ యువతి చూపరులను ఆకర్షిస్తుండేది.

నాటి మూకీ చిత్రాల ప్రసిద్ధ దర్శకుడు మోహన్ భావనానీ ఒక ఉత్సవ కార్యక్రమం జరుగుతుండగా రూబీ మేయర్స్ని అక్కడ చూశాడు. చూచీ చూడ్డంతోనే అతన్ని ఆమెరూపం ఆకర్షించింది తన సినిమాల్లో నాయకిగా వేయించా లనుకున్నాడు. ఆ విషయం రూబీతో మాట్లాడాడు. ఆ తర్వాత కొన్ని భంగిమల్లో ఆమె ఛాయా చిత్రాలు తీయించాడు ఆ చిత్రాలు తనకి సంతృప్తి కరంగా వుండడంతో వెంటనే కోహినూర్ ఫిలిం కంపెనీ వారికి తను దర్శకత్వం వహిస్తున్న సింగాల చిత్రంలో రూబీని నాయికగా నిర్ణయిం[illegible] ఈ చిత్రంలో



ఆర్దేషిర్ ఇరానీ గారు

నటించినందుకు రూ 150 00లు ఆమెకు వారితో ఒప్పందం కుదిరింది 8 రోజుల్లో ఈ చిత్రం నిర్మించడం జరిగింది చిత్రం విజయవంతమైంది రూబీ మేయర్స్ పేరును మార్చి సులోచన అనే తెరపేరు పెట్టాడు భావనానీ

తొలి చిత్రీకరణ

సింగాల చిత్రీకరణ ఆరంభమైంది అంతవరకు కెమెరా ఎలా ఉంటుందో ఎరుగని సులోచన రూపాలంకరణ పూర్తి కాగానే కెమెరా ముందుకు వచ్చి నిల్చుంది. ఆమెపై చిత్రీకరించ వలసిన సన్నివేశం వివరించినా చెప్పినట్లు నటించలేదు. "రూబీ మీరు ఏడ్వండి!" అన్నాడు దర్శకుడు.

"నే నెందుకు ఏడ్వాలి?" అని ఎదురు ప్రశ్న వేసింది రూబీ

చిత్ర కథలో నాయిక అన్న చనిపోయాడని కన్నీరు కార్చి దుఃఖించ వలసిన దృశ్యమది ఆ సంగతి వివరించాడు దర్శకుడు అయినా ఏడ్వడానికి ఇష్టపడలేదామె దర్శకుడు, సిబ్బంది విసుగు చెందారు ఎందుకు ఈమెను కోరి తీసుకొచ్చామా అని చిరాకు పడిపోవడంతో ఆమె పరిస్థితిని గమనించి ఎలాగోలాగ ఏడ్వాలని నిశ్చయించుకొని ఏడ్చినట్లు నటించింది చిత్రకరణ పూర్తి చేశారు ఆ రోజుల్లో కన్నీరు కార్చడానికి ఉపయోగపడే గ్లిసరిన్ వంటి పదార్థాలు ప్రచారంలో లేవు దుఃఖ సంఘటనలు మననం చేసుకొని నటించేవారు.

నెల జీతం 50 -00తో ప్రారంభం

కోహినూర్ కంపెనీ లో ఈమెను కొన్నాళ్ళు నెల జీతం రూ 50-00లు ఒప్పందం కుదుర్చుకున్నారు అప్పుడు వారి సంస్థ నిర్మించిన చిత్రాలు సినీయాక్ట్రెస్ పాగల్ ప్రేమీ ముంతాజ్ మహల్, టెలిఫోన్ గరల్ టైపిస్ట్ గరల్ ది నర్స్ ది డాన్సింగ్ గరల్ వైల్డ్‌కాట్ ఆఫ్ బొంబాయి మొదలగు చిత్రాల్లో నాయకిగా నటించి మంచి ఖ్యాతి గాంచింది.

కోహినూర్ తర్వాత. అర్దేషి ఇరానీ సంస్థ ఇంపీరియల్ ఫిలిం కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది.

అనార్కలి పోటీ చిత్రాల నిర్మాణం:

గ్రేట్ ఈస్టన్ కార్పొరేషన్ వారు భారీ ఎత్తున అనార్కలి చిత్రాన్ని నిర్మింప తలపెట్టి కథ- కథనం సంవత్సరం పాటు చర్చించి "లవ్ ఆఫ్- ఎ- మొఘల్ ప్రిన్స్" అనే పేరుతో నిర్మాణం ఆరంభించారు.

1927 సంవత్సరంలో మూకీ అనార్కలీలో సులోచన బిల్ మోరియా





ఫిల్మిస్తాన్ వారి "అనార్కలి"లో జోదు బాయిగా సులోచన మంచం మీద కూర్చుని దర్శకుని సూచన గమనిస్తూంది.



వృద్ధాప్యంలో సులోచన

ఈ లోగా ఇంపీరియల్ సంస్థవారు ఫై సంస్థతో పోటీపడి సులోచన, డి బిల్‌మోరియాతో తక్కువ వ్యవధిలో అంటే 10 రోజుల్లో మూకీ చిత్రం 'అనార్కలి' నిర్మాణం పూర్తిగావించారు చిత్రం విడుదలయి బహుళ జనాదరణ పొందింది సులోచనకి తారగా అంతస్థు పెంచింది బిల్‌మోరియా– సులోచన జంట అనేక చిత్రాల్లో నటించింది

ఆలస్యంగా విడుదల చేసిన గ్రేట్ ఈస్టర్న్ వారి చిత్రం నష్టానికి గురికాబడింది

టాకీ ప్రభావంతో సులోచన గిరాకీ

1931 సం లో శబ్ద చిత్రాలు రావడంతో సులోచనకు గిరాకీ పెరిగింది ఈమె నటించే చిత్రంలో పనిచేయుటకు నెలకు 5 వేలు పుచ్చుకునేది అప్పట్లో ఈ మొత్తం ఏ నటీనటులకీ లేదు అంత డబ్బు ఇచ్చి ఆమెను తమ చిత్రాల్లో నటింప జేసుకునే వారు నిర్మాత దర్శకులు

మాధురి గుల్‌సనోబర్, డాకూ కీ లడ్కీ, టెంపుల్ బెల్స్ ఇందిర ఎమ్ ఎ హీర్ – రాంజా మొదలగు చిత్రాలలో డి బిల్‌మోరియా రాజా శాండో మాస్టర్‌ఖలీల్ వంటి ప్రసిద్ధ నటుల ప్రక్కన నాయకిగా నటించి ఖ్యాతి – కాసు పుష్కలంగా సంపాదించుకుంది

తొలిసారి కారు కొన్న తార

అంతవరకు సినిమా నటీనటు లెవరికీ కార్లు లేవు సులోచనే తొలిసారి కారుకొని స్వంత కారులో సంచారం చేసేది పెద్ద బంగళాలో నివసించి భోగ భాగ్యాలతో తులతూగిన ప్రథమ సినీరాణి సులోచన! అభిమానులు ఈమెతోనే అరంభ మయ్యారు ఈమె స్టూడియోకి షూటింగ్‌కి వెళ్లిందని తెలిస్తే ఆ స్టూడియో గేటు దగ్గర ఆమెను చూడ్డానికి వందలాది యువజనం నిరీక్షిస్తుండేవారు చక్కని ముఖవర్చస్సుకి లేడికళ్లలా మెరిసే ఆమె నేత్రాలు ప్రేక్షకులను మైమరపించేవి

ఈమె నటించిన తొలి శబ్ద చిత్రం మాధురి ఇందిరా ఎమ్ ఎ చిత్రంతో మంచి ఖ్యాతి పొందింది

ధనం ఖ్యాతి ప్రాప్తించడంతో నిర్మాతగా మారి 'రూబీ పిక్చర్స్' సంస్థ పేరు మీద దో దోస్త్ చిత్రాన్ని తీసింది

కాలంతో పాటు వయస్సు మళ్ళడంతో తల్లి పాత్రలు ప్రధాన పాత్రలు చాలా చిత్రాల్లో నటించింది 1953లో విడుదలయిన ఫిల్మిస్తాన్ వారి అనార్కలిలో రాణి జోదు బాయిగా నటించింది ఆ తర్వాత జావారి లో రాణీగా జుక్‌గయా ఆస్మాన్' లో గర్ల్స్ హాస్టల్ మేట్రన్‌గా నటించి కూడా రాణించింది ఆప్‌కీ కసమ్ హాత్‌కి సఫాయి వంటి చిత్రాల్లో చిన్న పాత్రలు ధరించింది ఆమె ఆఖరుచిత్రం ఖట్టా మీఠా

బాబూరావు పటేల్ రాసే చిత్ర సమీక్షలు ఎంతో ఆసక్తిగా చదివేది

సినిమా తారగా రాజభోగాలు అనుభవించి, తన 76వ ఏట 9–4–83 తేదీన స్వర్గధామం చేరుకుంది

వృద్ధాప్యం వరకు సినీమారంగాన్నే అంటిపెట్టుకొని ఏ పాత్రనయినా సమర్థవంతంగా నటించి 50 ఏళ్లు చిత్రసీమలో తారగా మెరిసి 1983వ సంవత్సరంలో రాలిపోయింది

అలనాటి హిందీ సినిమా అభిమానులు ఈ నాటికీ సులోచనను గుర్తుకు తెచ్చుకొని ఆ అందాల భామ సొయగాలు తలంచుకుని తృప్తి చెందడం పరిపాటి!

○

సీరియల్

ప్రణయవల్లరి

యర్రసంట్ల వరలక్ష్మీదేవి



ఇంతవరకూ సాగిన కథ-17 : నాటకాల పిచ్చివున్న రామకృష్ణ - గణపతి స్నేహితులు. లా చదివేందుకు అలహాబాద్ వెళ్లిన రామకృష్ణకు సిన్హా - రబీన్ స్నేహితులవుతారు. టి.బి. సోకిన నవనీతను రామకృష్ణ వైద్యం చేయిస్తూ ఆ కుటుంబానికి సన్నిహితుడవుతాడు. రామకృష్ణ నవనీతను పెండ్లి చేసుకోవాలన్న తన నిర్ణయాన్ని 'గణపతికి తెలియజేస్తాడు. నవనీత టి.బి. నుంచి కోలుకుంటున్నదని తెలిసిన రామకృష్ణ ఆనందిస్తాడు. సిన్హా కుటుంబం రామకృష్ణ ఇంటికి వస్తుంది.

(గత సంచిక తరువాయి)

ఆ సాయంత్రం వారంతా బీచ్‌కి వెళ్ళినప్పుడు, నీల మెల్లగా రామకృష్ణ చేరువకు వెళ్ళి– "కృష్ణాజీ! మీకు నాకు ఇవాళ ప్రొద్దున్న సింహాచల దేవాలయంలో వివాహమై పోయింది తెల్సునా?" అని అడిగింది.

రామకృష్ణ ఆమె ముఖంలోకి ఓ సారి శ్రద్ధగ, గంభీరంగ చూసి ఏమి జవాబివ్వక ఏదో ఆలోచిస్తు సముద్రం వైపు చూస్తు ఉండిపోయేడు.

నాల్గవ రోజున పోర్టుకు వెళ్ళి అక్కడ తెల్సిన ఓ ఆఫీసర్ను కలసి పోర్టు మోటారు బోటులో అలా పోర్టంత తిరిగి, నేవల్ బేస్, సబ్ మెరైన్ స్థావరాన్ని చూసి అలా సముద్రంలో విహారం చేసి అవుటర్ హార్బరు చుట్టు తిరిగి వచ్చేరు

పడవ దిగేక పోర్టు ప్రక్కన కొండమీదున్న వెంకటేశ్వరుని సందర్శించి వచ్చేరు ఈ ట్రిప్పుకి వాళ్ళతో బాటు రామకృష్ణ తల్లి, మేనత్త కూడ వచ్చేరు ఎంబాసిడరు కారుని డ్రైవరు నడుపుతె తన వారిని ఎక్కించుకున్నఫియట్ కారుని రామకృష్ణ డ్రైవ్ చేసేడు. వస్తున్నప్పుడు త్రోవలో కనకమహాలక్ష్మి గుడికి వెళ్ళి వచ్చేరు

బజారులో కంకటాలవారి బట్టల షాపుకి వాండందర్ని తీసుకుని వెళ్ళి రామకృష్ణ తల్లి శాంతాదేవి. వారికోసమే కొంటున్నట్లు చెప్పకుండ, నీలకు రమాదేవికి వారు మెచ్చిన, నచ్చిన రెండు పట్టుచీరలను వాటిక మేచింగ్ పట్టురవికల గుడ్డలతో సహా కొని తీసుకుని వచ్చింది– వారు రాయుపూర్‌కు వెళ్తున్నప్పుడు ఇవ్వడానికి

అయిదవ రోజున ప్రొద్దున ఎవ్వరు కదలలేదు ఏవో కబుర్లాడుకుంటు కూర్చున్నారు రామకృష్ణ కుటుంబ సభ్యులతో ఆ నాడు సెలవుదినం, నరసింహంకు కోర్టు లేదు. రామకృష్ణ గదిలో కూర్చుని స్నేహితుడు రబీన్‌కి ఉత్తరం వ్రాస్తున్నాడు కొన్నేపటికి నీల వచ్చి గదంతటన్ని శ్రద్ధగ పరికించింది

'కృష్ణాజీ' ఏది మి నవనీత ఫోటో చూపెట్టండి చూస్తాను– మీ మనస్సును దోచిన ఆ సుందరిని," అంది రామకృష్ణ టేబిలు మీద ఆ ఫోటోను కానక

రామకృష్ణ చిరునవ్వుతో– "ఆమె ఫోటో బయటలేదు నీకు చూపెట్టడానికి నీలుగ"

నల ఆశ్చర్యపోతు– "మరెక్కడ?" అని అడిగింది

"నా హృదయంలో ఉంది నేనే చూడగలను– నీకెలా చూపగలను చెప్పు?"

"అయితే నన్ను ఆటపట్టించడానికి మీరు నవనీత, ప్రేమ అని నాటక మాడుతున్నారు కదూ?"

"నాకు తెల్సు నువ్వు నా మాటల్ని నమ్మవని"

"ఏదీ నేను మికిచ్చిన మనిద్దరి ఫోటో?"

"ఫోటో ఆల్బంలో పెట్టేను– డ్రాయరులో ఉంది, చూడు."

నీల టేబిలు సొరుగులోంచి ఆల్బం తీసి అందులోని ఫోటోలన్ని చూచింది. అందులో వారంతా కాశ్మీరులో తీయించుకున్న ఓ డజను కలర్ ఫోటోలున్నాయి. ఓ అయిదు ఫోటోలలో

తనుంది. తను రామకృష్ణ కలసున్న ఫోటో తనిచ్చింది కూడ ఉంది రామకృష్ణ ప్రక్కన తనెంతో అందంగ తగిన జోడిగ ఉందని నీల భావించింది ఆ విషయమే మళ్ళా రామకృష్ణకు గుర్తు చేస్తే, నవ్వేసి ఊరుకున్నాడు.

"అయితే నేను అందంగా లేనా?"

"ఎంత మాట! నువ్వు చాల అందంగత్తెవు. హైబ్రిడ్ గులాబి లాంటి దానివి నీ ప్రక్కన నేనే తగినట్లు లేను."

"నా కళ్ళకు మీరు హాలీవుడ్ స్టార్ రాక్‌హడ్సన్‌లా ఉన్నారు."

"నిజంగ ఇది చాల పెద్ద పొగడ్త."

"ఒక్క మాట మీకు చెప్పి పోతాను నా గదికి– ఐ లవ్ యు నా ఉద్దేశంలో మీరు నన్ను ప్రేమిస్తున్నారు. నవనీత లేదు మరో గీత లేదు- వరి బూటకం నన్ను ఆడించడానికి మీరాడుతున్న నాటకం,"

అని సూటిగ రామకృష్ణ ముఖంలోకి చూస్తు అంది

"నీల! నీకు బాగా ఈ ప్రేమ పిచ్చి ఎట్టుకుందే"

"మిమ్మల్ని చూస్తే నాకదో పిచ్చి," అని నవ్వుతు అక్కడ నుండి వెళ్ళి పోయింది

రామకృష్ణ చేసేదేమిలేక నిట్టూర్చి రబీన్‌కు ఆ ఉత్తరాన్ని మరి కొనసాగించలేక కుర్చీలో వెనక్కు వాలి నవనీత గురించి ఆలోచించడం మొదలెట్టేడు.

ఓ నెల్లాళ్ళు గడచిపోయేయి. మరో నెల్లాళ్ళు ఓపికపడితే నవనీత హాస్పిటల్ నుండి విడుదలై వస్తుంది ఆ తరువాత మెల్లగ నవనీతను ఇంటికి తీసుకుని వచ్చి తన తల్లి, మేనమామకు, మేనత్తకు పరిచయం చేయాలి ఆమె జబ్బు సంగతి తను వారి కెట్లా తోడ్పడింది ఎవ్వరికి చెప్పనవుసరం లేదు గణపతికి



దూరపు బంధువని గణపతిఇంట్లో ఆమెను చూడడం, పరిచయం చేసుకోడం తటస్థ పడిందని చెప్తే చాలు. తన తల్లి నవనీత అందాన్ని, తీరును చూసి తప్పక ఒప్పుకుంటుంది ఆమెను తన కోడలుగా చేసుకునేందుకు. నవనీత విశాఖకు తిరిగి రాగానే బ్యాంకు ఉద్యోగాలకు పరీక్ష రాస్తానంది ఆమె చదువు ఆమె సంస్కారం చూసేక తన మేనమామ తన వివాహానికి అభ్యంతర పెట్టడు.

తను ప్రాక్టీసు పెట్టే వరకు, నవనీతకు జబ్బు సైకోసిస్ వేళ్ళతో సహా పూర్తిగ పెకలించుకుని పోయే వరకు మరో నాలుగు నెలలు వేచి ఉంటే సరిపోతుంది. ఈ మధ్యకాలంలో తామిద్దరి స్నేహాన్ని మరింత పెంపొందించుకుని మరింత సన్నిహితులవొచ్చు. అప్పుడు వివాహం చేసుకుందుకు సరైన కాలమౌతుంది తమ వివాహ జీవితం నందనవనమై ఎన్నో సుమధుర సుమాలు వికసించాలి. రామకృష్ణ కలలు అలలుగ వ్యాపించేయి.

ఆ మధ్యాహ్నం రామకృష్ణ సిన్హాగారి కుటుంబాన్ని తీసుకుని హిందుస్థాన్ షిప్ యార్డుకు వెళ్ళేడు. అక్కడ అసిస్టెంటు ఇంజినీరు పడవల తయారీలోని వివిధ అంశాలను విడమర్చి చెప్పి చూపించగ వింతగ వాటన్నిటిని గమనించేరు వారు ఇంతవరకు


ప్రణయవల్లరి

ఊహించలేని ఎన్నో విషయాలను తెల్సుకున్నారు. అంతంత దళసరి పెద్ద స్టీలు ప్లేట్లను కావల్సిన ఆకారంలో మలచి, ఎత్తుగ తీసుకొని పోయి ప్లేటు వెల్డ్ చేసి పడవ ఆకారంలో చేయడం, తరువాత పడవలో నెలల తరబడి నివాసానికి మనుష్యులకు కావల్సిన సౌకర్యాలను సమకూర్చడం అద్భుతమైన ఇంజినీరింగు టెక్నిక్.

తరువాత అనుమతి తీసుకుని నేవీ వారి స్థావరాన్ని, ట్రెయినింగ్‌కు వినియోగించిన పడవను చూసి వచ్చేరు. అందరు కొత్త విషయాలను తెలుసుకోగలిగి నందుకు సంతోషించేరు.ఆ నేవల్ ఏరియాలో తనకు తెల్సిన ఓ కెప్టెన ద్వారా నేవల్‌కాంటీన్‌లో నుండి ఓ ఫారిన్ స్కాచ్ విస్కీ హేగ్ అన్న పేరుది ఓ ఫుల్ బాటిల్‌ను సంపాదించి సత్యజిత్ సిన్హాకు బహూకరించేడు రామకృష్ణ

"మై బాయ్! నేను మెచ్చుకున్న మంచి బహుమతి ఇచ్చేవయ్యా ఈ సాయంత్రం నీ మామయ్యను మేడ మీదకు తమ్మను, ఓ చిన్నపార్టీ చేసుకోవాలి," అన్నాడు ఉత్సాహంగ.

"నేను నా మామయ్యకు చెప్పి ఏర్పాటు చేయిస్తాలెండి."



"కృష్ణాజీ! ఇలా నువ్వు ఫారిన్ విస్కీ సీసాలిస్తే అతను రాయపురును మరచి ఇక్కడే నీ దగ్గర ఉండిపోతారు- జాగ్రత్త సుమా!" అని నవ్వుతూ అంది రమాదేవి.

"నువ్వు అసూయపడకోయి రమా- నీకు ఓ రెండు పెగ్గులు పోస్తాలే," అని చిలిపిగ నవ్వుతున్నాడు సత్యజిత్‌సిన్హా.

రమాదేవి గతుక్కుమని "సిగ్గు లేకపోతే సరి," అని ప్రేమగ మందలించింది. అందరు నవ్వుకున్నారు.

ఆ మరునాడు అందరు ప్రొద్దున్నే స్టేషనుకు వెళ్ళి వాల్తేరు- కిరండుల్ ట్రెయినెక్కేరు- అరకు వరకున్న రైలు మార్గపు సొరంగాల్ని చూడడానికి. డ్రయివరును కారు తీసుకుని రోడ్డు మార్గంలో అరకు వచ్చి రైల్వే స్టేషనులో మధ్యాహ్నం తాము చేరుకోగానే కలియమని చెప్పేరు.

పర్వత శ్రేణులను దొలచున్న సొరంగాల గుండ ట్రెయినుపోవడం, ఆ పర్వతాల నుండి దూరంగ కనుపించే ఆలోయలు,ఆ పల్లెలు, కొండకు కొండకు మధ్యనున్న ఆ బ్రిడ్జీలు, ఆ అగాధాలలో సన్నగా పారే జలాలు, ఎత్తైన కొండ చరియల నుండి జాలువారే ఆ నాటి ధారలు, ఆ పర్వత వాలుల్లో పెరిగిన మహోన్నత వృక్షాలు, ఆ దట్టమైన అడవులలో అక్కడక్కడ చిన్న చిన్న పల్లెలు, అందులోని గుడిశలు ముంగిట ఒంటి నిండ పెద్ద పెద్ద రంగు పూసల హారాల్ని వేసుకొని అర్ధనగ్నంగ ఏ సంకోచము లేకుండా పనిపాటలు చేసుకుంటుండే గిరిజన మహిళలు, ఆ అడవుల్లో అక్కడక్కడ గుబుర్లుగా పెరిగి వింత గుభాళింపులతో విరబూసున్న విచిత్ర అడవి మొక్కలు- అదంత ఓ మనోహర దృశ్యకావ్యమే. ఆ ప్రయాణమే వారందరికి ఓ విధమైన పులకరింపుగ ఉంది.

అరకువేలీ చేరిం తరువాత అక్కడున్న బొటానికల్ గార్డెనుకు వెళ్ళేరు. అందులో వివిధ రకాలైన ఫల, పుష్ప, సుగంధ వృక్షాలను చూచేరు. అందులో ముఖ్యంగ కర్పూర ఆకుచెట్టు, లవంగ మొగ్గ దొడిగిన లవంగాల చెట్టు, బుట్టలుగ

చెట్టుకు వ్రేలాడుతున్న ఏలకుల చెట్లు, ఘాటుగ, తియ్యగా నున్న దాల్చిన చెక్కను బెరడుగా గల దాల్చిన చెట్లు, లతగ అల్లుకుని మిరియాల మొగ్గ దొడిగిన మిరియాల చెట్లు, కలకత్తా జామ్ చెట్లు, బిహార్ లూచీ పండ్ల చెట్లు వారిని ఎంతగనో ఆకర్షించేయి. వస్తున్నప్పుడు వారు నాలుగు కేజీల లూచీ పండ్లను కొనుక్కుని కాస్త తింటు బయటకు వచ్చేరు

తరువాత వారంత అక్కడున్న అగ్రికల్చర్ ఫారమ్‌ని, మల్బరీ ట్రీస్ ప్లాంటేషన్‌ని, పట్టు పురుగుల పెంపకం, పట్టు పరిశ్రమను చూచేరు ఆవేటిలో పెరిగిన విచిత్రమైన ఆకారాలలో నున్న ఫర్, ఫైన్ చెట్లను ఆహ్లాదంతో చూచి తిరుగు ప్రయాణమయ్యేరు కారుతో.

శివారెడ్డికి అవార్డు



ప్రముఖ తెలుగు కవి శ్రీ కె. శివారెడ్డికి 1990 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ అవార్డు క్రింద 25 వేల రూపాయల నగదు, తామ్రపత్రం బహూకరి స్తారు. 'మోహనా-ఓ-మోహనా' అనే కవితకు శ్రీ శివారెడ్డి ఈ అవార్డు అందుకుంటున్నారు. హైదరాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీ శివారెడ్డి ప్రభావం యువకవులలో ఎక్కువ కన పడుతుంటుంది. అనేక వచన కవితా సంకలనాలను కూడా రచించిన శ్రీ శివారెడ్డికి ఈ అవార్డు లభించడం ఎంతైనా ముదావహం.

25

గత ఆరు రోజులు ఏకధాటిగా తిరగడం వల్ల అలసట కల్గి రెండు రోజులు రెస్టు తీసుకుందా మనుకున్నారు. అందుకే ఆ మరునాడు మరెక్కడకు ప్రోగ్రాం పెట్టుకోలేదు.

ఆనాడు శనివారం. క్లబ్బులో సాయంత్రం యేదో మీటింగ్ తరువాత డిన్నరుందన్నాడు నరసింహం. సత్యాజిత్ సిన్హాను తనకు గెస్టుగ తనతో రమ్మన్నాడు. కాని తన కుటుంబాన్ని వదిలి తనొక్కడు వెళ్ళడానికిష్టం లేక–

"మీరు వెళ్ళిరండి– మేము సాయంత్రం వేరే ప్రోగ్రాం వేసుకుంటాము మరేం లేదు– ఈ వారమంతా వెజిటేరియన్ డైటు అయింది కదా ఇవాళ అలా ఏదైన మంచి హోటలుకు పోయి నాన్ వెజ్ డిన్నరును తీసుకుందా మనుకుంటున్నాం" అని చెప్పేసరికి సరేనని నరసింహం ఫియట్ కారును తీసుకుని వెళ్ళిపోయేడు సాయంత్రం

శనివారం గనుక రాత్రి రామకృష్ణ తల్లి, మేనత్త భోజనం చేయరు ఆ సంగతి చెప్పేసరికి సత్యాజిత్ సిన్హా– "మరెందుకు ఎవరి కంపెనీ లేకపోయేక ఇంట్లో ఈ రాత్రి మనము భోజనం చెయ్యొద్దు. అలా ఏదైన మంచి హోటలుకి పోయి డిన్నర్ తీసుకుని వద్దాం మీ ఊర్లో మంచి ఫైక్లాసు హోటలు పేరు చెప్పు వెళ్దాం- కాస్త ఫారిన్‌స్టైలులో ఉండాలి."

"అయితే సముద్ర తీరంలో సన్ అండ్ సీ అనే త్రీ స్టార్ హోటలుంది. అక్కడ మంచి బార్ అండ్ రెస్టారెంటున్నాయి. మీకు కావల్సిన నాన్ వెజ్ రకాలెన్నో వండుతారు నాలాంటి వాడికి చపాతీలు, కర్డుబాత్ ఉంటుంది హోటలు చాల డీసెంటుగానే ఉంటుంది"

"గుడ్- అక్కడికే పోయి వద్దాం" అని సత్యాజిత్‌సిన్హా అనేసరికి అందరు ఉత్సాహంగ ఒకే చేసేరు.

సాయంత్రం సత్యజిత్‌సిన్హా, భార్య, కొడుకు, కూతురు బాగా ముస్తాబై బయలుదేరేరు రామకృష్ణ కూడ సూటు వేసుకుని, టై కట్టుకున్నాడు ముఖ్యంగ నీల చాల శ్రద్ధగా ముస్తాబు చేసుకుంది నీల తన శరీర చాయకు తగినట్లు లేత గులాబిరంగు చీర సెల్కుకింది, దానికి మేచింగ్‌గా నున్న రుబీస్ నెక్లేసు, చెవిలో లక్కులు గాజులు, బాగీ, ఎర్రని జోళ్ళు వేసుకుంది మేడమీద హాలులో రామకృష్ణ కలుసై అడిగింది తన గురించి


"యు ఆర్ లవ్‌లీ– అప్పుడే విరబూసిన విక్టోరియ రోజ్‌లాగున్నావు." అని మెచ్చుకున్నాడు రామకృష్ణ.

"థాంక్యు ఫర్‌ది కాంప్లిమెంటు," అని ఆనందంతో మేడదిగింది

షాంపూ చేసిన జుత్తును అల్లకుండ అలా భుజాల వరకు బొద్దుగ చుట్టుపడేటట్లు వదిలేసి తలకు మాత్రం జుత్తు ముఖం మీదకు చెదరి పడిపోకుండ ఓ గులాబి రంగు రిబ్బను కట్టుకుంది– ఆ వేషంలో నీల నిజంగ చాల అందంగ ఉంది

మహారాణి పేట నుండి బీచిరోడ్డుకు చేరి, ఆ బీచిరోడ్డు మీదుగ వెళ్ళి కిర్లంపూడి లేఅవుట్ బీచిదగ్గర ఆగి కాస్సేపు బంగారు ఇసుకలో ఆ సుందర సాగరాన్ని చూస్తు తిరిగేరు కాసేపయేక అక్కడనుండి కదలి కారులో సన్‌అండ్‌సీ హోటలుకు చేరేరు

విశాఖలో ఆనాడు ప్రసిద్ధి గాంచిన హోటలది పాశ్చాత్య పద్ధతిలో హోటలు నిర్మాణం జరిగింది అక్కడ గదుల ఏర్పాటు, బార్, భోజనశాల, అవుట్‌డోర్ ఈత కొలను, ఆ కొలను చుట్టు కేన్ చైర్లు ఎదురుగ బెంగాల్ సముద్రం, చుట్టు పచ్చని చెట్లు, కాళ్ళక్రింద మెత్తని పచ్చిక అంత యూరోపియన్ నాగరికతను ప్రతిబింబిస్తున్నాయి ఆ హోటలు, ఆ డ్రింక్స్, ఆ భోజనం అంతా ఖరీదైనదే. బాగా డబ్బున్న వారికి అదో ఆహ్లాదపరిచే



నిత్య జీవితంలో కెమిస్ట్రీ

వజ్రాన్ని మించిన ఉష్ణ వాహకత్వం గల పదార్ధం మరేదీ లేదు. అందువల్లనే ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉష్ణాన్ని తగ్గించ టానికి ఖరీదైన వజ్రాలను ఉపయోగిస్తారు. ఈ ధర్మం వల్లనే పరిశోధకులు వజ్రపు ఫిల్ముల మీద సూక్ష్మమైన కంప్యూటర్ సర్క్యూట్స్‌ను రూపొందించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యింకా ఎక్కువ ఉష్ణ వాహకత్వం గల వజ్రాన్ని కృత్రిమంగా తయారు చెయ్యాలనే ఉద్దేశ్యంతో 'జనరల్' ఎలక్ట్రిక్ రీసెర్చి అండ్ డెవలప్ మెంటు 'సెంటర్', న్యూయార్క్‌కు చెందిన పరిశోధకులు శుద్ధమైన కార్బన్ ఐసోటోప్ 'కార్బన్ 12' నుండి వజ్రాన్ని తయారు చెయ్యాలని సంకల్పించారు. సహజమైన వజ్రంలో ఒక శాతం 'కార్బన్ 13' అనే ఐసోటోప్ ఉంటుంది. ఐసోటోప్ సంబంధమైన శుద్ధ వజ్రానికి 5 శాతం ఎక్కువ ఉష్ణవాహకత్వం ఉంటుందని కొన్ని సిద్ధాంతాలు సూచిస్తున్నాయి. ఈ సెంటర్‌కు చెందిన 'అడ్వాన్స్‌డ్ ఇనార్గానిక్ మెటీరియల్స్ లాబరేటరీ'కి చెందిన బృందం, ఐసోటోప్ సంబంధమైన శుద్ధ వజ్రం లేజర్ కిరణ రేడియేషన్‌ను సహజ వజ్రం కంటె పదిరెట్లు ఎక్కువ తట్టుకుంటుందని, కనుక దీనిని దర్పణాలు, కటకాల తయారీలో బాగా ఉపయోగించ వచ్చునని కనుక్కున్నారు. ఈ రకం వజ్రాన్ని తయారు చెయ్యటానికి వీరు 'కెమికల్ – వేపర్ డిపాజిషన్' అనే పద్ధతిని ఉపయోగించారు. ఈ పద్ధతిలో 99.99% కార్బన్ 12 ఐసోటోప్ ఉన్న మిథేన్ వాయువును ఒక ప్లాస్మాలో వేడి చేసి. కార్బన్‌ను సూక్ష్మమైన వజ్రస్ఫటికాలుగా 'మోలిబ్డినం లేక సిలికాన్' మీద జమపడేట్లుగా చేశారు. ఈ స్ఫటికాలతో ఏర్పడ్డ పదార్థాన్ని పొడిగా చేసి దానిని 52,000 ఎట్మాస్ఫియర్ల పీడనము, 1200 డిగ్రీల సెంటిగ్రేడు ఉష్ణోగ్రత వద్ద ఒక లోహ ఉత్ప్రేరకం గుండా పంపి ఒక కారట్ ఉన్న వజ్రాన్ని తయారు చేసారు. ఈ శుద్ధ వజ్రం యొక్క అధిక ఉష్ణవాహకత్వం గురించి పరిశోధకులు కొన్ని ప్రతిపాదనలు చేస్తున్నారు ఉష్ణం వజ్రం యొక్క 'స్ఫటిక లాటిస్' గుండా 'ఫోనాన్స్' అనబడే ఉష్ణ వాహకాల ద్వారా ప్రసరిస్తుంది. అలలాగా చలించే ఈ ఫోనాన్స్ గమనానికి కార్బన్ 13 పరమాణువుల చలనం ఆటంకం

ఎలక్ట్రానిక్స్‌లో 'వజ్రాల' ఉపయోగం

కలిగిస్తుంది. దినివల్ల ఉష్ణవాహకత్వం తగ్గిపోతుంది. మరో కారణం ఏమిటంటే రెండు ఫోనాన్స్ గుద్దుకున్నప్పుడు, మరొక ఫోనాన్ ఏర్పడి, అది స్ఫటికం గుండా చెదిరిపోయి స్ఫటికలాటిస్ యొక్క ఉష్ణ వాహకత్వం తగ్గిపోతుంది. పరిశుద్ధమైన మిథేన్‌ను తయారు చెయ్యటానికి, తరువాత ప్రాసెస్ వల్ల వజ్రం ఖరీదు పెరిగి పోయినప్పటికి జనరల్ ఎలక్ట్రిక్ వారు తమకు ఏడాదికి 50 మిలియన్ డాలర్ల నుండి 100 మిలియన్ డాలర్ల దాక వ్యాపారం ఉంటుందని ఆశిస్తున్నారు. సముద్రం అడుగున ఉన్న ఫైబర్– అప్టిక్ రిపీటింగ్ స్టేషన్స్ నుండి ఉష్ణాన్ని తొలగించటంలో వీటిని ముఖ్యంగా ఉపయోగించ బోతున్నారు.

–మహావాది రాయలు

అనుభూతి

"బయట కూర్చుని డ్రింక్స్ పుచ్చుకున్నాక భోజనం వేళకు లోనకు వెళ్దాం," అని సత్యజిత్‌సిన్హా అనే సరికి అందరు ఆ హోటలు వెనుక నున్న పచ్చిక బయలులో సముద్రానికి ఎదురుగ ఆ **బెత్తు కుర్చీలలో కూర్చున్నారు.** హోటేలులో నుంచి శ్రావ్యమైన పాశ్చాత్య వాద్య సంగీతం వినవస్తుంది సన్నగా, **వాళ్ల సంభాషణకు అంతరాయం** కల్గించకుండా.

రామకృష్ణ ఆ సూటులో చాల అందంగ ఉన్నాడు. నిండైన విగ్రహం– అయిదడుగుల పదంగుళాల ఎత్తు, ఎత్తుకుతగ్గ శరీర ధారుఢ్యం, లేత గోధుమ చాయలో నున్న దేహం, కోల ముఖంలో నల్లగ మెరిసే కండ్లు, సంపెంగ పూవుపై వ్రాలిన గండుతుమ్మెదలను పోలి ఉన్నాయి నీల అతడ్ని పదేపదే గమనిస్తుంది అమె మనస్సులో ఏవేవో మధుర భావాలు వీచికలైనాయి -

"మీరేమి తీసుకుంటారు– ఏమి మొహమాట పడకండి. ఈ వాతావరణంలో మీరు నాకు కంపెనీ ఇస్తేనే మజాగ ఉంటుంది ఇక్కడ మనమంతా స్నేహితులమే అనుకోవాలి కమాన్– నేను విస్కీ తీసుకుంటా– నువ్వేయి రమా?"

"సర్ నాకు జిన్ లెమనేడు," అంది రమాదేవి.

"అమ్మ పుచ్చుకున్నదే నాకున్ను," అంది నీల.

"నాకు బీర్ చాలు," అన్నాడు రామకృష్ణ.

"నాకు బీర్" అన్నాడు దేవేంద్రుడు.

సత్యజిత్‌సిన్హా బేరర్‌ని పిలిచి,

"ఒక ఫుల్ పెగ్ పీటర్ స్కాట్ విస్కీ, ఒకపెగ్ బూత్స్ జిన్ విత్ లెమనీడ్, మరో పెగ్ అదే, రెండు బాటిల్స్ హేవర్డ్స్ ఫోరుధవుజండు స్ట్రాంగ్ బీర్."

"థాంక్స్‌సార్!"

"రెండు ప్లేట్లు కాజు, రెండు ప్లేట్లు పొటేటో చిప్స్, ఒకప్లేటు బట్టర్ రోల్స్," అని ఆర్డరిచ్చేడు సత్యజిత్‌సిన్హా. కాస్సేపటికి కోరినవి తెచ్చి పెట్టేడు బేరర్.

తరువాత అందరు కబుర్లలో పడ్డారు సత్యజిత్‌సిన్హా అన్నాడు–

"మీ ఊరు కొద్ది సంవత్సరాలకు మంచి కాస్మొపోలిటన్ సిటి అవుతుంది ఇంకా పెద్ద హోటేల్సు ఇక్కడ కట్టాలి బొంబాయి ఉందిగాని అక్కడి బీచి అందంగ లేదు. తీరంలో ఇసక కన్న మట్టి ఎక్కువ. ఇంత వెడల్పు లేదు తీరం మీ విశాఖ తీరం పొడవున కొబ్బరి మొక్కలను గాని, పోక చెట్లను గాని వేస్తే చాల సుందరంగ ఉంటుంది త్రివేండ్రం దగ్గరున్న కోవలం బీచి అందమంతా ఆ కొబ్బరి చెట్లే. ఈ బీచిరోడ్డుకు ఎగువన బాత్ హట్సు కడితే ఆడవారు బట్టలు మార్చుకుని స్నానం చేసుకుని రావచ్చు. ఈ నగర పాలక సంస్థ శ్రద్ధ వహిస్తే, ఈ చక్కని తీరాన్ని మరీ అద్భుతంగ చేయొచ్చు"

"ఈ బీచ్‌రోడ్డును ఈ మధ్యనే ఔటర్ హార్బరు నుండి వేసేరు విశాఖ అర్బన్ డెవలప్ అథారిటీ, మున్సిపల్ సంస్థ ఈ నగరాన్ని **అందంగ చేయడానికి ఇప్పుడిప్పుడే ఎన్నో కార్యక్రమాలను చేపట్టేరు", అని చెప్పేడు రామకృష్ణ.**

కాస్సేపటికి అందరి డ్రింక్స్ అయిపోయేయి. వారు మరివద్దంటున్న చిటికవేసి సత్యజిత్‌సిన్హా బేరర్‌ని పిలిచి మరో రౌండ్‌ని రిపీట్ చేయమన్నాడు

"నాకు బీర్ మరివద్దు సార్, అని వేడుకున్నాడు రామకృష్ణ.

"సర్- బేరర్, ఒక విస్కీ, నాలుగు జిన్ జిన్‌విత్ లెమనేడ్ తే"

"ఏమండి మీ సరదా బంగారం గాను. ఇలా మీరు బలవంతం చేసి మాకీ డ్రింక్స్ పట్టేస్తే, మమల్నందర్ని మీరు ఎత్తుకుని ఇంటికి తీసుకుని వెళ్ళ వలసి వస్తుంది సుమా," అని చిరునవ్వుతో రమాదేవి అంది

"ఒకే- ఈ రౌండుతో ఆపేస్తాను మరేమి గాబర పడకండి."

డ్రింక్స్ రాగానే మెల్లగా పుచ్చుకోవడం చేసేరు.

"మీ దక్షిణాది వారు బాగా చదువుకున్న, డబ్బున్న కాస్త కాన్సర్వేటివుగానే ఉంటారు కదూ?" అని యధాలాపంగ అడిగేడు సత్యజిత్‌సిన్హా

ప్రణయవల్లరి

"అవునండి- ఎక్కడో, మిలిటరి ఆఫీసర్స్ ఫామిలీస్‌తో తప్ప మా వాళ్ళు ఉత్తర భారత దేశీయులంత ఫార్వర్డ్‌గ ఉండరు. ఒక విధంగ మావాళ్ళు షైటైపే." అని ఒప్పుకున్నాడు రామకృష్ణ.

'దానికేంలే ఒక్కొక్కరి సంస్కృతి ఒక్కొక్కలా ఉంటుంది," అని రామకృష్ణను సమర్ధించేడు దేవేంద్రుడు.

ఈ లోగ నీల తన జిన్ గ్లాసును చూసి, "అమ్మో! నేనింత త్రాగలేను. ఇప్పటికే నా తలలో రొదగ ఉంది," అని తన గ్లాసులోని జిన్‌ను ప్రక్కనున్న రామకృష్ణ జిన్‌గ్లాసులో మూడొంతులు పోసేసి ఒక వంతు మాత్రమే ఉంచుకొంది

"చంపేసేవు- నేను ఇందులో చాల ఎమచ్యూర్ని నేనిదంతా పుచ్చుకుంటే, మీ అమ్మగారు చెప్పినట్లు ఇక్కడే నిద్రపోగలను," అన్నాడు రామకృష్ణ బెదరుగ.

"మరేం ఫరవాలేదు- మగవాడివి తట్టుకోగలవు;" అని చిరునవ్వుతో నీల తన గ్లాసును దూరంగ తీసుకుంది.

తప్పనిసరిగ రామకృష్ణ భయ పడుతునే మెల్లగ త్రాగడం చేసేడు.


"రామకృష్ణ, నేను గత మూడేళ్ళ **అలహాబాదు నివాసంలో ఒక్కసారి మాత్రమే ఆఖరి రోజున పుచ్చుకున్నాం. నాకు కాస్త ఈ హార్డ్ డ్రింక్స్‌తో పరిచయమున్నప్పటికీ రామకృష్ణకు అదే తొలిసారి అని తెల్సింది. ఆ మరునాడు హేంగో వరుతో చాలబాధ పడ్డాడు," అని దేవేంద్రుడు చెప్పేడు.**

"ఎంత అదృష్టం- నేను ఎంత పుచ్చుకున్నా ఇప్పుడా ఆనందభరితమైన ఆ ఉన్నత స్థితికి రాలేను," అని ఏదో తలచుకుని సత్యజిత్‌సిన్హా కాస్త బాధపడిపోయేడు.

రమాదేవి చిరుకోపంతో సరసంగానే చూచింది భర్తవైపు. ఇప్పటికీ ఆమెకు అందగాడైన, అధికధనికుడైన ఆ డాక్టరు భర్తంటే ఎంతో ప్రేమ. చిరుకోపం నటించిన అతని మాటను దేనిని ఆమె కాదనలేదు.

"నాకానాడు అలహాబాదులో ఆ రాత్రి ఏం చేస్తున్నానో తెలియలేదు. నేను ఎలా పార్టీనుండి బయటపడి నా రూముకు చేరేనో, ఎలా బట్టలు మార్చుకుని పడుకు న్నానో ఇప్పటికీ నాకు తెలియని మిస్టరీ. నా మెదడు అలా గజిబిజిగ అయిపోయింది," అని రామకృష్ణ చెప్పేసరికి అందరు నవ్వుకున్నారు.

నీల మాత్రం యేదో ఆలోచనలో పడి, ఆమె గులాబి పెదవులు చిరునవ్వుతో



విచ్చుకున్నాయి కండ్లలో ఓ మెఱుపు కల్గింది మదిలో మమత మసలి.

కాస్సేపయేక అందరు ఆ డ్రింక్సును పూర్తి చేసి డిన్నరుకని లోనికి వెళ్ళేరు. ఆ సరికే డైనింగుహాలులో కొంత మంది చేరేరు.

వాళ్ళ కుటుంబానికి సరిపోయేటట్లుగ కుర్చీలు వేసి కిటికీకి దగ్గర ఓ ప్రక్కకు హెడ్ వెయిటర్ వాళ్ళ టేబుల్ను ఏర్పాటు చేసేడు. మెనుకార్డును అందుకుని అందరు ఎవరికి కావల్సిన వంటను వారు ఆర్డరు చేసేరు రామకృష్ణ మాత్రం నాలుగు చపాతీలు, పొటాటో బటాణీల కూరను మాత్రమే ఆర్డరు చేసేడు.

"అదేమిటి- మాతో ఈ ఒక్క సారి నాన్ వెజి తీసుకోరాదు, బాగుంటుంది? అని అడిగింది నీల

"ఆహా- అలా తీసుకోలేను చిన్నప్పటి నుండి ఒక విధమైన వెజిటేరియన్ తిండి అలవాటు పడిన నాకు హఠాత్తుగ ఇన్ని సంవత్సరాలకు నాన్ వెజి తీసుకోగలనా?"

"అలాగా అయితే చిన్నప్పటి నుండి

ప్రణయవల్లరి

మీరు లిక్కరు తీసుకోలేదే పాలు తప్ప, అట్లాంటిది ఇప్పుడు ఈ ఆల్కహాలు డ్రింకు ఎలా తీసుకోగల్గేరు?"

"లాజికల్‌గా నీ వాదనున్నప్పటికి, మరెందుకో నా మనస్సుకు ఆ లాజిక్‌తో బోధ చేయలేను అది అంతర్లీనంగ నా మనస్సుకు హత్తుకుని పోయిన మా కుటుంబ మతం కావచ్చు, నిర్వచించలేని ఓ భయం, ఒ విముఖత కావచ్చు వాటిని అధిగమించడం అంత సులభం కాదు నాగాలాండులో కుక్క మాంసాన్ని ఎంతో ప్రీతిగ తింటారు నువ్వు తినగలవా? అనేక రకమైన శారీరక, మానసిక రివల్షన్ అలాగే వంకాయ కూర తినే నేను ఆ కోడి మాంసం, గొర్రె మాంసం తినలేను మరోలాగనుకోకు- యూ ఎంజాయ్ నేను దగ్గరే కూర్చుని నా చపాతీలు తింటా", అని నవ్వుతూ చెప్పేసరికి మరేమనలేదు

'ఎవరి అభిరుచి, అలవాట్లు వారివి- దాని గురించి వాదనే లేదు" అని సత్యజిత్‌ఎన్నో తన కార్యక్రమంలో పడ్డాడు

భోజనం ముగించి అందరూ ద్వారకానగర్‌లోని ఇంటికి చేరేసరికి సుమారుగ రాత్రి పదికావస్తూంది ఆసరికి శాంతాదేవి రామకృష్ణ మేనత్త పడుకున్నారు నరసింహమింకా క్లబ్బు నుండి రాలేదు పనివాడు మేల్కొని ఉన్నాడు అందరు మేడ మీదకు పోయేరు

రామకృష్ణకు ఆసరికి బాగానే మత్తుగ ఉంది ముందు బీర్ త్రాగి తరువాత జిన్ త్రాగడం వల్ల ఓ విధంగ అది కాక్‌టెయిల్ డ్రింకయి గాటిద కిక్ ఇచ్చింది కాస్త తూలుతు నడుస్తున్నాడు. అందుకే తను వచ్చేసరికి తన తల్లిగాని, మేనత్తగాని ఎదురు పడకపోవడం మంచికే అయిందనుకున్నాడు

ఎంతో కష్టం మీద పనివాడి ముందర గంభీరంగ నడుస్తు మేడ మెట్లను

కొంటె సలహాలు



మంత్రిగారింట్లో పనిచేస్తుంటే మంత్రులకు చెంచాలను దూరంగా వుంచండి. లేకుంటే ప్రజలకు చెమ్చాగిరి తప్పదు సుమండీ!

****

ప్రయోగం చేసిన వంటల్ని పదిమందికీ పెట్టాక, వారు సజీవంగా మిగిలారని తెలిశాకే మీరు భోంచేస్తే మంచిది.

****



మీరు చేసే గొప్ప వంటలు రుచించాలంటే ప్రారంభంలో చేసే వంటకాల్ని చెడగొడితే సరి!

****

పుస్తకం చూసి వంటలు చేస్తే వాటిని పురుగులు కూడా ముట్టవు.


****

పేషెంట్ నాడివేగం చూశాకే ఫీజు విషయాన్ని చెబితే మేలు!

****

పెద్ద పెద్ద కత్తెరలు కడుపులో అమరకపోవచ్చు. ఆపరేషన్ సమయాల్లో వీలైనంత చిన్న కత్తెరలను వాడటం మంచిది.

****



పొట్టిగా ఉన్న వారికి మీరు వ్రాసిచ్చే మందులతో పాటు "గ్రోమోర్" ఎరువును కూడా క్రమం తప్పక వాడమని చెప్పండి.

****

మీ పుట్టబోయే బిడ్డలకు "డిష్‌బాబు", "గంటెకుమార్", "టంబ్లర్ లక్ష్మి" అనే పేర్లు పెట్టి అసలైన, సిసలైన వంట వారసత్వాన్నించుకోండి!

****



పద్మశ్రీ, భారతరత్నల్లాగే "వంటశ్రీ", "పాకరత్న" బిరుదుల్ని ప్రవేశపెట్టమని మీరూ ప్రభుత్వాన్ని డిమాండ్ చెయ్యండి.

****

విరేచనం సరిగా కానివారికి వండిపెట్టే కూరల్లో మంచినూనె తాలింపుకు బదులు ఆముదం తాలింపు వెయ్యండి!

-ఎ.యన్.యస్. శంకరరావు

చేరుకున్నాడు. కాస్త తడుముకుంటు మెట్లెక్కడం నీల కనిపెడుతూనే ఉంది. మిగతావారు నిషాలో లేరు. రమాదేవికి, దేవేంద్రుడికి బుర్ర కాస్త దిమ్ముగ ఉంది- అంతే. వారు ముగ్గురు ముందుగ మెట్లెక్కిపోయేరు. తాపిగ రామకృష్ణ మెట్లెక్కుతున్నాడు నీల భోజనమయేక విశాఖలో దొరికిన స్పెషల్ మిఠా పాన్‌ని వేసుకుంది, అందరితో బాటు. బాగున్నాయని మరో రెండు కిళ్ళీలను, తరువాత తిందామని, బాగులో పెట్టుకుంది.

మేడ మీదకు చేరగానే బాగులోంచి ఓ కిళ్ళీని తీసి రామకృష్ణకు అందించింది- "ఇది కూడ వేసుకోండి కాస్త ఆ వికారం తగ్గుతుంది", అని. రామకృష్ణ యాంత్రికంగ అందుకొని నోట్లో వేసుకున్నాడు నీలను ఆసరాగా చేసుకుని మెల్లగా నడవనారంభించేడు

రామకృష్ణ తడుముకుంటు తన రూముకు నీల సహాయంతో మెల్లగ చేరేడు. రామకృష్ణ తడబాటును ముందు వెళ్ళిన ఆ ముగ్గురు గమనించలేదు. వారి వారి గదులకు పోయేరు నీల రామకృష్ణను గదిలోకి చేర్చి, అక్కడున్న టేబిలు పైన బాగును వదలి వచ్చేసింది, ఏమరపాటున.

నీల తన గదిలోకి పోయింధి. ఓ గంట గడిచింది అందరూ నిద్రలోకి జారేరు నీలకు నిద్ర రావడంలేదు రామకృష్ణ రూపం ఆమె మనస్సులో ఉత్తుంగ తరంగాలకు మల్లే కోరికల్ని రేపుతూంది కావల్సినది ఎలానైనా పొందడం నీల మతం అందున తను రామకృష్ణను కోరడం, భర్తగా అతడ్ని పొందుదామనే. ఆమెకు తెల్సు కాశ్మీరు నుండి అతడ్ని ప్రేమిస్తు వస్తున్నదని. అతడు తనకు ఎంత దూరంగ జరుగుతుంటే ఆమె కోరిక అంత బలవత్తర మవజొచ్చింది. వారిరువురు ఈ మూడు సంవత్సరాలలో అడప తడప కలియడం ఆమె ప్రేమకు దోహదం చేసినట్లయింది ఆ సన్నిహితాన్ని అనుబందంగ చేసుకోవాలని ఆమె కాంక్ష తనకు పరిచయమున్న తన జాతి యువకులందరి కన్న ప్రత్యేకత కల్గిన ఈ ఆంధ్ర యువకుడు ఆమెలో తట్టుకోలేని కోరికల్ని రేపేడు

నిద్ర రాక ఆ రెంతవ కిళ్ళీని వేసుకుందామని లేచింది బాగు కోసమని చూచింది బాగు లేదు- అప్పుడు జ్ఞప్తికి వచ్చింది. తను రామకృష్ణను గదిలో మంచం మీద కూర్చొబెట్టినప్పుడు తన బాగును టేబిలు మీద ఉంచడం ఆ బాగును తెచ్చుకుందామని వేగంగ కొట్టుకుంటున్న గుండెలతో, తడబడే అడుగులతో మెల్లగ నడుచుకుంటు రామకృష్ణ గది వద్దకు వెళ్ళింది తలుపులు వేసి లేవు, కర్టను వేసుంది లోన బ్లూ నైట్ లైటు వెలిగుంది.

(ఇంకా ఉంది)

పెట్టుబడిదార్లకోసం ఆ నాగార్జున మాత్రమే వాగ్దానం చేసే 'వసతులు' ఏవి ?



ఆంధ్ర ప్రదేశ్‌కి గర్వకారణమైన

పెట్టుబడిదారులు ప్రాస్పెక్టస్‌లోని వివరాలను చదివి పెట్టుబడి నిర్ణయాలను తీసుకోవాలని కోరుతున్నాం

తక్కువ కాలంలోనే ఉత్పత్తి ప్రారంభం.

గ్యాస్ ఆధారంగా యూరియా తయారు చేసే నాగార్జున వారి ఎరువుల కర్మాగారంలో ఆగస్ట్ '91 కల్లా ఉత్పత్తి ప్రారంభం అక్కడ ఉత్పత్తి అయేది సంవత్సరానికి 5 లక్షల టన్నుల యూరియా

మొదట్లో చెల్లించాల్సిన షేర్ ధనం కూడా తక్కువే.


పెట్టుబడిదారులు దరఖాస్తుతో పాటు చెల్లించాల్సిన డబ్బు షేర్ విలువలో 25 శాతం మాత్రమే షేర్లు కేటాయించిన తర్వాత 25 శాతం, మిగిలినది 2 సులభ వాయిదాలలో చెల్లించవచ్చును

షేర్ కొనుగోలు ధర తక్కువ: సమాన విలువకే.

స్టాక్ ఎక్స్ఛేంజిలో ఎన్నో ఎరువుల కంపెనీల ధరలు బాగా పలుకుతున్నాయి దక్షిణ భారతదేశంలో అత్యంత పెద్దదైన నాగార్జున ఎరువుల ఫ్యాక్టరీ షేర్లు సరిసమాన ధరకే సమకూర్చబడుతున్నాయి

సమర్పిస్తున్నాం **నాగార్జున ధనసాగర్.**

మీ భవిష్యత్తులో ఏళ్ళతరబడి ఎనలేని రాబడులను తెచ్చిపెట్టే ఇష్యూ.





NFCL నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్.

ఇష్యూకి ముఖ్యమైన సంస్థలు :

SBI Capital Markets Ltd. Bombay

CANBANK FINANCIAL SERVICES LTD. Hyderabad

Indbank Merchant Banking Services Ltd. Madras

J.M. Financial & Investment Consultancy Services Ltd. Merchant Banking Division Bombay

నాగార్జునలో పెట్టుబడి పెట్టండి

NAG P 32 2334 TL

న్యాయచట్టం
ప్రశ్నలు-జవాబులు



అడ్వొకేట్: **బి.భాస్కరరావు** ఎం.ఎ.,ఎల్.ఎల్.బి.

బాపట్ల శ్రీనివాసరావు, విజయవాడ

ప్రశ్న:- మేము నలుగురము అన్నదమ్ములము, ఒక చెల్లెలు ఉన్నది నా యొక్క ఇద్దరు అన్నయ్యలకు, మరియు చెల్లెలుకు వివాహములు అయినవి నేను మూడవవాడిని ఇంకా వివాహము కాలేదు చిన్న తమ్ముడు చదువుకొనుచున్నాడు నేను 8వ తరగతి వరకు చదివి మానివేశాను నేను కిళ్ళీ కొట్టు లేదా ఆటో రిక్షా కొనుటకు నా తండ్రిని కొంత డబ్బు అడిగాను నా తండ్రి నిరాకరించాడు నా తాత యొక్క ఆస్తి 11 సెంట్ల స్థలము ఉన్నది. దానిలో నా తండ్రి ఒక డాబా కట్టించినాడు మా తాత యొక్క ఆస్తిలో వాటా నేను ఏ విధంగా తీసుకొనవలయును?

జవాబు:- మీ తాత యొక్క ఆస్తిలో వాటా కావాలని మీరు పార్టిషన్ దావా వెయ్యండి.

సి. మోహన్‌కుమార్, నరసారావుపేట.

ప్రశ్న: నన్ను మా దగ్గిర బంధువులు దత్తత చేసికొనినారు. తర్వాత నా పేరు వేలూరి వెంకట లక్ష్మీనరసింహా మోహన కుమార్‌గా మార్చబడినది. ఈ క్రొత్త పేరు ఆంధ్రప్రదేశ్ గెజెట్‌లో ప్రచురించబడినది. కాని నా విద్య యొక్క సర్టిఫికేట్లు పాత పేరు మీద యున్నవి. నాకు ఇంకా ఉద్యోగము రాలేదు. నేను దరఖాస్తులు కొత్త పేరుతో పెట్టవలెనా? లేక సర్టిఫికేట్లలో ఉన్న పేరుతో పెట్టవలెనా? తెలియపర్చవలెను.

జవాబు: మీరు సర్వీస్ కమీషన్‌లకు దరఖాస్తులు పంపునప్పుడు పాత పేరుతోనే పంపండి. మీరు సెలెక్ట్ అయితే మీ సర్టిఫికేట్లు వెరిఫై చేస్తారు. సర్టిఫికేట్లు మీ దగ్గిర ఇప్పుడు ఉండాలి. పేరు మార్చుకొనడానికి మీరు సర్టిఫికేట్లు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు లేదా ఇంటర్ మీడియెట్ బోర్డునకు పంపినట్లయితే అవి తిరిగిరావడం ఆలస్యం అయినప్పుడు ఉద్యోగం దొరకడం కష్టం. ఉద్యోగానికి వయస్సు ముఖ్యం. వయస్సు దాటిపోతే ఉద్యోగం రాదు. కాబట్టి మీకు ఉద్యోగం వచ్చిన తర్వాత పేరు మార్చుకొనండి.

కే.బి.రామమూర్తి, కాకినాడ-3.

ప్రశ్న: మా తండ్రికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలకు 1944, 1964లలో వివాహములు జరిగినవి. పెద్ద కుమారుడు 1985 లో మరణించెను. మా తండ్రి 1986లో ఒక విల్లు వ్రాసి నోటరీ చెయ్యించారు. నా పేరున 1987 లో మరియొక విల్లు వ్రాయించి నోటరీ చెయ్యించు ప్రయత్నములో ఉండగా మా తండ్రి మరణించారు. 1986లో వ్రాసిన విల్లులో ఆస్తిలో 1/3 వంతు నా సోదరుని పిల్లలకున్నూ, 1/4వంతు నాకున్నూవ్రాసినారు. నాకు ఒక కన్ను పోవుటచే నా తండ్రి 1987లో నా పేరున ఉన్న ఆస్తి అంతయూ వ్రాసినారు. ఇప్పుడు మా పెద్దక్క విల్లు చెల్లదనియు, ఆస్తిలో వాటా వచ్చుననియు కాకినాడ కోర్టులోదావావేసినారు.మా వదిన గారు కూడా 1986లో నోటరీ అయిన విల్లు ప్రకారం తనకు హక్కు కలదని కాకినాడలో దావా వేశారు. నాకు న్యాయ సలహా ఇవ్వవలెనని కోరుచున్నాను.

జవాబు: ఇప్పుడు మీ ఆస్తి విషయం కోర్టులో ఉన్నది గనుక ఏ అభిప్రాయము వెల్లడించకూడదు. సబ్ జుడిస్ అవుతుంది-కదా!

కొత్తకోట సంజీవరావు,కొత్తకోట(విశాఖ జిల్లా)

ప్రశ్న: నా యొక్క తల్లిదండ్రులకు చదువు లేని కారణంగా నా స్కూలు సర్టిఫికేట్‌లో పుట్టిన తేదీ తప్పు వేశారు. నేను 10వ తరగతి 1982 మార్చిలోప్యాసు అయ్యాను. నా స్కూలు సర్టిఫికేట్‌లో నాయొక్క పుట్టిన తేదీ 5-9-1964 అని ఉన్నది. కాని పంచాయితీ రికార్డు ప్రకారం నాయొక్క అసలు పుట్టిన తేదీ 30-10-1969. నాయొక్క పుట్టిన తేదీ మార్చుకొనుటకు సలహా ఇవ్వ వలెను.

జవాబు: మీ యొక్క పుట్టిన తేదీ పంచాయితీ రికార్డులో ఉన్న ప్రకారం మార్చమని కోర్టులో దావా వెయ్యండి.

జి. కె. లక్ష్మి, సంగం జాగర్లమూడి, (గుంటూరు జిల్లా.)

ప్రశ్న: మా మామగారు 14-1-88 తేదీన మరణించారు. ఆయన సంతానం నా భర్త మరియు ఒక చెల్లెలు. నా భర్త 18-7-'83 తేదీన మరణించారు. మా మామకు ఒక ఇల్లు ఉన్నది. నాకు ఒక అబ్బాయి, ముగ్గురు అమ్మాయిలు, మా ఆడబడుచునకు తనకు ఇంటిలో, ఆస్తిలో వాటా ఉన్నదని కోర్టులో దావా వేసినది. మా అత్త కూడా ఆస్తిలో హక్కు ఉన్నదని కోర్టులో దావా వేసినది. మాకు ఆస్తిలో ఎంత వాటా ఉన్నది?

జవాబు: మీ దావా విషయాలు కోర్టులో ఉన్నవి. కనుక సమాధానం ఇవ్వడానికి సాధ్యం కాదు. సబ్ జుడీస్ అవుతుందండి!

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

1954 లో విడుదలైన ఎ. వి. ఎం. ప్రొడక్షన్స్ "సంఘం"

(దర్శకుడు ఎం వి రామన్, మాటలు-పాటలు తోలేటి వెంకటరెడ్డి; నటీ నటులు అంజలీదేవి, ఎన్ టి రామారావు, వైజయంతిమాల, బాలచందర్, ఎస్ వి రంగారావు, నాగయ్య, సహస్ర నామం, ఋష్యేంద్రమణి రమణారెడ్డి)



వర్ణ భేదాలు రూపుమాసిపోవాలని, అవి పోతేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందనీ ఆ విభేదాలు పోవడానికి వర్ణాంతర వివాహాలు జరపడం మంచి మార్గమనీ ఉద్బోధించే చిత్రం-సంఘం

ది 17-7-1954న యీ చిత్రం మద్రాసు ఎ వి ఎమ్ స్టూడియోలో పత్రికా విలేఖరులకు చూపబడింది

వర్ణాంతర వివాహం చేసుకున్న ఒక సంఘ సంస్కర్తకు (నాగయ్య) కామిని (అంజలీదేవి) అని ఒక కుమార్తె వుంటుంది కామిని కులంలేని పిల్ల కావటంచేత ఎవరూ ఆమెను పెళ్ళి చేసుకోవడానికి ముందుకురారు కామినికి– రాణి (వైజయంతిమాల) అని ఒక స్నేహితురాలు వుంటుంది రాణి- మంచి ధైర్యవంతురాలు పైగా బాగా నాట్యం కూడా చేస్తుంది

రాజా (ఎన్ టి రామారావు) తండ్రిగారు సీతా రామాంజనేయదాస్ (యస్ వి రంగారావు) ఈయన ఆడవాళ్ళమీద అకారణ ద్వేషంతో మండిపడుతూ ఉంటాడు అందుచేత ఆయన కొడుక్కి పెళ్ళి చేయకూడదని పట్టుబట్టి కూర్చుంటాడు కాని భార్య రత్నం (ఋష్యేంద్రమణి) పోరు భరించలేక పెళ్ళి చేయడానికి ఒప్పుకుంటాడు అయితే తనకు నచ్చిన పిల్లనేపెళ్ళి చేస్తానంటాడు

ఒకరోజున రాజా అతని స్నేహితుడు చంద్రం (బాలచందర్) కారులో పోతుండగా కామినీ-రాణి మరొక కారులో పోతూ తటస్థపడతారు

రాజా కామినిని ప్రేమిస్తాడు ఆమె కులంలేని పిల్ల అని తెలిసి కూడా ఆమెనే పెళ్ళి చేసుకుంటానంటాడు చంద్రం-సహాయంవల్ల రాజా-కామినిల వివాహం రాజా తండ్రికి తెలియకుండా జరిగి పోతుంది

రాజా ఒక కులంలేని పిల్లను పెళ్ళి చేసుకున్నట్టు తెలిసి అతని తండ్రి కోపంతో కొడుకుని వెనక్కి పిలిపిస్తాడు కులంలేని పిల్లకు గుణం కూడా వుండదని నూరిపోస్తాడు ఒకరోజు రాజా భార్య కోసం వెళ్ళితే అక్కడ కెప్టెన్ సుందరం (సహస్ర నామం) కామినిని బలాత్కరించబోవడం రాజా అక్కడ ఆ గదిలో వారిద్దరూ వుండటంచూసి కామిని మంచిదికాదని రాజా అభిప్రాయపడి తండ్రి వద్దకుపోయి మీ యిష్టం వచ్చిన అమ్మాయిని పెళ్ళి చేయండి! అంటాడు

రాణికి రాజాతో కామినికి పెళ్ళయిన విషయం తెలీక రాజాతో పెళ్ళికి అంగీకరిస్తుంది చివరలో కామిని నిర్దోషిగా నిరూపణఅయి కులంలేని పిల్ల అయినా గుణంగలపిల్ల అయినందున ఆమెతో రాజా కాపురం చేయడానికి అంగీకరిస్తాడు అంతా సుఖంగావుంటారు

(ఈ సమీక్ష 28-7 1954 ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక లో ప్రచురింపబడింది)

అలనాటి మేటి చిత్రాలు (12)

సేకరణ భీశెట్టి

జీవితాన్ని చదువుకో

స్వరూప్ సిన్హా

ఉత్తరాన్ని కసికొద్దీ చించి అవతల పారేసాడు అజయ్. ఇలా ఇంటినుంచి వచ్చిన ఉత్తరాల్ని చించి పారెయ్యడం ఇది ఆరో సారి! రాను రానూ అతనిలో అసహనం పెరిగిపోతోంది. "ఛఛ... పాడు లైఫ్!" చీదరించు కున్నాడు మరోసారి.

అతనంతగా చీదరించుకుంటున్నది అతని 'ఓన్ లైఫ్'ను కాదు! తనను కన్న తన 'పేరెంట్స్ లైఫ్'ను! విసురుగా వంకీకున్న చొక్కా తీసుకుని తొడుక్కుని రూము తలుపులు దభాలున వేసి, తాళం నొక్కి బయటపడ్డాడు. నడుస్తుంటే యెందుకో మనసంతా కసిరేగుతోంది! హాస్టలుకు దగ్గరే ఉన్న నాయర్ హోటల్లో కూలబడ్డాడు ఉసూరుమంటూ. సిగరెట్ నోట్లో కుక్కుకుని పక్కనే బడ్డీలో ఉన్న బుడ్డిమంటతో వెలిగించుకున్నాడు

"ఏం గురూ మంచి కసిమీదున్నట్టున్నావు, రాత్రి పార్టీ తాలూకు హేంగోవరా లేక ఇంటి నుంచి ఉత్తరమేదైనా వచ్చిందా 'నాయినా చిట్టీ, తక్షణమే పి హెచ్.డీ మానేసి వచ్చేయ్'మని. ఏదీ నాకో సిగరెట్టు కొట్టించు, నేన్నీకు స్ట్రాంగ్ టీ కొట్టిస్తాను రేయ్ రాజుగా టీలందించే కుర్రాణ్ణి కేకేసి ప్రక్కసీట్లో కూచున్నాడు మిత్రుడు బాబూరావు.

"ఏముందిరా మామూలే! 'ఎం ఫిల్ అయిపోయింది కదా, ఇంకా ఎందుకు నాయనా చదువు? చదివింది చాలు. ఇక ఇంటికొచ్చెయ్. నీతో పి హెచ్ డి చేయించే స్తోమత మాకు లేదు మనూళ్లో సెంట్రల్ గవర్నమెంటుది స్కూలొకటి పెట్టారు కరస్పాండెంటు తెలిసినాయనే ఉద్యోగం ఇస్తాడట నిన్ను పిలిపించమంటున్నాడు కాంపిటీటివ్ పరీక్షలు ఉద్యోగం చేసుకుంటూ రాసుకుందువు గాని. పెళ్లి చేసుకుని కోడల్ని తెస్తే ఇంట్లో అమ్మకు తోడుగా ఉంటుంది ఏ వయసుకాముచ్చట .' ఛ.. ఇలాగేరా మా నాన్న రాసే ఉత్తరాలెప్పుడూ ఇలాగే తగలడుతుంటాయి అసలు జీవితం పట్ల వీళ్ల 'ఆటిట్యూడ్' చాలా ఛీప్‌రా అన్నీ సామాన్యమైన కోరికలే వీళ్లవి ఇదంతా ఎందుకంటే వీళ్లవి వట్టి వానాకాలం చదువులే! దానికి తగ్గట్టే వీళ్ల కోరికలు కూడా! నేనేదో డాక్టరేటు తెచ్చుకుని యూనివర్సిటీ ప్రొఫెసరో, సివిల్ సర్వీస్ ఎగ్జామ్‌రాసి ఐ ఏ ఎస్ ఆఫీసరో అట్ లీస్ట్ గ్రూప్‌వన్ ఆఫీసరో అవ్వాలనుకుంటుంటే.. " పళ్లు నూరాడు అజయ్.

"మరి నీ అభిలాషను మనవి చేసుకోలేక పోయావా నీ మాతా పితరులతో. !"

"చెప్పానురా బాబూ! చెప్పి చెప్పి నా నాలుకయితే అరిగిపోయింది గానీ వాళ్ల మనసులు మాత్రం కరగలేదు. నలభైయాభై వేలు ఖర్చయితే అయ్యింది, ఢిల్లీకి కోచింగ్‌కు వెళతానన్నాను సివిల్ సర్వీసెస్ కోసం ... ఉహూ... ఏమీ లాభం లేకపోయింది. 'చదివిన చదువు చాల్లే. గవర్నమెంటు ఉద్యోగం ఏదో ఒకటి రాక పోదు.ప్రస్తుతానికీ ఉద్యోగంలో చేరి ప్రిపేర్ అవుదువుగాని ఇంటికొచ్చెయ్....!' ఇదీ వరస! ఇంత చదువూ చదివి వెధవ టీచరుద్యోగం చెయ్యాల్ట ఆ పల్లె, పట్నమూ కాని ఊళ్లో!.... బుద్ధిలేకపోతే సరి!"

"అలా కోపగించుకోకు భాయీ! కాస్త వాళ్ల పక్షాన కూడా ఆలోచించాలి గదా. ఇద్దరూ పెద్ద వాళ్లయిపోయారు. నువ్వు కాస్త ఇంటి పట్టున ఉండే ఏదైనా ఉద్యోగం చేస్తుంటే చేదోడూ వాదోడుగా ఉంటుంది. కన్నవాళ్ల కాబట్టి నీ ముద్దూ ముచ్చట వాళ్ళక్కాక మరెవరికి పడుతుంది చెప్పు! పెళ్లి చేయాలనుకోవడం వాళ్ల సహజమైన కోరికే. ఇందులో విపరీతమేమీ లేదు. అసలిది ఇండియా కాబట్టి సరిపోయింది. మనకిన్నేళ్లు వచ్చినా తల్లిదండ్రులు మనల్ని పోషిస్తున్నారు. మనమిలా హాస్టళ్లల్లో గడిపేస్తూ హాయిగా లైఫ్ ఎంజాయ్ చేస్తున్నాము. అదే ఫారిన్ కంట్రీస్‌లో అయితే యువతరం కష్టపడి సంపాదించుకుని జల్సా చేస్తారు. పేరెంట్స్ మీద డిపెండ్ కారు. జీవితంలో పైకి రావాలన్నా అంతే! సొంత సంపాదనతోనే పైకొస్తారు." బాబూరావు ఇంకా ఏదో చెప్పబోతుండగా-

"మైగాడ్, నువ్వూ మొదలెట్టావా దుర్బోధ? చాల్చాలు ఆపరాబాబూ, బుద్ధి గడ్డితిని నీతో నా స్వంత విషయాలు చెప్పాను. ఇంకెప్పుడూ చెప్పను" కసిగా చెంపలు వాయించేసుకున్నాడు 'రప రపా' మని.

సరిగ్గా అదే సమయంలో, అజయ్ అలా చెంపలు వాయించుకునే శబ్దానికి నేపథ్యంగా 'దభీ దభీ'మన్న చప్పుడు వినిపించింది, ఎవరి వీపో విమానం మోత మోగుతున్నట్టు! ఆశ్చర్యపోతూ మిత్రులిద్దరూ తమ సంభాషణను పక్కనపెట్టి చుట్టూ కలయజూసారు. హోటల్ మధ్యలో ఓ ఆసక్తికరమైన దృశ్యం అగుపించింది. నాయర్ టీ కాఫీలందించే రాజు అనే కుర్రాణ్ణి దొరకబుచ్చుకుని గట్టిగా తిడుతూ వాడివీపు మీద మద్దెల, బుర్రమీద ఘటం వగైరా వాయిద్యాలన్నీ అవలీలగా వాయించేస్తున్నాడు. వాడు ఏ మాత్రం తక్కువ తినకుండా, నాయర్‌ని బండబూతులు తిడుతూ, కాళ్లతో చేతుల్తో అందిన చోటల్లా కుమ్మేస్తూ సాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు తప్పించుకుపోవడానికి మిత్రులిద్దరూ లేచి అక్కడికి పరిగెత్తారు. ఈ లోపల రాజు నాయర్ పట్టు నుండి విడిపించుకుని పరిగెత్తిపోయి తలుపు దగ్గర నుంచున్నాడు రొప్పుతూ రోజుతూ! కాసేపు ప్రత్యర్థులిద్దరూ పళ్లుకొరుక్కుంటూ ఒకళ్లనొకళ్లు మింగేసేలా చూసుకుంటూ నించున్నారు. ఓ నిముషం తర్వాత రాజు టేబిలు మీద గ్లాసందుకొని మంచినీళ్లు గటగటా తాగేసి చెప్పాడు, "నేను సదివి తీరతాను. నీ ముండమోపి కాసా హోటల్లో పనిజెయ్యను" ఆవేశంతో వాడి ముక్కుపుటాలదురుతున్నాయి అసలే ఎర్రటి పిల్లాడేమో దెబ్బలతో, అవమానంతో అన్నిట్నీ మించి రోషంతో మధ్యాహ్నపు ఎండలో ఎర్రచేప పిల్లలా మిలమిలలాడిపోతున్నాడు

వాడు.

"అవున్రా యెదవా .. చదువుతావు. ఆడ నీ అయ్యకు కూడెవరు బెడ్తారు? నువ్వు పనిమానేసి స్కూలుకి పోతే ఎట్ల బ్రతుకుతావు? నేన్నీకు మూడు పూట్లా తిండిపెట్టి, బట్టలిచ్చి మీ ఊరి కింత డబ్బు పంపిస్తుంటేనే గదా మీ వాళ్ల బ్రతుకుతు న్నారు" మాట్లాడుతూ మాట్లాడుతూనే రెండంగల్లో కోతిలా గెంతి మళ్లీ వాణ్ణి దొరకపుచ్చుకుని వాద్యసంగీత కచేరీని మొదలెట్టబోతూంటే, అంతదాకా 'ఫ్రీ'గా వినోదించిన జనం కలగచేసుకుని నాయర్‌ను, రాజునూ ఎవళ్లకు వాళ్లను విడదీసారు బాబూరావు అడిగాడు సంగతేమిటని


"చూడండిసార్ నేనేమో వీడ్ని ఈ హోటల్లో బలవంతంగా కూలిచేయిస్తున్నానంట. వీడికేమో చదివి ఆఫీసరవ్వాలనుందట. నేనే వీడ్ని చెడగొడుతున్నానంట. వీడు రోజూ బడికిపోతే ఇక్కడ పనెవరు చేస్తారు? వీడి తండ్రి నన్ను పనిలో పెట్టుకోమని బ్రతిమాలితేనే నేను పెట్టుకున్నాను వీడికి ముప్పొద్దులా తిండి పెట్టడమే కాకుండా వీళ్ల యింటికి కొంత డబ్బు కూడా పంపుతున్నాను. కానీ వీడికేమయినా ఆ జ్ఞానముందా అని?"

"నువ్వేమి నాకు బువ్వ బెట్టనవసరంలే! నా కాడ పైసలున్నాయి. మా నాయనకు నీ పైసలవసరంలే. ఏదో ఓ దిక్కుపని జేస్కొని బ్రతుకుతడు. నేను మాత్రం ఈడ పనిజెయ్యను" గబగబా లోనికెళ్లి చిన్న సంచీ ఒకటి తీసుకొని దాన్ని చంకనబెట్టుకొని మరుక్షణం రివ్వున బయటికి పరిగెత్తాడు, మళ్లీ నాయరెక్కడ పట్టుకుంటాడోనన్న భయంతో.

"ఫో... నాయాల! నాలుగురోజులు కడుపులో కాలితో నువ్వే వస్తావు. చదువూ గిదువూ దిబ్బలో పడేసి...." కాండ్రించి ఉమ్మేసి వెళ్లి తన సీటులో కూచున్నాడు. అయిదు నిముషాల వరకూ ఏదో గొణుక్కుంటూనే ఉన్నాడతను.

బాబూరావు వైపుచూసి గర్వంగా నవ్వేడు అజయ్. అతనికేమి అర్థంకాలేదు. మౌనంగా టీ తాగేసి డబ్బు చెల్లించి బయటికొచ్చాక చెప్పాడు అజయ్, "ఆ వెధవకు చదువుకోమని నూరిపోసింది నేనే! రోజూ ఉదయం టీ దాగడానికి తొమ్మిదింటికి వచ్చేవాణ్ణి. వీణ్ణి పట్టుకుని దారినపోయే స్కూలు పిల్లల్ని చూపిస్తూ నచ్చజెప్పే వాణ్ణి చదువుకుంటే జీవితంలో సాధించలేనిదంటూ ఉండదని. ఇది వాడికి చదువుకోవాల్సిన వయసని, కూలి చెయ్యాల్సిన వయసు కాదనీ, నేనింత పెద్ద వాణ్ణయినా గొప్ప వాణ్ణి అవ్వడానికే ఇంకా చదువుతున్నానని నా పుస్తకాలు చూపించి మొత్తంమీద వాడిలో 'రివల్యూషన్' తేగలిగాను "

"ఏడిసినట్టుంది గురూ! కుర్రవెధవకు తెలిసీ తెలియని వయసులో బతకడానికి ఉన్న ఆ కాస్త ఆధారాన్ని కూడా ఊడగొట్టావు ఇది 'రివల్యూషన్' కాదు 'రివర్షన్'! ఇప్పుడు చూడు వీడితో పాటుగా వీడి ఫ్యామిలీ మొత్తం 'సఫర్' అవ్వవలసి ఉంటుంది" చికాకును వ్యక్తపరిచాడు బాబూరావు.



ఆరోగ్యానికి శాకాహారమే మంచిది!

మాంసాహారం కంటే శాకాహారమే గొప్పదంటున్నారు జర్మన్ శాస్త్రవేత్తలు. క్రొవ్వు పదార్థాలు భుజించే వారికంటే శాకాహారం తీసుకున్నవారు ఎక్కువ ఆరోగ్య వంతులుగా వుండటమే కాకుండా గుండె సంబంధమైన రోగాలకు దూరంగా వుండగలరట.

బెర్లిన్‌లోని జర్మన్ ఆరోగ్య కార్యాలయం వారు 1985లో ప్రారంభించిన బెర్లిన్ శాకాహార అధ్యయనం పై విషయం వెల్లడించింది.

ఈ అధ్యయనంలో 372 మంది శాకాహారులు పాల్గొన్నారు. శాకాహారం తీసుకునే వారి రక్తంలో యూరిక్ యాసిడ్ విలువలు చాలా తక్కువగా వుండటం, వాత సంబంధమైన రోగాల బారినుంచి కాపాడ బడటం మూలంగా వారు ఆరోగ్యవంతులుగా వున్నట్లు ఆ అధ్యయనం వివరించింది

ముఖ్యంగా గుండె సంబంధమైన రోగాలు శాకాహారుల జోలికి రావటం తక్కువని, మాంసాహారుల విషయంలో అలా కాదని, శాకాహారం మూలంగా మూత్రపిండాలు కూడా సక్రమంగా పని చేస్తాయని వెల్లడయింది. శాకాహారులతో పోలిస్తే మాంసాహారుల్లో మూడింట రెండు వంతులమంది అధిక రక్తపు పోటుతో బాధ పడినట్లు కనుగొన బడిందట. క్రొవ్వు శాతం తక్కువగా వున్న పదార్థాలనే భుజించి ఆరోగ్యం కాపాడుకోవటం మంచిది.

మనం భుజించే ఆహారం పైనే మనిషి ఆరోగ్యం ఆధారపడి వుందని, అదీ శాకాహారుల్లోనే సాధ్యమవుతుందని జర్మన్ శాస్త్ర వేత్తలు అంటున్నారంటే... మనం తెలిసి తెలిసి క్రొవ్వు పదార్థాల జోలికి పోవటం ఎందుకు? ఆ క్రొవ్వు పదార్థాలు తక్కువున్న శాకాహారాన్నే భుజించి మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

–తిలక్

"నోరుముయ్యరా....! మీరెవ్వరూ నన్నర్థం చేసుకోలేరు. మహానాయకులంతా ఒకప్పుడు కటిక పేదరికంలో మగ్గిపోయినవారే. రాజుగాడిలో ఆ పట్టుదల చూసావా? వీడూ రేపు గొప్పవాడవుతాడు నో డౌట్! వాడిలో వచ్చిన ఆ పరివర్తన చాలు..."

అజయ్ కోరిక మేరకు నోరుమూసుకున్నాడు బాబూరావు.

****

ఆ మర్నాడు తండ్రికి నిర్మొహమాటంగా ఉత్తరం రాసేసాడు అజయ్, తను పి హెచ్.డి. పూర్తి చేసి గాని రానని, ఆ చీచరుద్యోగం తనకక్కరలేదని. తను జీవితంలో చాలా ఉన్నతస్థానానికి చేరుకోవాలనుకుంటున్నానని

మరో నెల రోజుల తరవాత--

యూనివర్సిటీకి దగ్గరలోనే "సివిల్ సర్వీసెస్"కు కోచింగ్ క్లాసులు ప్రారంభమయ్యాయి. అజయ్ సహచరులు చాలా మంది చేరారు బాబూరావుతోసహా. కానీ అజయ్‌కు చేరడానికి మనస్కరించలేదు. 'ఆఫ్టరాల్ ఈ ఊళ్లో యేమిటి, సివిల్ సర్వీసెస్‌కు కోచింగ్ యేమిటి? దిలో స్టాండర్డ్‌గా ఉంటుంది వెళితే ఢిల్లీ వెళ్లాలి లేకుంటే లేదు. ..' అనుకున్నాడు. ఇంటి నుంచి ఇరవై వేలు తెప్పించుకున్నాడు. మిగతా సొమ్ము నెల రోజుల్లోపల సర్దవలసి ఉంటుందని తండ్రికుత్తరం రాసాడు. 'రీసెర్చ్ గైడ్' పర్మిషన్ తీసుకుని, ట్రెయిన్‌లో బెర్తు రిజర్వు చేసుకోవడానికి స్టేషనుకెళుతూ యధాలాపంగా దారిలో నాయర్ హోటల్ వైపు చూసి ఉలిక్కిపడ్డాడు వాడే, రాజుగాడే! సందేహంలేదు. "సార్‌కు ఒణ్ణు స్ట్రాంగ్ టీ!" అంటూ హుషారుగా అటూ ఇటూ తిరుగుతూ టీలు సప్లై చేస్తూ ఉన్నాడు. సైకిలు స్టాండు వేసి లోనకెళ్లాడు అజయ్ "ఓ.... సార్, చాన్నాళ్లకొచ్చినారు కూచోండి. టీ స్ట్రాంగా, మీడియమా, లైటా?" నవ్వుతూ అడిగాడు ఒళ్లు మండింది అజయ్‌కు వీడారోజేదో హీరో లెవల్లో చదువుకోవడానికి కాసా హోటల్లో పని వదిలిపెట్టేసి వెళ్లి మళ్లీ దేభ్యపుమొహంతో ఇదే పనికి తయారయ్యాడు. వెంట బాబూరావు లేడు గాబట్టి సరిపోయింది. లేకుంటే ఇవ్వాళ తన పరువు నట్టేట్లో కలిసేది. డామ్ ఇన్సల్టింగ్! అవున్లే కాసా హోటళ్ల వెధవలకి కాసా బుద్ధులుగాక మరేం అబ్బుతాయి గనక అనుకుంటూ

వాణ్ణి దగ్గరకు పిలిచి గొంతు తగ్గించి అడిగాడు. వీడిలోని మార్పుకి తనేకారణమనీ నాయర్‌కు తెలిస్తే ప్రమాదం. ఈసారి తనను పట్టుకుని మృదంగం వాయించడం ఖాయమనిపించింది. అందుకే రహస్యంగా అడిగాడు "అదేమిట్రా చదువుకుంటానని ఆరోజు పనివదలి పెట్టి వెళ్లి పోయావుగా... మళ్లీ దాపురించావెందుకూ.. బళ్ళో చేర లేదా?"

"లేదుసార్!" చాలా సిన్సియర్‌గా చేతులు కట్టుకుని చెప్పాడు.

"మరా రోజు అంత ఖచ్చితంగా ఛాలెంజ్ చేసి వెళ్లావు కదరా చదువుకుంటానని?" అసహనంగా అడిగాడు.

"నిజమేసార్, పోయినాను. కానీ రెండ్రోజులకి నా దగ్గర పైసలయిపోయినాయి. ఆకలయితే బువ్వ పెట్టేటోళ్లు లేరు. పస్తులుండి, నీళ్లుదాగి ఇంకో రెండ్రోజులు బతికిన. అప్పుడు నాయరన్న నన్నె తుక్కుంటా రోడ్లు రోడ్లు దిరుగుతుండె నన్ను మల్లా ఈడికి తెచ్చినాడు. అప్పుడు తెల్సినాది సార్! బ్రతకడానికి ముందు గావల్సింది కడుపుకింత బువ్వగాని సదువుగాదని. ఉన్న నౌకరి ఇడిసిపెట్టి నాలుగ రోజులకే నేను కిందమీదయినాను ఒక్క నెల నాయరన్న పైసలు బంపియ్యకుంటె అడ మా అమ్మానాయన ఎంత కష్ట పడతారో తెలిసింది. వాండ్లు ముసలోల్లు సార్! పనిజేస్కోని బతకలేరు. నా మూలంగా వాండ్లు ఆకలితో సస్తరు గద సార్.. అందుకే వచ్చేసినా!" వాడి కనురెప్పల కలువరేకుల అంచున నీటిము

త్యాలు!

"ఇక జన్మలో చదువుకోనంటావ్. ఇలాగే అంట్లుతోముతూ, కసువులుకొడుతూ బతుకు" కసిగా అన్నాడు.

"అల్లనమాకండిసార్! నేనెప్పటికైనా సదువుకోని పైకొస్త. రాత్రిల్లు నాయరన్న సదివిపిస్తుండు. పరీక్షకు కట్టిపిస్తున్నడు. నవ్వేడు వాడు చొక్కా అంచుతో కళ్లు తుడుచుకుంటూ.

"ఏడిసాడు. ఈ నాయరు నీకెంత వరకు చదవు చెప్పగలడు? మహా అంటే మూడో తరగతి వరకు. అదే నువ్వు స్కూలు కెళ్లి ఉంటే...."

మధ్యలోనే మాటతుంచేసాడు వాడు. 'ఏందిసార్! మా నాయరన్న మూడో క్లాసు కంటె సదువు చెప్పలేడా?' వాడింకా యేదో అనబోతుండగా.

"సారుకు తెలియదు లేరా. నువ్వు పోయి ఆ బల్లకాడ వాళ్లకేమికావాల్నో చూడు ఇదిగోండిసార్ హాట్, స్ట్రాంగ్ టీ."

గతుక్కుమన్నాడు అజయ్. అయితే నాయురు తమ సంభాషణంతా విన్నాడన్న మాట

"మా రాజు చెప్పాడు సార్ వాడికి చదువుకోమని మీరే చెప్పారట నేను వాణ్ని కూలి చేయించడానికి వెతికి పట్టుకొని రాలేదు సార్ వాళ్లమ్మానాన్నలకు డబ్బు వాడు ఇక్కడ లేకున్నా పంపగలను అది కాదు సమస్య! వీణ్ణి ఇంతప్పట్నుంచీ నేనే పెంచాను సార్. ఆ మమకారం చంపుకోలేక పోయాను వాణ్ని చదివించి గొప్పవాణ్ణి చెయ్యాలని నాకూ ఆశ ఉంది! అందుకే నేనే వాడికి చదువు చెపుతున్నాను ఏదో నేను మీ అంత పెద్ద సదువులు చదువుకోక పోయినా ఎమ్.ఏ. పాసయ్యాను . ." నమ్రతగా చెప్పాడు.

నెత్తిన పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు అజయ్. "ఏమిటి?" నోరు వెళ్లబెట్టాడు!

"ఏంసార్? ఎమ్ ఏ చదివి కాసా హోటల్ నడుపుకుంటున్న వెధవనని ఆశ్చర్యపోతున్నారా? అయితే నేను మాత్రం యీ పనిని నీచంగా భావించడంలేదు నా కుటుంబాన్ని పోషించుకోడానికి నేనెంచుకున్న మార్గం యిది! నేనొకరి మీద ఆధారపడటంలేదు.

ఏదైనా ఉద్యోగం వచ్చేవరకూ ఇలాగే ఉంటాను వస్తే ఈ హోటల్ని రాజుకిచ్చేస్తాను. లేకుంటే దీన్నే డెవలప్ చేసుకుంటాను. చదువులో మొట్టమొదటి పాఠం కష్టపడి పని చెయ్యడమేనని రాజుకు చెప్తూ ఉంటాను మనం ముందుగా చదవాల్సింది జీవితాన్ని సార్. పుస్తకాల్ని కాదు స్వతంత్రంగా, గౌరవంగా జీవించడమే ఈ చదువు మనకు నేర్పేది! చదువు సంస్కారాన్ని నేర్పుతుంది. నిజమేసార్! కానీ పుస్తకాల్ని చదవలేని వాళ్లంతా కుసంస్కారులూ, నీతిమాలినోళ్లూ మాత్రం కాదు సార్. వాళ్లంతకంటే విలువైన జీవితాన్ని చదివి అనుభవాన్ని మననం చేసుకుంటారు...."

ములుకులు పోస్తున్నాయి అజయ్‌కు తను చదివిన చదువు నిజంగానే సంస్కారాన్ని నేర్పిందా? ఎన్నో సార్లు బార్‌ల నుండి, బీరుపార్టీల నుండి, 'బ్లూ'ఫిలిమ్ పార్లర్లనుండీ, పేకాట నుండీ, పడుపు వీధుల్నుండీ..... ఇంకా మరెన్నెన్నో విలాసాల నుండీ, ఇదే రోడ్డుమీద ఒంటిమీద స్పృహలేకుండా, మిత్రబృందంతో నవ్వుతూ తుళ్లుతూ, నోటికొచ్చినట్లు పేలుతూ ఇదే రోడ్డుని, ఇదే హోటల్ ముందు నుంచి వెళ్లడం గుర్తొచ్చి సిగ్గుతో చితికి పోయాడతను. ఇదే 'కల్చర్' ఇదే 'సోషల్ బిహేవియర్' ఇది 'లా అఫ్ ది లైఫ్' అని ఎన్నెన్నో ఉపన్యాసాలిచ్చేవాడు అజయ్ తాగిన మైకంలో! ఇక అక్కడుండ లేక బయటికొచ్చేసాడు, వెనక నుండి నాయర్ 'టీ' తాగి వెళ్లమంటున్నా వినిపించుకోకుండా.

అతని మనసంతా శూన్యంగా ఉంది. నెలక్రితం డబ్బు పంపుతూ తండ్రి వ్రాసిన ఉత్తరం గుర్తొచ్చిందతనికి. 'నీ యిష్టప్రకారమే కానీ బాబూ. నీ కోచింగ్ కోసం అమ్మ తాళిబొట్టుతో సహా నగల్ని అమ్మేసింది. నేను ఉన్న కొద్దిపాటి పొలమూ అమ్మేసాను. ఇల్లు గడవడం కష్టంగా ఉంది మేమిద్దరమూ కూలికి పోతున్నాము నీకు త్వరగా మంచి ఉద్యోగం రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉన్నాము.' ఆ ఉత్తరంతో పాటుగా, 'నాయూలంగా అమ్మా నాన్న ఆకలితో సస్తరు గదసార్' రాజు కన్నీళ్లతో బేలగా అడగటం గుర్తొస్తుంది 'చదువు సంధ్యా లేనోళ్లంతా కుసంస్కారులూ నీతి మాలినోళ్లూ కాదు సార్!' నాయర్ గంభీరమైన స్వరం గుండెను తూట్లు పొడుస్తోంది

అజయ్ సైకిల్ వేగాన్నందుకుంది రైల్వేస్టేషన్ వైపు కాదు! పోస్టాఫీసు వైపు జీవిత పాఠంలో మొదటి పుటను చదివిన అజయ్ తండ్రికేమని ఉత్తరం వ్రాస్తాడో మీరు తేలిగ్గా ఊహించగలరు ○

సినిమాలకు రాజేష్‌ఖన్నా స్వస్తి



ప్రముఖ హిందీ నటుడు రాజేష్ ఖన్నా తన 25 సంవత్సరాల నటజీవితానికి స్వస్తి చెప్పి రాజకీయాల్లోకి చేరిపోవాలనుకుంటున్నాడట. ఈ విషయాన్ని తానే స్వయంగా యిటీవల తెలియజేశాడు. మరి చిత్రాలలో అవకాశాలు రాకపోతే ఏదో మార్గం ఎన్నుకోవాలిగా! కాంగ్రెస్ వాది అయిన ఖన్నాకు బొంబాయి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలన్న అభిలాష మెండుగా వుంది అందుకే నటనకు స్వస్తి చెప్తున్నానంటున్నాడు. 155 చిత్రాలకు పైగా నటించిన రాజేష్‌ఖన్నా డింపుల్ కపాడియాకు విడాకులివ్వలేదని, వదంతులు నమ్మవద్దని కూడా ఈ సందర్భంగా తెలియజేశాడు.

ఈవారం లో మీ యోగం

18-1-1991 శుక్రవారం మొదలు 24-1-1991 గురువారం వరకు

మేషం: యోగదాయకమైన వారం. ఎందులోనా? రావలసినట్టి పైకం అందటం, వ్యాపారం అనుకూలంగా సాగి రావటం, అధిక ఖర్చును ఎదుర్కొన గల శక్తిరావటం, పత్రికారంగాన వృద్ధి కూడ. స్త్రీలకు: విలువగల వస్తు సేకరణ, విక్రయం.

వృషభం: ధనలోపం రాదుగాని, 'దిన దిన గండంగా' ఉంటూ ఎలాగో ముందుకు సాగిపోవచ్చు. ఒకానొక వ్యవహారం యోగ దాయకం కానున్నదనుకొనగనే చేయిజారుట గమనిస్తారు. శుభసమయంగా భావించండి, కార్యదీక్షతో ముందుకు సాగండి. స్త్రీలకు: సాహితీ రంగాన యోగం.

మిథునం: నూతన మిత్రులు రానున్నారు. దూరప్రాంతాల నుండి ఉత్తరాలమూలంగా పలు విషయాలు గ్రహింపనున్నారు. ముద్రణారంగాన అనుకూలం మీ వస్తువులు గిరాకిగా అమ్మబడుతాయి. ధనలోపంలేదు. వ్యవహారరీత్యా మేలైనవే ఈ వారందినాలు. స్త్రీలకు: శుభదినాలు, కళా వ్యాసంగం లాభప్రదం.

కర్కాటకం: అయినవారి సంబంధాన్ని గూర్చిన చర్చలు, కార్యసాధన కుంటుపడటం, రాజకీయ రంగాన జరిగిన మేలు చాలురా? అని మనసు కుదుటపరచుకొనుట, యిత్యాదులు. స్త్రీలకు: దూరప్రాంతాలకు వెళ్లవలసిన అగత్యం కొందరకు, కళాసాహితీరంగాన తలదూర్చుట కొందరకు, తద్వారా మేలు.

సింహం: ఆదాయమున్నది. చేసే యత్నమందు కొంత గుర్తింపు, సాహితీరంగాన మేలు. పత్రికారంగాన శ్రమించువారికి సదవకాశాలు, ధనసంపదకు ఆస్కారం. రాజకీయవాదులకు చక్కని అవకాశాలు, ప్రతిష్ఠ, యిత్యాదులు. స్త్రీలకు: కార్యసిద్ధికై శ్రమించి మేలు పొందుతారు.

కన్య: శుభసమయం, ఆదాయమున్నది. వ్యాపారమందు ముందుకు సాగుటయున్నది. అన్ని విధాలా మేలేగాని, ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించుట ఎంతైనా న్యాయం. రచనలో, ఆటపాటల్లో ప్రావీణ్య తగలవారికి చక్కని అవకాశాలు. స్త్రీలకు: ప్రయాణాలు, అనవసరశ్రమ, ఆదాయం లేకుండుట, యిత్యాదులు.

తుల: 'శని' అర్ధాష్టమమందున్నాడు. ఆరోగ్య రీత్యా ఎంత జాగరూకతవహిస్తే అంత మేలు. శుభ కార్యాలోచనలుకూడ దూరంగా జరుగుట మీరే గ్రహిస్తారు. ఆదాయవృద్ధి, సభామర్యాద. స్త్రీలకు: శుభదాయకవారం, ధనలబ్ధి.

వృశ్చికం: ఆరోగ్య రీత్యా జాగ్రత్త అవసరం. వస్తు వాహన సుఖాలకు లోపం లేదు. వ్యవహార రీత్యా అనుకూలం. కొందరకు గృహనిర్మాణతకు ఆస్కారం. అభివృద్ధి కార్యక్రమం కొనసాగుటకు ఆక్షేపణలేదు. స్త్రీలకు: వృత్తి వికాసం, అధికారుల ఆదరణ, 'లాటరీ' ఆదాయం కొందరకు.

ధనుస్సు: రాజకీయంగా మేలే. సర్వ విధాలా అనుకూలమే. వృత్తియందు పెంపు, ఉద్యోగమందు అనుకూలత, ఉత్తరాల మూలంగా పలు విషయాలు గ్రహించుట, సభామర్యాద, వ్యాపారమందు యిబ్బందులుకూడ చవిచూడగలుగుతారు. గ్రహించాలి. స్త్రీలకు: వృత్తి వికాసం, అభివృద్ధి చెప్పవచ్చు.


మకరం: ఆప్త మిత్ర సమాగమం. ధనవసతి, అతిథి అభ్యాగతులను ఆదరించవలసిన సమయం. రాజ్యాంగ రీత్యా ఏదోమేలు చేకూరుట, ధనలబ్ధి, నిశ్చయం. కళారంగాన, సాహితీరంగాన ఏదోమేలు జరుగనున్నదని గ్రహింపగలరు. స్త్రీలకు: వృత్తి వికాసం, ధనలబ్ధి, సభాగౌరవం.

కుంభం: ఎన్నోమంచి కార్యాలు చేసారుగా! ఎందరినో ఆదుకొన్నారుగా! భారీ వ్యాపారం చేయాలని సంకల్పించారుగా! రాజకీయరంగాన ముందుకు సాగిపోయారుగా! పదవి సంక్రమించిందిగా! అయితేనేం? ఇంకా జాగరూకత అవసరం. స్త్రీలకు: విలువగల వస్తుసేకరణ ఆస్కారం.

మీనం: ఇది శుభదాయకవారం. 'శని గురు' గ్రహాలు యోగదాయకులు. ధనయోగమున్నది. కార్యానుకూలతగలదు. వచ్చిన పదవిని జాగ్రత్త పరచుకొనుట జరిగి తీరవలె. అప్పుడుగాని భారీ వ్యాపారాన, పత్రికా రంగాన, అనుకూలత చేకూరదు. ఉత్తరాలమూలంగ పలు విషయాలు గ్రహింపగలరు. స్త్రీలకు: సుఖదాయకం, శుభప్రదం, ధనదాయకం, అన్నిరంగాలందు మేలుండుట గ్రహింపవచ్చు.

విద్వాన్ కోటసత్యరంగయ్యశాస్త్రి





తుమ్మగుంట అయ్యప్పస్వామి క్షేత్రము

ఈ నాడు యే ప్రాంతములో చూచినా భక్తకోటిలో ఉప్పొంగుతున్న అయ్యప్ప భక్తి ఆకర్షణ దిన దినాభివృద్ధి గాంచుచుండుట మన కందరికీ తెలిసిన విషయమే నలువు. కాషా యాంబరములతో నుదుట విభూతి చందన కుంకుమ తిలక ధారణతో రుద్రాక్ష దీక్షా మాలలతో శిరముపై ఇరుముడి ధరించి శరణు ఘోషా నాదములతో శబరిమల అయ్యప్ప దర్శనమునకు వెళ్ళు భక్త సందోహము మన కన్నుల పండుగ చేయుచున్నది యిలా కోట్లాది భక్తుల పూజా నీరాజనములతో కన్నుల పండువ చేయు కలియుగ ప్రత్యక్ష దైవము స్వామి అయ్యప్ప యితని ముఖ్య సన్నిధానము శబరిమల అయినను ప్రజలలో వుప్పొంగుచున్న అయ్యప్ప భక్తితో అనేక ప్రాంతముల అయ్యప్ప ఆలయములు సేవా సమాజములు యేర్పడుచున్నవి

ఇలాంటి వానిలో ముఖ్యమైనది మన తెనుగుదేశము లోని తుమ్మగుంట అయ్యప్ప క్షేత్రము

పూర్వ చరిత్ర

షుమారు400 సం క్రితము విజయనగర సామ్రాజ్యాధీశులు శ్రీకృష్ణ దేవరాయల కాలములో కేరళ ప్రాంతము నుండి కొందరు ద్రావిడ బ్రాహ్మణ కుటుంబములకు చెందిన వేదపండితులు రాజాశ్రయమునకు తెనుగునాట వలస వచ్చిరి వారి విద్యా ప్రాభవమునకు మెచ్చి నిర్మించిన అగ్రహారమే తుమ్మగుంట అందు నివాస మేర్పరచుకొనిన వేద కుటుంబముల వారి ఆరాధ్య దైవము స్వామి అయ్యప్ప అందువల్ల ఆ గ్రామ నిర్మాణ కాలముననే గ్రామ మధ్యలో ఆలయ మేర్పరచి సన్నిదానములో ద్రవిడ సాంప్రదాయానుసారం ఒక జువ్వి వృక్షమును ప్రతిష్ఠించి అందు ఆగమ శాస్త్రానుసారం, బీజాక్షర సహితముగా అయ్యప్పను అవాహనము చేసి, యంత్ర ప్రతిష్ఠ చేసి నియమ నిష్ఠలతో ఉపాసనా బలముతో పూజింప సాగిరి వారి తపో శక్తి జప బలముతో ఆ ఆలయము యెన్నో మహిమలతో దినదినాభివృద్ధి నంది ఆ గ్రామము, అందలి జనులు సర్వతో ముఖాభివృద్ధి గాంచుటయే గాక కుల మత బేదము లేకుండా యెంతో అన్యోన్యంగా జీవింప సాగిరి యిలా గ్రామ మభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధికి నిత్య పూజా నివేదనలకు యితర వేడుకలకు నిర్వహణకు కావలసిన మాన్యములు వసతులు యేర్పడినవి యిలా నిర్మింపబడిన ఈ తుమ్మగుంట అయ్యప్ప ఆలయము మన ఆంధ్రదేశములో తొలిసారిగా యేర్పడిన అయ్యప్ప ఆలయమే గాక భారతదేశములోని పురాతన మహిమాన్విత అయ్యప్ప ఆలయములలో ప్రముఖ మైనదిగా కీర్తి పొందుచున్నది

మకరజ్యోతి ఉత్సవము

ప్రతి సంవత్సరము జనవరి 14న మకర సంక్రాంతి శుభ ఘడియలలో శబరిమలలో జ్యోతి దర్శనము చేసికొను శుబ ముహూర్తములో తుమ్మగుంట అయ్యప్ప సన్నిధానములో ఈ ఉత్సవము జరుగును ఈ సందర్భముగా భక్తులు ఆలయ ప్రాంగణ మంతయు దీపారాధనలు చేయుదురు పిమ్మట సన్నిధానములో జ్యోతి దర్శనము కాగానే బక్తుల శరణు ఘోషతో ప్రాంగణము మారుమ్రోగి కర్పూర కాంతులతో ప్రకాశించును

అన్ని రంగములలో ప్రాముఖ్యత సంతరించు కొన్న ఈ ఆలయ నిర్వహణ కొన్ని దశాబ్దములుగా ప్రభుత్వ యండో మెంటు బోర్డు వారి అజ్మాయిషిలో యేర్పరచ బడిన ట్రస్టు బోర్డు నిర్వహించు చున్నారు

హరి, హరుల ఆలయముల మధ్య అయ్యప్ప ఆలయముండుట గొప్ప విశేషము నెల్లూరు నుండి రామ తీర్థం బస్సులో 20 కి మీటర్లు వెళ్ళిన తుమ్మలగుంట క్షేత్రము వచ్చును ఇన్ని ప్రాముఖ్యతలు గలిగిన ఈ తుమ్మగుంట అయ్యప్ప క్షేత్రమును ప్రతివారు దర్శించి కృతార్థులు కాగలరని ఆశిస్తున్నాను

—బి పట్టాబిరామయ్య

యువతా! కవితా!!

నేటి పరి(దు)స్థితి

ఒక్కడు శాంతిమంత్రం పఠిస్తే
దౌర్జన్యానికి ఓటేస్తున్నారు వందమంది
వందమంది మంచి పనికి పూనుకుంటే
వెయ్యిమంది దుర్మార్గానికి
పాల్పడుతున్నారు!
మానభంగాలకు- మారణహోమాలకు
వెయ్యిమంది నీళ్ళు వదిలితే
ఏ ఒక జాగృత గీతం పలికితే
అభినవ వైతాళికులు లక్షలమంది!

- కలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం

జీవన కావ్యం

కావ్యం-
అక్షరాల సంకలనం!
జీవితం-
అనుభవాల సంయమనం!
అనుభవాల అక్షరాలను
అక్షర లక్షలుగా ప్రోది చేసుకుంటూ
మున్ముందుకు సాగేది-
జీవన కావ్యం!!

- గొంటు శ్రీనివాస్

ప్రేమశిక్ష!

నేనో లాయర్నో,
జడ్జినో
అయ్యుంటే
వేసేవాణ్ణి నీకు
శిక్ష!
నా హృదయాన్ని దోచుకొని,
నీ సౌందర్యంతో
నన్ను మత్తెక్కిస్తున్నావనే
అభియోగానికి!!

- భాస్కరభట్ల రవికుమార్



కలల రాణి

నీవు... అవును
నా కనులు మూసేంది నీవైతే
నీ పెదవులు పలుకవు.
నా మదిలో కదిలేది నీవేనంటే
నీ కనులు రెప్పవేయదు.
నను విడిచి వెళ్ళాలంటే
నీ పాదాలు కదలవు.
నీవు... నా స్వప్న జగత్తులో
మెరిసే తారవు!
కనులు తెరిస్తే కనబడవు..
కనులు మూస్తే తెరవడదు!

- బాలాజీ

ప్రగతి

మానవత్వం లేని
మనిషిగా జీవించటం కన్నా
అడవిలో
మానుగా పుడితేనన్నా
నీ పవనాలతో
అంబరం సంబరం
జరుపుకుని,
ధరిత్రికి
చిరునవ్వుల జల్లులు ఇస్తుంది
జగతి పులకిస్తుంది
ప్రగతి వెల్లి విరిస్తుంది!

కుంతల

బాబోయ్!
బాబోయ్!

నడి రోడ్డులో హత్యలు
మూరుమూలల్లో శిశు హత్యలు
ప్రతి రోజు జరిగే మానభంగాలు
చూడలేను బాబోయ్! చూడలేను
బాబోయ్!
వరకట్నపు చావులు
లాకప్‌లో మరణాలు
వ్యాపారుల దోపిడీలు
సహించలేను బాబోయ్! సహించలేను
బాబోయ్!
అన్యాయపు సాక్ష్యాలు
రాజకీయపు వాగ్దానాలు
నిరుద్యోగపు నినాదాలు
వినలేను బాబోయ్! వినలేను బాబోయ్!
బోఫోర్స్ స్వీడన్ చచ్చు తుపాకీలు
ఫెయిర్ ఫాక్స్ విదేశీ దొంగ ఖాతాలు
అడుగడుగున కుంభకోణాలు
చదవలేను బాబోయ్! చదవలేను
బాబోయ్!
కాశ్మీరులో సరిహద్దు తగాదాలు
పంజాబ్‌లో ఉగ్రవాద చర్యలు
ఆంధ్రాలో నక్సలైట్ల కిడ్నాప్‌లు
ఉండలేను బాబోయ్! ఉండలేను బాబోయ్
రామజన్మభూమి, బాబ్రీమసీదు వివాదాలు
హిందూ, ముస్లింల మధ్య విభేదాలు
మతానికి, మనుషులకి మధ్య ఆ
ఆ రాజకీయాలు
జీవించలేను బాబోయ్! జీవించలేను
బాబోయ్!

- మల్లి శంకర్

నవ్వు

ఒక నవ్వు
హృదయతంత్రులను మీటి
మధుర రాగాలు
ప్రభవిస్తుంది!
ఒక నవ్వు
హృదయ తంత్రులను త్రెంచి
విషాద గీతాలు
పలికిస్తుంది!

పురిజాల సుధాకర్

సీరియల్

సాగరమథనం

అడివి సూర్యకుమారి

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ-22: శ్రీలంక ట్రింకోమలిలో నెలకొల్పిన సేవాగ్రాంలో జయసూర్య డాక్టర్‌గా చేరతాడు. సాగర్ ఆచూకీ కోసం పోలీసులు సేవాగ్రాంకి వస్తారు. డచ్చిపోర్టులోని కోటలోకి ప్రవేశించిన సాగర్‌ను సింహళ ఈలం సభ్యులు చుట్టుముడతారు కాని సాగర్ తప్పించుకొని వాళ్ల నుండి సమాచారం రాబడతాడు. ఆ సమాచారం అందించిన వారిని కాల్చివేయమని స్థితబోధి ఆదేశిస్తాడు. కొంతమంది రౌడీలు శక్తిని, సేవాగ్రాంలోని వారిని ఎత్తుకు వెళ్లినట్లు తీఖూ- సాగర్‌కి తెలియజేస్తాడు. శక్తి చాకచక్యంతో మహావీరదూత ఎస్టేట్ అంతా ధ్వంసం చేస్తుంది. ఎస్టేట్‌లోకి ప్రవేశించిన సాగర్‌ని లొంగిపొమ్మంటాడు.

మీరు భారత్‌ని వదలి ఇతర దేశాల్ని సాయం అర్థించడం- భారత్‌కిది చిన్నతనంగా అన్పించింది- సార్క్ సమావేశాల కన్వీనర్‌గా ఉన్న ,, దేశాన్ని మీరు నిర్లక్ష్యం చెయడం బాగా లేదు అయ్నప్పటికీ భారత్ మీ శ్రేయోభిలాషి నా ప్రియ మిత్రుడికి నేనెవరో చెబుతానని చెప్పాను నేను భారతీయుణ్ని ఐ పి.కె.ఎఫ్. వెళ్లాక ఇక్కడి పరిస్థితుల్ని ఓ కొలిక్కి తెచ్చి శాంతి నెలకొల్పేందుకై ప్రత్యేకంగా నియమింపబడ్డ మిలిటరీ ఇంటిలిజెన్స్ అధికారిని, నాకు సహాయంగా డాక్టర్ జయసూర్య, శ్రవణ్, శక్తి ఇక్కడికొచ్చారు'' అన్నాడు సాగర్

పరంజ్యోతి తన పక్కనే కూర్చున్న జయసూర్యని ఆశ్చర్యంగా చూశాడు జయసూర్య కర్నల్ భుజం స్నేహ పూర్వకంగా తట్టాడు.

సాగర్ చెబుతున్న చివరి మాటలు వింటూన్న సభలోని వారంతా అవాక్కయ్యారు వాళ్ళు తేరుకోవటానికి రెండు నిమిషాలు పట్టింది

''ఎని హౌ మీ అందరిని ఒక చోటికి సమావేశపరచగలిగాను. మీ మీ అభిప్రాయాలు ఒకరి నొకరు తెలుసుకొనేందుకు, ఒక చోట కూర్చుని ముఖాముఖి తెల్సుకొనేందుకు, చర్చించుకొనేందుకు ఇప్పుడు ఎలాంటి అడ్డంకులు లేవు మీరంతా ఒక్కటి, మీరంతా ఇలా కలిసి మీ దేశ భవిష్యత్‌కై కృషి చేస్తారని ఆశిస్తాను' అన్నాడు సాగర్.

సభంతా చప్పట్లతో తమ హర్షాన్ని ఆనందాన్ని తెలియజేసింది. కొందరింకా విస్మయం నుండి కోలుకోలేదు.

స్థితబోధి లేచి సాగర్‌కి షేక్‌హాండ్ ఇచ్చి అతని భుజం చుట్టూ స్నేహితంగా చేయి వేసి తన పక్కనే కూర్చోబెట్టుకొన్నాడు.

చీఫ్ సెక్రటరీ లేచి మైక్ ముందు నిలబడి ''భారత ప్రభుత్వం చేసిన ఈ సహాయాన్ని శ్రీలంక ఉన్నంత కాలం మరిచిపోదు. అలాగే వారి ఇంటిలిజెన్స్ అధికారి సాగర్‌ని కూడా ఈ రోజు మధ్యాహ్నం ప్రధానమంత్రి రాష్ట్రపతిని కలిసి ఈ మారిన పరిస్థితుల దృష్ట్యా వారి నిర్ణయాన్ని ఈ రోజు సాయంకాలం మీ అందరికి తెలియజేస్తాము మీరి కోర్కెలను ప్రభుత్వం తప్పక అంగీకరిస్తుందన్న గట్టి నమ్మకంతో ఉన్నాను భవిష్యత్‌లో మన మీద విదేశీయుల నీడ పడకుండా మనమంతా కలిసి కట్టుగా కృషి చేద్దాం కలిసి బ్రతుకుదాం. ప్రభుత్వ నిర్ణయం సాయంకాలానికల్లా తెలియజేస్తాం అందాకా మీరు మా అతిథులుగా ఇక్కడే ఉండమని కోరుతున్నాను' అన్నాడు చీఫ్ సెక్రటరీ

దయాస్ మీదున్న వారంతా సాగర్‌కి షేక్‌హాండ్ ఇచ్చారు సాగర్ ముఖ్యులైన పరంజ్యోతి, సమరసింగె, మేఘవర్ణలని ప్రభుత్వాధికార్లకి పరిచయం చేశాడు వారంతా స్నేహ భావాలతో కరచాలనం



చేశారు. వారు వెళ్ళిపోయారు.

సాయంకాలం దాకా సాగర్ సిలన్ స్ప్రింగ్, పి. వి పి. మితవాద, అతివాద నాయకులతో, స్టూడెంట్ లీడర్స్‌తో చర్చించాడు.

సరిగ్గా నాలుగ్గంటలకి–

ఉదయం వచ్చిన నలుగురితో పాటు శ్రీలంక ఆర్మీ జనరల్ ప్రధాని క్యాబినెట్ సెక్రటరీ వచ్చారు. వస్తూనే వారంతా సాగర్ దగ్గరికొచ్చారు. స్థితబోధి సాగర్‌కి అందరిని పరిచయం చేశాక సాగర్‌ని దయాస్ దగ్గరికి తీసికెళ్లారు ప్రధానమంత్రి క్యాబినెట్ సెక్రటరీ ముందుగా లేచి ప్రధాని ప్రసంగ పాఠాన్ని ఇలా చదివాడు క్లుప్తంగా. "శ్రీలంకలో శాంతికి శ్రీకారం చుట్టిన పెద్దలందరికి నమస్కారములు ఎంతో కాలంగా శ్రీలంకలోని సమస్యకి ఓ రాజకీయ పరిష్కారం తేవాలని మేము వాంఛించాము. ఆ ప్రయత్నంలోని భాగంగానే ఐ. పి. కె. ఎఫ్. శ్రీలంక రావడం. మీ అందరికి ఇప్పటికే అర్థమైన కొన్ని కారణాల వల్ల పూర్తి శాంతిని పొందకుండానే ఐ. పి కె. ఎఫ్‌ని భారతదేశానికి పంపడం జరిగింది. అయినాసరే భారతదేశం మనమీదున్న అభిమానంతో ఈ సమస్యను నేర్పుతో ఓర్పుతో పరిష్కరించగలిగింది. ఇందుకు వారి మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు శ్రీ సాగర్, శక్తి, జయసూర్య, శ్రవణ్‌లకు ప్రత్యేకంగా మా శ్రీలంక ప్రజలు, రాష్ట్రపతి, నేను ధన్యవాదాలు తెల్పుకుంటున్నాం. మా సోదరులు తమిళులు కోరినట్లే శ్రీలంక తూర్పు ఉత్తర ప్రాంతాలను వికేంద్రీకరించి, తమిళ భాషను అధికార భాషగా, తమిళాన్ని మాధ్యమంగా నేర్చుకోవడానికి పూర్తి అధికారాలిస్తున్నాం. ఇందుకు సంబంధించిన గెజెట్ నోటిఫికేషన్ వెంటనే జారీ అవుతుంది అంతేగాక ఇంతవరకు జైళ్లలో మగ్గుతున్న వేలాదిమంది తమిళ శ్రీలంక సోదరులను వదిలి వెయవలసిందిగా డి జి పి కి ఇంతకు ముందే ఉత్తర్వులు జారీ అయ్యాయి అంతేగాక ఓ ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఎమర్జన్సీ ఎత్తివేయడం, ఎన్నికల నిర్వహణ కూడా జరుగుతుంది తమిళులు జాతీయ జీవన స్రవంతిలో కలిసిపోయి శ్రీలంక అభ్యున్నతికి తమ వంతు పాలుపంచుకోవాలి ఈ ఐదారేళ్లలో ట్రింకోమాలి ప్రాంతానికి వలస వచ్చి స్థిరపడ్డ వారిక్కూడా ఓటు హక్కు ఉండగలదు సింహళులు, తమిళులు అన్న విషయాన్ని మరిచిపోయి మనమంతా శ్రీలంక జాతీయులం అన్న ఉద్దేశంతో ముందుకు సాగాలి ఎంతో క్రమశిక్షణతో ఈ గ్రూపులన్నీ కూడా నిర్మాణాత్మకమైన కృషి చేసి సమస్యల పరిష్కారానికి స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా మీరు ముందుకు రావడానికి శ్రీలంక ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది"

పూర్తికాగానే అంతా తమ అంగీకారాన్ని తెలుపుతూ చప్పట్లు చరిచారు

కోటు జేబులో నుండి ఒక కవరు తీసి



సాగర్‌కిస్తూ -

"ఇది మా రాష్ట్రపతి సందేశం. మీరు చేసిన సేవ, సహకారానికి ధన్యవాదాలు చెబుతూ మా రాష్ట్రపతి మీ రాష్ట్రపతి కివ్వమన్నారు' అన్నాడు క్యాబినెట్ సెక్రటరీ-

సాగర్ దాన్నందుకుని కోటు జేబులో పెట్టుకున్నాడు. తన కోరికను మన్నించి వచ్చిన నాయకులకు, ప్రభుత్వాధికారులకు కృతజ్ఞతలు చెప్పి, "నేను రేపు మా దేశం వెళ్ళిపోతున్నాను" అన్నాడు సాగర్

మిలిటరీ జనరల్ సాగర్‌ని, శక్తిని, జయసూర్య, శ్రవణ్‌లని ఆ రోజు రాత్రి ప్రభుత్వ అతిథి గృహంలో ఉండటానికి అన్ని ఏర్పాట్లు చేశామని, తమ అతిథిగా వుండి, తమకు సంతోషం కలిగించాల్సిందిగా కోరాడు.


ఆ రాత్రి వారికి అతిథులుగా ఉన్నారు నల్గురు

మర్నాడు -

ఉదయం ఏడు గంటలకి

శ్రీలంక ఎయిర్‌లైన్స్ విమానం సిద్ధంగా వుంది ఇరుదేశాల దౌత్యాధికారులు, పోలీసు మిలిటరీ, సివిల్ అధికారులు- అనేక వందలమంది స్కూలు, కాలేజీ విద్యార్థులు, సమరసింగె, పరంజ్యోతి, మేఘవర్ణ లాంటి నాయకులతో కిక్కిరిసి వుంది ఎయిర్‌పోర్టు.

ప్రభుత్వ వాహనంలోంచి శక్తి దిగగానే సేవాగ్రాం పిల్లా, పెద్దా అంతా ఆమెను చుట్టు ముట్టారు. తమను విడిచిపెట్టి వెళ్ళొద్దని పెద్దగా ఏడ్చారు శక్తి వారందరిని సముదాయించి సమాధాన



వీర పిసినారి

వీరయ్య యమపిసినారి. ఒకరోజు అతను బ్రెయిల్ లిపిని అభ్యాసం చేయడం చూసి ఓ మిత్రుడడిగాడు:

"ఏమిటీ! నువ్వు గుడ్డివాడవుతావని ఏ జోస్యుడైనా చెప్పాడా- ఈ బ్రెయిల్ లిపిని ప్రాక్టీస్ చేస్తున్నావ్?" అని అడిగాడు.

"కరెంట్ ఖర్చు తగ్గించుకోడానికి ఈ అవస్థ!" అన్నాడు వీరయ్య.

-జి. వి. జి.

సాగరమథనం

పరిచింది. వారు కోరుకొన్నపుడు తాను రాగలనని తెలిపింది. ప్రక్కనే వున్న క్యాబినెట్ సెక్రటరీని చూసి "ప్రస్తుతం ఉన్న సేవాగ్రాంని ప్రభుత్వం ఎడాప్ట్ చేసుకొని ఈ అనాథపిల్లలకి ఎటువంటి లోటు రాకుండా పునరావాసాన్ని ఏర్పాటు చేయండి. అంతేగాదు. అప్పుడప్పుడు నేను వీరి దగ్గరికి రావడానికి డిప్లమాటిక్ పాస్ కూడా ఇస్తే బాగుంటుంది' అంది నవ్వుతూ.

"తప్పకుండా. వీళ్ళ పునరావాస ఏర్పాట్లు పరంజ్యోతి కప్పగించి కావలసిన ఫండ్స్ నేను రిలీజ్ చేయిస్తాను. మరో వారం రోజుల్లో మీకు శ్రీలంక డిప్లమాటిక్ పాస్ పంపటానికి తగు ఏర్పాట్లు చేస్తాను. మీ సహాయానికెంతో కృతజ్ఞులం" అన్నాడు క్యాబినెట్ సెక్రటరీ

చంద్రి కాత్యాల వైపు తిరిగి "ఇక నుండి నేనులేని లోటు ఈ పిల్లలకి మీరు తీర్చాలి" అందామె వాళ్ళని ధైర్యంగా ఉండాలని చెప్పింది

నల్గురు విమానం వైపు నడిచారు భారంగా

పిల్లలంతా శ్రీలంక భారత దేశాల జెండాలు పుచ్చుకొని 'భారత్ శ్రీలంకల మైత్రి వర్ధిల్లాలి' అని కేకలు వేస్తున్నారు. ఇరు దేశాల జాతీయ గీతాలు పాడబడుతున్నాయి. కొద్ది నిముషాలు సాగర్ వాళ్ళు ఆ రెండు జాతీయ గీతాలు పూర్తయేదాకా గౌరవపూర్వకంగా నిలబడ్డారు. అందరూ కన్నీటితో వీడ్కోలిచ్చారు.

ఆ తర్వాత కొద్ది నిముషాల్లోనే విమానం శ్రీలంక భూభాగాన్ని వదిలి ఇండియా వైపు బైలుదేరింది.

సముద్రం మీద వెళ్తున్న ఆ విమానం దూరంగా వెళ్తున్న కొద్ది భారతదేశపు శాంతి పావురంలా కన్పించింది.

(అయిపోయింది)

అమ్మ మా(బా)ట

“కొత్త కాపురం! అమ్మాయికేమీ చేతగాదు! నాల్రోజుల్లో అన్నీ సెటిల్ చేసి మరీ వస్తాను.”

బట్టలవీ సర్దుకుంటూ అంది సుశీల తల్లి సీతమ్మతో.

“అక్కడి వాతావరణం అమ్మాయికి కొత్త. పిల్ల కాస్త బెంగపడకుండా నాల్రోజులు కాకుంటే మరో నాల్రోజు లుండిరా!” మనవరాలి తల నిమురుతూ అంది సీతమ్మ.

“అమ్మమ్మా...”

“ఏమమ్మా ?”

“నాతోపాటు నువ్వు రావే!”

“నాకేం చేతనవును కీళ్లనొప్పులూ, కాళ్లతీపులూను.... మీ అమ్మ అయితేనే చకచకా అన్నీ చక్కబెడుతుంది!”

“ఊహూ... అమ్మ నాతో రావద్దు.”

దెబ్బతిన్నట్లుగా వులికిపడింది సుశీల. దబ్బుమన్న శబ్దంతో సూట్ కేస్ మూత పడిం దప్రయత్నంగా. తలెత్తి కూతురివేపు చూసింది.

చూపులు పక్కకి తిప్పుకొంది శోభ.

“అదేంటే శోభా! ఇన్ని పనులొదులు కొని ఎంతో ఇదిగా అమ్మే స్వయంగా నీతో వస్తుంటే కాదంటావేమే పిచ్చిపిల్లా?”

“నీకిష్టం లేకుంటే పోన్లే అమ్మమ్మా. నేనొక్కర్తినే వెళ్తాను నాతో ఎవరూ రానక్కరలేదు !”

విసవిసా అక్కణ్ణించి వెళ్లిపోయింది శోభ.

అలాగే అచేతనంగా వుండిపోయింది కాసేపు సుశీల. ఆ తర్వాత సూట్ కేస్ మూతతెరిచి తన బట్టలు పక్కనుంచి, తల్లి బట్టలందులో ఉంచేసింది.

“దానిష్టం అలాగే కానీ అమ్మా! అమ్మకన్నా అమ్మమ్మ దగ్గిరే అతిగారాబం! శోభ సంతోషం కంటే నాక్కావలసిందే ముంది?”

తేలిగ్గా నవ్వేసింది సుశీల. గబగబా కూతురి కొత్తకాపురానికన్నీ సర్దేసింది.

“శోభా.. .., రవికి టిఫిన్ పెట్టమ్మా! ఈలోగా నే కాఫీ రెడీచేస్తాను!”

ప్లేటు శోభ చేతికందించబోయింది సుశీల

“ఊహూ... నేనెందుకివ్వాలి? నువ్వో, అమ్మమ్మో ఇవ్వొచ్చుగా?”

“శోభా.... ఏమిటా అర్థంలేని మాటలు? నీ భర్తకు నువ్వు పెట్టడంలో తప్పేముంది?”

మందలించింది సీతమ్మ.

మారు మాట్లాడక గబగబా అక్కణ్ణించి వెళ్లిపోయింది శోభ.

ఆపై... మరి కాసేపట్లోనే ఆ గదిలోంచి, తనకు మాత్రం వినిపించేంత స్థాయిలో భర్తతో మాట్లాడే శోభ గొంతు వినిపించింది సుశీలకు.

“కొత్త రూలే పెట్టిందో, కొత్త రోలే పోషిస్తుందో అమ్మ! ఆవిడ బిహేవియర్ నాకేం అర్థం కావట్లేదు.”

బాధగా కళ్లొత్తుకుంది సుశీల. పోన్లే చిన్నపిల్ల అని సరిపెట్టుకుంది మళ్లీ.

ప్రేమించిన రవీంద్రతోనే పెళ్లయిన శోభ ఉత్సాహంగానే భర్తతో ప్రయాణమయ్యింది. కూడా అమ్మమ్మ ఉండటంతో మరే చింతా లేకపోయింది

అమ్మమ్మ మాటతో అమ్మ కాళ్లకు దండంపెడుతున్న కూతుర్నక్కున జేర్చుకుంది సుశీల.

అంతదాకా అంతబాధా అణుచుకుంటూ, కావేర కుసుమాలైన సుశీల కళ్లల్లోంచి జలజలా కావేరీ జలాలు జాలువారాయి శోభ తలపై శోభనాక్షతలుగా.

“పతికనుకూలవతివై, ప్రేమపాత్రురాలివై, మాతృమూర్తివై చల్లగా వర్ధిల్లమ్మా!”

మనసారా కూతుర్ని ఆశీర్వదించిందామె.

ఆ రెస్పాన్స్ మాత్రం శోభ కళ్లల్లో కనిపించక కాస్త కలవరపడిందా కన్నతల్లి హృదయం. అయినా అంతలోనే సరిపెట్టుకుందామె కన్నతల్లి గనుకే! కావల్సింది బిడ్డ శ్రేయస్సు గనుకే!

* * * *

“రవీంద్ర చాలా మంచివాడు. చిలకా గోరింకల్లా మీ సంసారం చూడముచ్చటగా వుందమ్మా! మీ అన్యోన్యత చూస్తే మీ అమ్మ ఎంత ముచ్చటపడుతుందో? ఒక్క ఉత్తరం ముక్కైనా వ్రాయలేదమ్మా అమ్మకు? వెంటనే వ్రాసెయ్ మరి...!”

“తొందరేం లేదులే అమ్మమ్మా!”

“అమ్మకుత్తరం వ్రాయటానికి ఆదుర్దా ఉండాలి కాని, అనాసక్తత ఎందుకే? ఆమె , నీకోసం అంత ఆరాటపడుతుంటే నువ్వేమో చిరాకు పడుతున్నావ్...”

జవాబివ్వలేదు శోభ.

“ఇంతకీ శోభా...” అంటూ ఏదో అడగబోయిన సీతమ్మ పక్కింటావిడ రాకతో మాట మార్చేసింది.

“మేం గుడికెళ్తున్నాం. ఈలోగా అమ్మకి లెటరు వ్రాసి పోస్టుచేసెయ్ శోభా. ... మర్చిపోకు!” అంటూ బయల్దేరింది సీతమ్మ.

“అమ్మమ్మ కోసమైనా వ్రాయాలి తప్పదు !” అనుకుంటూ కాగితం, కలం అందుకుంది.

“అమ్మకి ..” అంటూ ప్రారంభించేంతలోనే అంతరంగింలో అంతులేని ఆవేశం..... ఉక్రోషం!

“హు.. అమ్మ! కన్నకూతురి సరదాలూ, కోరికలూ, కలలూ, నిలువునా సమాధిచేసే తల్లీ ఓ తల్లేనా? బిడ్డ ఆనందాన్ని చూడలేని అమ్మ ఓ అమ్మేనా?”

ఆమె పెదవులు కంపించాయి.

ఆమె చేసిన పనులన్నీ ఒక్కొక్కటిగా జ్ఞాపకం వస్తూంటే మనసు చేదు తిన్నట్లుగా అయిపోతుంది. అమ్మంటే కలిగే ఆ స్పందన స్తబ్దమవుతూంది తనలో. అవును! తనకూ, రవీంద్రకూ మధ్య అడ్డుగోడలా నిలిచిన అమ్మను తను క్షమించలేదు గాక క్షమించలేదు.

రెండు పళ్లమధ్య కింది పెదవి నలిగిపోయింది.

రవీంద్రతో తనపెళ్లిమధ్యే జరిగిపోయినా మానసికంగా ఏనాడో జరిగిపోయింది. తను ఎస్సెస్సీలో, అతను ఇంటర్‌లో ఉన్నప్పుడే! తన తండ్రికి జబ్బుచేసినప్పుడు, సంపాదనేమీ లేదని తన పెళ్లి గురించి బెంగపడినప్పుడు.. ఆయన క్లోజ్


కె. వీణారెడ్డి

ఫ్రెండ్, తమ ఎదురింట్లో వుండే రంగా రావుగారు నాన్నకు మాటిచ్చారు.... కాసీ కట్నం లేకుండా తన కొడుకు రవీంద్రకు తన్ను చేసుకుంటానని. రవికీ తనకూ ఒకరంటే ఒకరికెంతో ఇష్టం. డిగ్రీ పూర్తయ్యాకే పెళ్లని పెద్దలనుకున్నారు. రెండు కుటుంబాల మధ్య అనుబంధం బలపడిందింకా! నాన్నగారున్నంతవరకూ ఏ ప్రాబ్లమూ లేదు. కాని ఆయన పోయాకే, అంతా అప్మదే పెత్తనమయ్యాకే మొదలైంది కక్కాలేక, మింగాలేక అన్నట్టి బాధ తనకు.

తనకోసం రవి ఎప్పుడింటికొచ్చినా ఏదో సాకు చెప్పి పంపేది .. లేదూ.. తనే బాతాఖానీ వేసుకొనేది! టీ. కాఫీ... చివరికి మంచినీళ్లు కూడా తనే ఇచ్చేది.

ఎంతో ఉత్సాహంగా రవీంద్ర వొచ్చి 'ఆంటీ శోభ లేదా?' అంటే లేదనేది. ఇంట్లోనే ఉన్న తనకంతా వినిపించేది. ఏడుపొచ్చేది.

"అమ్మా... రవి నేను సినిమాకు వెళ్తాం" అంటే ససేమిరా అనేది.... లేదా తనూ తయారయ్యేది. గాలితీసిన బెలూన్లా



అయ్యేది తన పని.

"ఆంటీకి నేనంటే ఇష్టం లేదా శోభా!" అనడిగే ఆస్కారం రవికెప్పుడూ రాలేదు. కారణం... రవి ముందు అన్నీ తానే అయి తిరిగేది అతడి ఇష్టా ఇష్టాలన్నీ తనే పట్టించుకొనేది ఎంతో ఆప్యాయత కురిపించేది.

"ఆంటీ.... శోభ లెక్కల్లో పూర్! మ్యాథ్స్‌లోని కొన్ని ట్రిక్స్ టీచ్ చేయాలి! క్లాసెస్ తీసుకోనా?" అని రవి అడిగితే వొప్పుకుంది. అమ్మయ్య అనుకొంది తను. కాని క్లాస్ జరుగుతున్నంతసేపూ ఎంచక్కా ఎదురుగానే కూర్చొనేది! తన ఉత్సాహమంతా హుష్‌కాకి అయ్యేది!

ఎగ్జామ్స్ ముందు కల్సి స్టడీ చేసుకుంటూ ఉంటే కాఫీలు, టీలు అందించేది గాని అస్తమానం తన ఉనికిని ప్రదర్శిస్తూ ఆ దరిదాపుల్లోనే మసులుతూ ఉండేది.



అమ్మ పొరపాటు

బయటెక్కడయినా కలుసుకుందామని అనుకున్నా సవాలక్ష ఆరాలతో, అమ్మ పెట్టే ఆటంకాలతో ప్రోగ్రాం అంతా అప్‌సెట్ అయిపోయేది.

ప్రేమించుకున్నవాళ్లం, పెళ్లిచేసుకోబోతున్నవాళ్లం కదా రవితో నన్ను తిరగనిచ్చేది కాదు. తగుదునమ్మా అంటూ అన్నిటికీ తనే రవీ... రవీ... అంటూ తయారయ్యేది. అనుకున్న ప్రతిదీ అమ్మ వల్ల అవరోధమై అంతులేని నిరాశతో అడుగడుగునా వుక్రోషం, బాధ పెనవేసుకునేవి తనలో.

అప్పట్నుండే అమ్మంటే ఒకలాంటి నిరాసక్తత, నిర్లిప్తత, తెలీని కోపం చోటు చేసుకున్నాయి. రవి చదువైపోయింది. ఉద్యోగం కూడా దొరికింది. తన పెళ్లి కూడా జరిగిపోయింది. అయినా అనాటి తమ సరదాల కన్నింటికీ పరదాలు వేసిన, కూతురి మనసు నడుగడుగునా నొప్పించిన అమ్మంటే తనకెలాంటి అనుభూతీ లేకుండా పోయింది. మనసు నిండా తెలీని వ్యతిరిక్తతే పేరుకుపోయింది.

శోభ చేతుల్లోని ఆ ఉత్తరం.... వ్రాయాల్సిన ఉత్తకాగితంగానే ఉండచుట్టబడి చెత్తకుండీలో పడిపోయింది.

* * * *

"ఓహో రాజేశ్వరత్తయ్యా! బాగున్నారా? బహునాళ్ల దర్శనం!"

అమ్మమ్మ పెళ్లినప్పట్నుండదోలా వున్న శోభకు ఆమె రాక రిలీఫ్‌గా అన్పించింది.

"మొన్న ఈ వూరొచ్చాను. మా ఫ్రెండ్ వాళ్లమ్మాయి పెళ్లికి. నువ్విక్కడే ఉన్నావని తెలిసింది. కలవకుండా ఎలా ఉంటాను?" అంటూ లోపలికొచ్చిందామె.

కాసేపు మాటా మంతీ సాగింది.

"అన్నట్లు అత్తయ్యా. . సంధ్య ఇంకా అండమాన్‌లోనే ఉందా? ఉత్తరాలవీ వ్రాస్తుందా? వెరీ ఇంట్రస్టింగ్ లేడీ! ఒక్కసారి పరిచయమైన వాళ్లు లైఫ్‌లాంగ్ మర్చిపోలేనంతటి కలుపుగోలు మనిషి. ఏమైనా కబుర్లుంటే చెప్పండి అండమాన్ అమ్మాయి గురించి! ఒక బాబని విన్నాం!"

రాజేశ్వరికి కాఫీ అందిస్తూ అడిగింది శోభ నవ్వుతూ.

శోభా... నువ్వన్నట్లు సంధ్య ఇంకా అండమాన్‌లోనే వుంది. దాని ఉద్యోగంపై అది బ్రతుకుతూంది.

"తనూ జాబ్ చేస్తుందన్నమాట. వెరీగుడ్! ఇద్దరి జీవితాల్లాగే ఇద్దరి జీతాలూ ఒకటైతే ఇంకేం? సాఫీగా సంసారయాత్ర సాగుతుంది."

"లేదమ్మా... జీతం ఒక్కదాందే! జీవితమూ ఒక్కదాందే"

"అదేంటత్తయ్యా... నీ అల్లుడు కూతురు కల్సి లేరా?"

"అసలు అల్లుడే లేకుంటే...."

"ఏదైనా యాక్సిడెంటా? పెళ్లయిన ఎన్నాళ్లకి?"

"పెళ్లిలేదు, అల్లుడూ లేడమ్మా...."

"అంటే సంధ్య ఇంకా కుమారిగానే..."

"ఔనమ్మా!"

"మరైతే అందరితోనూ మీరెందుకలా చెప్పారత్తయ్యా? ఆ ఇద్దరిదీ అనుకోకుండా జరిగిపోయిన ప్రేమ వివాహం! పెద్దల కిష్టం లేని విషయం గనుక పెళ్లైన మరుక్షణం అబ్బాయి అమ్మాయిని అండమాన్ తీసుకెళ్లాడు అని!"

"చెప్పాలంటే చాలా కథ ఉందమ్మా!"

"ఫర్వాలేదు చెప్పండత్తయ్యా! కోరినవాణ్ణి రిజిస్టర్ మ్యారేజి చేసుకొని, భర్తతో అండమాన్ వెళ్లిపోయిన సంధ్య హాయిగా, ఆనందంగా కాపురం చేసుకుంటుందనే అందరం అనుకుంటున్నాం! కాని... ఇలా... అసలేం జరిగింది?"

"సంధ్యంటే మాకెంతో గారాబం! ఏదడిగినా కాదనేవాళ్ళం కాదు మేము. ఫ్రీబర్డ్‌లా సరదాగా తిరిగే తత్వం దానిది. ఇంటర్‌లో ఉండగా ఒకబ్బాయిని ప్రేమించానంది. పెళ్లి చేసుకుంటాడంది. అతడితో ఫ్రీగా తిరిగేది సంధ్య. కాబోయే దంపతులేగా, కాదంటే బాధపడుతుంది సంధ్య అనుకుని మేమూ పెద్దగా పట్టించుకోలేదు. సంధ్యను తప్పక పెళ్లిచేసుకుంటానని, ఆమె లేందే తను బ్రతకలేనంటూ అబ్బాయికూడా మాటివ్వటంతో -"

"ఓహ్ మమ్మీ... ఫ్రెండింటికి వెళ్లిరావాలంటేనే ఛాందసులైన పేరెంట్స్ నుండి పర్మిషన్ దొరకదు మా ఫ్రెండ్స్ కొందరికి. అలాంటిది మీరు నన్నింతలా అర్థం చేసుకొని నా ఎంజాయ్‌మెంట్ కాటంకం కల్గించటం లేదంటే రియల్లీ యూ ఆర్ కల్చర్డ్ పర్సన్స్! ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ యూ!"

అంటున్న సంధ్యను చూస్తూ... "అందరిలా కాదు మేము, మా అమ్మాయిని కొందరిలా అబ్బాయిలాగే పెంచుతున్నాం" అనుకునేవాళ్లం!

"అంటే.... ఆపై...?"

"ఆపై.... అంటే... ఇంకేముందమ్మా? అందరబ్బాయిల్లాగే ఆ పిల్లాడు కూడా మాయ మాటల్తో సంధ్యను లోబర్చుకున్నాడు. తన కోరిక తీరగానే, చదువు పూర్తవగానే చెప్పా పెట్టక మాయమయ్యాడు. అతికష్టంమీద ఆ పిల్లాడి అడ్రసు కనుక్కొని తల్లిదండ్రుల్ని ప్రాధేయపడ్డాం! అయినా వాళ్లన్నదొక్కటే మాట... అంత ఫ్రీగా తిరిగి పెళ్లికాకుండానే తల్లి కాబోతున్న ఆమె కడుపులోని బిడ్డకు తండ్రి

"వాణీ! మనమిద్దరం ఇలా గుట్టుగా గుళ్ళో పెళ్ళి చేసుకున్న విషయాన్ని కొంత కాలం వరకు గోప్యంగా ఉంచాలి మూడో మనిషికి తెలియకూడదు," అన్నాడు ఆనంద్

"సరే. ఐతే, మనమిప్పుడు తిన్నగా సునీత ఇంటికి ఓ సారి వెళ్ళాలి," అంది వాణి.

"ఎందుకు?" గాభరాగా అడిగాడు ఆనంద్

"నిన్ను ఏ చవట చేసుకుంటాడే- అని సునీత చాలా సార్లు అనేది ఇప్పుడేమంటుందో చూద్దాం." అంది వాణి.

జి.వి.జి.



మా వాడొక్కడేనన్న గ్యారంటీ ఏముంది" అని!

"ఎంత దారుణం...?"

గుండెపై చేయి వేసుకుంది శోభ. ఆమె గుండె పొరల్లో మెల్లగా ఏదో కదలిక.

"ఆ తప్పంతా సంధ్యది కాదు... ఆ అబ్బాయిదీ కాదు.... వాళ్ల పెద్దవాళ్లదీ కాదమ్మా శోభా..."

బాధగా ఎటో చూస్తూ అంది రాజేశ్వరి.

"అంటే అంటీ...."

"ఆ తప్పంతా మాదే!"

"మీదా..?"

"అవునమ్మా.... తెలిసీ తెలీని వయసులో, వయోసహజమైన ఆకర్షణలో, అవగాహన లోపించిన, లోకమే రంగుల వలయంగా మోహించిన, కలల మయంగా ఊహించిన ఆ స్టేజిలో... స్వేచ్ఛ పేరుతో ఆడపిల్ల అదుపు తప్పకుండా, అనుభవజ్ఞులైన పెద్దల హద్దు ఆదిలోనే వుండాలని మర్చిపోయిన మూర్ఖులం మేము. అడుగడుగునా ఆ వయసులోని అమ్మాయిల గురించి పట్టించుకొని వారి భద్రతకై పాటుపడాలన్న ఇంగితం కోల్పోయినవాళ్లం తల్లీ! మా గుడ్డి నమ్మికకూ, మా నిర్లక్ష్యానికీ మా బిడ్డ బ్రతుకు మోడువారిందమ్మా!"

దుఃఖంతో నిండిందామె స్వరం.

"అంటే ఇప్పుడు సంధ్య...?"

"మా చెల్లెలు ఫ్యామిలీ అండమాన్‌లో ఉంది. సంధ్య నక్కడికే పంపించాము. అబార్షన్‌కు ఒప్పుకోలేదు. ఓ చిన్నపాటి జాబ్ చేసుకుంటూ తండ్రి లేని బిడ్డకు తల్లిగా బ్రతుకీడుస్తుందమ్మా! నిన్నటి నిరాశే నిండిన బిడ్డ కళ్లల్లో రేపటి ఆశ ఏముందో ఆ దేవుడి కెరుక! ఇది లోకానికి తెలీని సంధ్య గురించిన చేదునిజం శోభా!"

కళ్లొత్తుకుంది రాజేశ్వరి.

"హాయిగా, ఆనందంగా వుందనుకొన్న సంధ్య జీవితంలో ఇంతటి విషాదం దాగుందా?"

"ఆ విషాదమనే విషం దానిచేత తాగించింది మా చేతులేనమ్మా! అది లోనే దాన్నదుపులో వుంచి పెంచగల్గితే ఇలా జరిగుండేది కాదు. ఇదంతా స్వయంకృతాపరాధం! కాదంటావా శోభా?"

జవాబివ్వలేదు శోభ.

"పాలూ నీళ్లూ తెలీని, మోసం దగా గ్రహించలేని, పైపై మెరుగులకే పైపైకి ఎగిసి గాల్లో తేలిపోయే ఆ వయస్సు ప్రభావం అదని, దాని పర్యవసానమెలాంటిదో ముందే గ్రహించి ముందు జాగ్రత్త వహించాల్సిన మా బాధ్యత విస్మరించాము. తేనె పూసిన కత్తిలాంటి ఆ వయసు మాయలో పడి, ఆడా మగా ఆకర్షణకు లోబడుతుంది యువతరం! ఆ సాన్నిధ్యంలో ప్రకృతిపరమైన వయసు తొందరకు గురైన, క్షణికావేశాలు అతి సహజాలు! కానీ... ఆపై.... అవకాశవాదియైన అబ్బాయి తప్పుకుంటాడు. పెళ్లి పేరుతో మోసపోయిన అమ్మాయి మాత్రం పేగు తెంచుకొని బిడ్డకు జన్మనివ్వాల్సుంటుంది!"

బాధగా కేసేపలాగే వుండిపోయింది రాజేశ్వరి.

"శోభా... నేనోమాటడుగుతాను నిజం చెబుతావా?"

తలూపింది శోభ.

"షుగర్‌కోటెడ్ బిళ్లల్లాంటి ఆ స్వేచ్ఛా సరదాల్ని అదుపులో ఉంచుతూ, అయిష్టమైనా సరే రోగానికి మందులాంటి చేదు మాత్రలవంటి వాస్తవదృక్కుల్తో చెలియలికట్టలాంటి సున్నితమైన అవధులేర్పరచి వయసు అల్లరులక్కాస్త గిరిగీసి బిడ్డల్ని కాపాడుకోవాలనే జ్ఞానం లేకపోయిన మేము నిజమైన కన్నవాళ్లం కాదంటే నువ్వేమంటావ్?"

దీనమైన ఆమె ముఖంలోకి చూసి చప్పున తలదించేసుకుంది శోభ.

"ఫర్వాలేదు శోభా... చెప్పు! తోటకూరకాడ నాడే అన్నట్లు అమ్మాయి నదుపులో ఉంచుకోగల్గింటే కన్నవాళ్ళమైన మాకీ గుండెకోత వుండేది కాదు! ఆ పొరపాటు మాదేకదా?"

శోభ అంతరంగంలో ఆలోచనా తరంగాలు.

"మరిచిపోయిన మా బాధ్యతలోని ఆ నాల్గునాళ్ల స్వేచ్ఛ నా బిడ్డకు శాశ్వతంగా నాల్గురాళ్ల ఛాటిగా అవుతుందని అనుకోలేదు. ఆ పాపం, ఆ శాపం అంతా మాదే కాదూ?"

శోభ కళ్లముందు ఏవేవో గతస్మృతులు లీలగా....

"పసి వయసులో బిడ్డ చాక్లెట్ కోసం మారాం చేయగా, ఓ. కే. చేయగా... మా అమ్మ మంచిది అనిపించుకుంటాము. కానీ యుక్త వయస్సులో మాత్రం 'మా అమ్మ చూపిన దారి మంచిది' అనుకునేలా చేయాలి !"

"నిజమే అంటీ.... లోకం తెలీని,

న్యాయ పతి రమేష్‌బాబు, హైదరాబాద్

ఇండియాలో డాక్టర్లపై నమ్మకం లేకనా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎం.పి.లు అమెరికాలో ఆపరేషన్లు చేయించుకుంటున్నారు?

* వసతి వుంది కనుక- వెడుతున్నారు. ఏ మాత్రం అవకాశం యిచ్చినా! దేశంలో చికిత్స లభ్యమయ్యే సందర్భాలలో -ఎవరూ పరాయిదేశం చికిత్స కోసం వెళ్ళకూడదని రూలింగిస్తారు- మనలాంటి సామాన్యులు అనవసరంగా విదేశీ మారకం వేస్టు చెయ్యకుండా!!

బి. రమేష్‌బాబు, ప్రత్తిపాడు

నేటి రోజుల్లో మంచివాళ్లకి ఎక్కువగా కష్టాలు వస్తున్నాయి కదా. ఎందువలన అంటారు?

ప్రశ్నావళి
కె. రామలక్ష్మి

* ఎందువల్లేమిటయ్యా బాబూ - మంచితనం ఓ మంచి గుణంటయ్యా! ఈ రోజుల్లో దేవుడు కూడా- మంచివాళ్లనే పరీక్షకు పెడతాడు- చెడ్డవాళ్లకు భయపడతాడు. అది లోకనీతి- అంతే.

డి. రామారావు, విజయవాడ

చాలా మంది డబ్బుతో సాధించలేనిదేమీ వుండదు అంటారు. దీన్లో సత్యం వుందా కె.రా. గారు.

* డబ్బుంటే సాధ్యంకానిదేం వుండదన్న అభిప్రాయం కలవాళ్లు. డబ్బు కోసం ఏదైనా చేస్తారన్న దానికి- ఆధారాలు!

అందరినీ తృప్తి పరచడం సాధ్యమేనంటారా?

* ఎందరినని కాదు ప్రశ్నించుకోడం- ఎవరినని అనేవాడు మా పెదమామయ్య. సంఖ్యకాదు ముఖ్యం.

○

వెండితెర-బుల్లితెర

అందాల నటి రేష్మా

చిత్ర సీమలో కలకాలం నిలువ గలుగుటకు, అర్ధనగ్నంగా నటించటం ప్రథమ సోపానంగా కొంత మంది తారలు భావిస్తున్నారు. ఈ రకంగా నటించుట వల్లనే అవకాశాలు వెంట వెంటనే వస్తాయని మరికొంత మంది తారలు భ్రమిస్తుంటారు. కాని రేష్మాసింగ్ ఈ తరహా పాత్రలకు గాక నటిగా గుర్తింపు ఉండే పాత్రలను చేయుటకే ప్రాధాన్యత నిస్తాను అంటోంది. "గుల్ గుల్షన్ గుల్ఫాం" సీరియల్‌లో పరీక్షిత్ సహానికుమార్తెగా నటిస్తున్న ఈ తారను ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. అందాలను సమపాళ్ళలో పుణికిపుచ్చుకున్న రేష్మాకు చిత్రావకాశాలు మెండుగానే వస్తున్నాయట! వస్త్ర ధారణలో ఎబ్బెట్టుగా ఉండే విధమైన పాత్రలను నిరాకరిస్తోందని, మంచి నటనను కనబర్చగలిగే నిండైన పాత్రలకే అంగీకారం తెల్పుతోందని తెలుస్తోంది.

నిలద్రొక్కుకుంటున్న మాధవి

నటన పరంగా సామర్థ్యం గల నటిగా మాధవిని ప్రేక్షకులు గుర్తించినా, ఈ తారకు అదృష్టం కలసి రాలేదనే అనుకోవాలి. శ్రీదేవి, జయప్రదల తర్వాతి స్థానం లోకి వచ్చే అవకాశాలు వచ్చినట్టే వచ్చి జారి పోవటం కాస్త కృంగదీసినా అసంతృప్తి చెందకుండా తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. "ఏక్ దూజేకేలియే" తర్వాత చిత్రాలు అంతంత మాత్రంగా నడిచాయి. కాని ఈ మధ్యకాలంలో తయారైన చిత్రాలలో "అగ్నిపథ్"లో అమితాబ్ సరసన మంచి



పాత్ర దొరికింది కదా అని సంతోషించింది మాధవి. కాని ఎడిటింగ్ టేబిల్ పై మంచి సీన్లు అన్నీ తీసివేయటంపై చాలా నిరాశ చెంది, భవిష్యత్తు గురించి ప్లాన్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది.

దాదా కొత్త చిత్రం

మరాఠీ సినీరంగంలో దాదాకొండ్కే గురించిన సంచలనాలు ఎన్నో జరిగాయి. ఈ నటుడి ప్రతి చిత్రాన్ని విమర్శకులు దుమ్మెత్తి పోస్తూ ఉండటం, ఆ తర్వాత అదే చిత్రం విజయవంత మవటం సాధారణమై పోయింది. దాదా చిత్రాల్లో అసభ్య దృశ్యాలు, ద్వంద్వార్థ సంభాషణలు, స్త్రీలను కించపరచే సన్నివేశాలు అధికంగా ఉంటాయని విమర్శకులు పేర్కొంటుంటారు. అంతేకాదు చిత్రాల పేర్లు కూడా అదే విధంగా ఉండటం మరింత ఆశ్చర్యకరం. దాదా తాజా చిత్రం "పాల్వా పాల్వి" ఈ సంవత్సరపు హిట్ చిత్రంగా మహారాష్ట్ర లోని కుగ్రామాలలో కూడా విజయవంతంగా నడుస్తోందట.

సంపూర్ణ జ్ఞానం కలగని టీనేజ్ దాటనున్న ఆ స్థితిలో కన్నవాళ్లు బిడ్డల్ని కనిపెట్టుకునుండాలి! అదిమాత్రం అక్షరాలా సత్యం!"

"ఔనా తల్లీ... అయితే ఇదిగో ఈ ఉత్తరం ఒక్కసారి ఆమూలాగ్రంగా చదువమ్మా!"

బ్యాగ్‌లోనుంచి తీసిచ్చిందో కవరును రాజేశ్వరి. చదవసాగింది శోభ.

"రాజీ.....!"

దూరపు చుట్టానివైన నువ్వు నన్నెప్పుడు చూట్టానికొచ్చినా దగ్గర స్నేహితురాల్లా కన్పించేదానివి. బంధుత్వంకన్నా, స్నేహతత్వమే మనమధ్య బాగా నెలకొంది. ఆ క్లోజ్‌నెస్‌తోనే వోసారి... కాదు...కాదు... ఓ వందసార్లైనా నాతో అనుంటావు. కల్సినప్పుడెల్లా... శోభను లిమిట్స్‌లో ఉంచు సుశీ... నాలుగ్గోడల మధ్య దాపుకాదు, నాల్గునోళ్ల నడుమ నలిగే అపవాదుకన్నాడా కాదుగాని, నాల్గునాళ్ల బ్రతుకు పచ్చగా ఉండటానికీ, వయసున కాపు ఉండాలి. తల్లీ, తండ్రీ నువ్వే అయి

అమ్మ మా(బా)ట

కాపాడుకోవాలి... అంటూ అప్పుడప్పుడే గాయపడిన సంధ్య జీవితం గురించి నా ముందుంచావు. దాంతో నా జాగ్రత్తలో నేనుండక తప్పలేదు! విధి బలీయమో.... మరే కారణమో చెప్పలేం... ఒకవేళ రవీంద్రతోగాని శోభ పెళ్లి జరక్కపోయినట్లయితే ఏ నుయ్యో, గొయ్యో నా బిడ్డ చూసుకోవాల్సిన పరిస్థితి రాకూడదన్న నా ఆలోచనే శోభనేనాడూ హద్దులు మీరనివ్వలేదు.

బాల్యంలో తప్పటడుగులు తప్పించేది, యువ్వనంలో వయసు వొరవడిలోని తప్పటడుగుల్ని తప్పించేది అమ్మే.... ఆ అమ్మ కోరేది అమ్మాయి క్షేమమే!

రవి శోభ ఒకర్నొకరు అర్థంచేసుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు నాకు రిలీఫ్‌గా ఉంది. కాస్తంత నఫర్‌గా కూడా ఉంది శోభకు నాపై కోపంగా ఉన్నందుకు. పోన్లే రాజీ... తాత్కాలికమైన ఈ బాధకన్నా శోభ బ్రతుకు శాశ్వతానందమైనందుకు ఆనందంగా ఉంది. ఆ సంతృప్తి ఎంతో నిశ్చింత నాకు! వదికాలాలు శోభ పచ్చగా ఉండాలని కోరుకుంటున్నాను.

నీ బిడ్డగా చేజారిన బ్రతుకు, నా బిడ్డగా ఆదిలోనే భద్రపరచుకునే అవకాశం కల్గించిన నీలాంటి స్నేహమయి నా స్నేహితురాలైనందుకు ఎంతో అదృష్టవంతురాల్ని!

కృతజ్ఞురాల్ని రాజీ...

- నీ సుశి.

"అమ్మా !" ఒక్కసారిగా పిలుస్తూ దుఃఖభారంతో వివశురాలౌతూ సోఫాలో చతికిలబడిపోయింది శోభ.

"అంటే... వెంటనే నేను అమ్మను చూడాలి! ఆమె పాదాలపై పడాలి. అమృత మందించే తల్లి మనను అన్యతమనుకున్న నా మూర్ఖత్వం కరిగి నీరైపోగా ఆ కన్నీట ఆ తల్లి కాళ్లు కడగాలి! జన్మజన్మల క్షమ నర్థించాలి!"

బాధానందాల మయమైన శోభ హృదయం తల్లికోసం తాపత్రయపడిందన్నేళ్ల అనంతరం తొలిసారిగా!

మన ఫుట్‌బాల్ ఆటకి "మోహన్ బగాన్" చేసిన సేవలు!

భారత క్రీడా రంగంలో మోహన్ బగాన్ క్లబ్‌కు ప్రత్యేక స్థానమున్నది కలకత్తాకు చెందిన యీ అగ్రగామి ఫుట్‌బాల్ జట్టు మన దేశ క్రీడా రంగంలో ముఖ్యంగా ఫుట్‌బాల్ రంగంలో సంచలనాత్మక విజయాలు సాధించి మన దేశ క్రీడాభిమానుల ప్రశంసలు ఆదరణ పొందింది మోహన్ బగాన్ ఎథిలెటిక్ క్లబ్ కొద్ది రోజుల క్రితం భారీగా వంద ఏళ్ళ ఉత్సవం జరుపుకుంది ఈ క్లబ్ ఒక్క ఫుట్‌బాల్‌కే పరిమితంగాక హాకీ క్రికెట్ మొదలగు ఆటలను కూడా ప్రోత్సహిస్తుంది మోహన్ బగాన్ క్లబ్ సభ్యత్వము కొన్ని వేల సంఖ్యలో దేశ అన్ని ప్రాంతములలో కలిగియున్నదనుటలో అతిశయోక్తి లేదు

మోహన్ బగాన్ క్లబ్ నెలకొల్పబడిన తేదీకి భారత చరిత్రకు దగ్గరి సంబంధం వున్నది 1889 ఆగష్టు 15న ఉత్తర కలకత్తాలో గల మోహన్ బగాన్ విల్లా అనే భవంతిలో కొందరు క్రీడాభిమానులచే ప్రారంభించబడినది ఈ భవంతి ఆవరణలో గల విశాల ఖాళీ స్థలం ఫుట్‌బాల్ గ్రౌండుగా ఉపయోగించారు ప్రప్రథమ సమావేశము. కలకత్తాలోని 14 బలరాంగోష్ వీధిలో భూపేంద్ర నాథ్ బాసు నివాసంలో జరిగింది మోహన్ బగాన్ విల్లా ఆట స్థలముగా యుండుటవలన క్లబ్ పేరు కూడా మొదటలో మోహన్ బగాన్ స్పోర్టింగ్ క్లబ్ గా పెట్టారు. తర్వాత మోహన్ బగాన్ విల్లా భవంతి పడగొట్టి వ్యాపార స్థలము క్రొత్త భవనాలు నిర్మించారు క్లబ్ పేరు కూడా తర్వాత మోహన్ బగాన్ అథిలెటిక్ క్లబ్ గా మార్చబడినది

ప్రథమ పోటీ

మోహన్ బగాన్ విల్లా గ్రౌండ్సులో మొట్ట మొదటి పోటీ ఏడన్ హిందూ హాస్టల్‌లో జరిగింది గిరిన్‌బోస్ ప్రమత్ ఛటర్జీ సమిన్‌బెనర్జీ రాంగోస్వామి శరత్‌మిత్రా మిత్తర్ మొదలగువారు మోహన్ బగాన్ జట్టులో 1889లో ఆడారు 1904లో మోహన్ బగాన్ కూచ్ బీహార్ కప్ గెల్చింది ఇది యీ జట్టు మొట్ట మొదటి గెలుపు 1905లో కూచ్ బీహార్ గ్లాడ్‌స్టన్ కప్ పోటీలు గెల్చింది 1906 నుండి 1908 మూడు సంవత్సరాలు ట్రేడర్స్ కప్ కూచ్ బీహార్ కప్ గ్లాడ్ స్టోన్ కప్‌లు గెల్చి హ్యాట్రిక్ సాధించినది ఆ రోజులలో యిటువంటి ఏ భారత జట్టూ సాధించి యుండలేదు 1915 వరకు ప్రెసిడెన్సీ కాలేజీ గ్రౌండ్‌కు క్లబ్ ఆటస్థలముగా యున్నది

ఆనాడు క్లబ్ సభ్యత్వము మూడు నెలలకు అర్థ రూపాయి విద్యార్థులకు పావలా 1908లో మొదటిసారిగా ఐ ఎఫ్ ఏ షీల్డ్ పోటీలలో ఆంగ్ల జట్టులతో పోటీ పడింది 1911లో మొదటిసారిగా ఐ ఎఫ్ ఏ షీల్డ్ మోహన్ బగాన్ గెల్చినప్పుడు యావత్తు దేశం అభినందించింది 1911 జూలై 29న జరిగిన ఫైనల్ పోటీలో మోహన్ బగాన్ క్లబ్ మిలటరీ జట్టు ఈస్ట్‌యార్క్‌షైర్ రెజిమెంటు మధ్య జరిగిన తీవ్ర పోటీలో 21 స్కోరుతో భారతీయ జట్టు విజయం పొందినది ఆ పోటీలో హీరాలాల్ ముఖర్జీ భూతి సుకుల్ సుధీర్ ఛటర్జీ మన్ మోహన్ ముఖర్జీ రాజన్‌సేన్‌గుప్త ఎన్ భట్టాచార్జీ కానూ రాయ్ హబూల్ సర్కార్ అభిలాష్ ఘోష్ భాధూరీ ఎస్ భాధూరి (కెప్టెన్) పాల్గొన్నారు ఈ విజయం గురించి లండన్ పత్రికలు రూటర్స్ న్యూస్ ఏజన్సీస్ డెయిలీ మెయిల్ మాంచెస్టర్ గార్డియన్ సింగపూర్ ఫ్రీప్రెస్ క్రామేడ్ ముసల్మాన్ ది ఎంపైర్‌స్టేట్స్‌మన్ పత్రికలు ప్రశంసించాయి

నూతన అధ్యాయం

1914లో కలకత్తా ఫుట్‌బాల్ రంగంలో నూతన అధ్యాయం ఏర్పడినది అప్పటివరకు 'లీగ్' పోటీలలో ఆంగ్ల జట్లకు మాత్రము ప్రవేశం యుండెడిది మొదటిసారిగా మోహన్ బగాన్ క్లబ్, ఆర్యన్స్‌కు రెండవ డివిజన్ లీగ్ పోటీలలో ఆడే అవకాశం యివ్వబడినది ఆ పోటీలో విజయం పొందిన మోహన్ బగాన్ క్లబ్‌నకు మరునటి సంవత్సరం (1915లో) మొదటి డివిజన్ లీగ్ పోటీలలో స్థానం లభించింది 1939లో బి ముఖర్జీ కెప్టెన్‌గా మోహన్ బగాన్ క్లబ్ కలకత్తా ప్రథమ(శ్రే

1911లో ఐ.ఎఫ్.ఎ.షీల్డ్ గెలుచుకున్న మోహన్ బగాన్ జట్టు





లీగ్ పోటీలలో విజయం పొందినది మోహన్ బగాన్ క్లబ్ దేశంలో అనేక ప్రాంతాలు వెళ్ళి పోటీలలో అఖండ విజయం పొందినది

1948లో లండన్ ఒలింపిక్స్‌లో ప్రథమ సారిగా పాల్గొన్న స్వతంత్ర భారత ఫుట్‌బాల్ జట్టునకు యీ క్లబ్ ఆటగాడు టి ఆవో సారథ్యము వహించాడు శైలెన్‌మన్నా మహబీర్, అనిల్‌డే కూడా ఎంపిక అయ్యారు కాని స్థానిక లీగ్ పోటీలలో ఆడవలసి యుండి వీరు వెళ్ళలేదు మోహన్ బగాన్ క్లబ్ తిరిగి లీగ్ ఛాంపియన్‌షిప్ గెల్చింది

1949 డిసెంబరులో క్లబ్ స్థాపించి 60 ఏళ్ళు నిండిన సందర్భములో భారీ ఎత్తున వజ్రోత్సవాలు జరిపారు స్వీడన్‌కు చెందిన హెల్సింగ్‌ఫర్స్ ఫుట్‌బాల్ జట్టు ఉత్సవ పోటీలలో పాల్గొన్నది 1953లో మన్నా సారథ్యములో మొదటిసారిగా ఢిల్లీ డ్యూరెండ్‌కప్' గెల్చింది 1955-56లో క్లబ్ అనేక విజయాలు సాధించింది మొదటిసారిగా బొంబాయి రోవర్స్ కప్ పోటీలలో ఆడి విజయం పొందినది మనదేశం పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా జట్టును ఓడించింది ఐ ఎఫ్.ఏ షీల్డ్, కలకత్తా సీనియర్ లీగులో కూడా విజయం పొందినది

1956లో యీ క్లబ్ ఇండొనేషియా హాంగ్‌కాంగ్, సింగపూర్ మలేషియాలలో పర్యటించింది ఎస్ మన్నా చునీ గోస్వామిలతో బాటు విశాఖవాసి సిద్ధనాతి వరహాలు యీ జట్టులో కలరు మోహన్ బగాన్ జట్టు ఆటగాళ్ళు టి ఆవో (1948) ఎస్ మన్నా (1952), ఎస్ బెనర్జీ (1956) ఒలింపిక్స్‌లో ఆడిన మన దేశ జట్టు సారథులు ఈ జట్టు అగ్ర ఆటగాడు చునీ గోస్వామి రెండవ ఎలిజబెత్ రాణికి పరిచయం చేయబడ్డారు

దక్షిణ భారతీయుడు

కలకత్తా మైదానంలో ఆడిన ప్రథమ దక్షిణ భారతీయ ఆటగాడు విశాఖపట్నంకు చెందిన అత్తిలి సూరిబాబు 1926 నుండి మోహన్ బగాన్ జట్టు ఆటగాడు

అగ్రగామి ఫుట్‌బాల్ ఆటగాళ్ళు

మతిలాల్‌సేన్ (మొట్ట మొదటి కెప్టెన్), శిబదాస్ భాధూరి (1911 ఐ ఎఫ్ ఏ షీల్డ్ గెల్చిన జట్టు సారథి), అఖిలాష్‌ఘోష్, గోంగాబాబు (జితేంద్రనాథ్ దత్తా), మోనీదాస్, గోష్టపాల్ రోబి గంగూలీ, ప్రకాష్‌ఘోష్, మోతీసేన్ గుప్త, అత్తిలి సూరిబాబు, అనిల్‌డే, శైలెన్ మన్నా (అర్జున, పద్మశ్రీ) ఎస్ మిత్తర్, ఫజులుర్ రహమాన్, అబ్దుల్ హమీద్ సాతుచౌదరి, చిమన్ ముఖర్జీ, టి ఆవో ఎస్ రామన్, ఎస్ మేవాలాల్, ఎస్ సరకాధికారి, ఎస్ గిన్, జార్నెల్‌సింగ్ (అర్జున) కెంపయ్య, ఎస్ డే, ఎం ఏ సత్తార్ అర్ముగం, డిఫూదాస్, అమల్ చక్రవర్తి, ఆర్ గుహా మరువలేని మేటి ఆటగాళ్ళు

1951 ప్రథమ ఆసియా క్రీడలలో విజయం పొందిన మన దేశ జట్టునకు యీ క్లబ్ కెప్టెన్ ఎస్ మన్నా సారథ్యము వహించారు

1964లో 'స్వాతివం జూబిలీ' యీ క్లబ్ జరుపు కున్నది

ఈ క్లబ్ ఏర్పడి 100 సంవత్సరములు నిండిన సందర్భములో కొద్ది రోజుల క్రితం భారీ ఎత్తున కలకత్తాలో ఉత్సవాలు నిర్వహించింది ఇటీవల వరల్డ్ కప్‌లో సంచలనం సృష్టించిన కామరూన్‌కు చెందిన రోగర్ మిల్లా సారథ్యమున డైమండ్ ఫుట్‌బాల్ క్లబ్ పాల్గొని విజయం పొందినది

ఇతర క్రీడలు


మోహన్ బగాన్ క్లబ్ ఒక్క ఫుట్‌బాల్ ఆటలో నేగాక యితర క్రీడలను కూడా ప్రోత్సహించింది వాటిలో క్రికెట్ హాకీ టెన్నిస్ అథ్లెటిక్స్‌లు ముఖ్యమైనవి

క్రికెట్‌లో అనేకమంది బెంగాల్ రంజీట్రోఫీ ఆటగాళ్ళను రూపొందించింది హాకీలో 1935లో నే లీగ్ విజేత యీ క్లబ్ అనేకమంది బెంగాల్ ఆటగాళ్ళను యీ క్లబ్ అందించింది బెయిటన్ కప్, ఆగాఖాన్ కప్ మొదలగు పోటీలలో గెల్చినది సి ఎస్ గురుంగ్ (1952 హెల్సింకి) జాతీయ ఆటగాడు టెన్నిసులో సుమంత్‌మిశ్రా అగ్రస్థానం పొందాడు

ప్రభుత్వమునుండి ఎటువంటి సహాయం పొంద కుండా తన స్వయంశక్తితో సభ్యుల సహకారముతో కలకత్తా నగరం నడకంటూ ప్రత్యేక ఫుట్‌బాల్ క్రీడాంగణము టెంట్ (కార్యాలయము) ఏర్పరచు కొని జాతీయ స్థాయిలో అగ్రస్థానములో యుండి వంద ఏళ్ళ ఉత్సవాలు జరుపుకొనుచున్న మోహన్ బగాన్ క్లబ్ అనేకమంది అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాళ్ళను రూపొందించింది. -ముకరమ్



నొప్పి, బాధ వచ్చినప్పుడు ఉపశమనానికి మీరు ఎవరి దగ్గరికి వెళ్తారు?



అమృతాంజన్ సుమారు నూరు సంవత్సరాలుగా అమృతాంజన్ మీ తలనొప్పులకు వెన్ను నొప్పులకు బెణుకులకు, ఇతర శారీరక బాధలకు ఉపశమనం కలగచేస్తోంది విశ్వసించిన ఉపశమనం కలగచేసే అమృతాంజన్— మీ జీవిత కాలమంతా మీ వెంటవుండే సహాయకరి

అమృతాంజన్

పెయిన్‌బామ్

అమృతాంజన్ లిమిటెడ్

O&M 1782 TG



మణికంఠుడు

ప్రయాగ రామకృష్ణ

ఇంతవరకూ సాగిన కథ-8 : మహోన్నతమైన దాంపత్య జీవితం గురించి, ధర్మార్థ కామమోక్షాలను అనుభవించడం గురించి ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యతను బ్రహ్మ తన మానసపుత్రుడైన అత్రి మహర్షిపై ఉంచుతాడు. అత్రి భార్య అనసూయ పాతివ్రత్యానికి మెచ్చి త్రిమూర్తులు దత్తాత్రేయుణ్ణి ప్రసాదిస్తారు. గాలవ మహర్షి కూతురు లీలాదేవిని వివాహం చేసుకున్న దత్తాత్రేయుడు మహిషివి కమ్మని లీలను శపిస్తాడు. నారదుడి సలహాపై త్రిమూర్తులు సృష్టించిన మహిషం అదృశ్యం కావటంతో మహిషి బ్రహ్మ గురించి తపస్సుచేసి వరాలు పొందుతుంది. జగన్మోహినిని చూసి పరమశివుడు కామోద్రేకానికి గురవుతాడు.

(గత సంచిక తరువాయి)

దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు, లోక కళ్యాణానికి పరమేశ్వరుని తేజస్సుతో జగన్మోహిని దోసిట ఒక చిన్నారి ఉద్భవించాడు. కన్నులు తెరిచీ తెరవకుండానే ఆ చిన్నారి తన చిరునవ్వుతో ప్రపంచమంతా ఏదో పొంగెత్తిన సంతోషాబ్ధిలో మునిగిపోయేటట్టు చేశాడు. మనోహరంగా వున్న ఆ పసివాణ్ణి చూడగానే మోహిని గుండెలు పొంగాయి. ఆ తల్లికి పాలు చేపాయి. బిడ్డను చేతుల్లోకి తీసుకొని గుండెలకు హత్తుకోవాలనుకుంది. అంతలోనే తన స్థితేమిటో తనకు తెలిసొచ్చింది జగన్మోహినికి. కంట నీరు పెట్టుకుని నిస్సహాయంగా అంతర్ధానమైంది. తరువాత కొంత సేపటికి మోహిని స్థానంలో అనంత పరబ్రహ్మ స్వరూపంలాగా వెలిగిపోతూ విష్ణుదేవుడు సాక్షాత్కరించాడు. ఆనందకందలిత కంఠాలతో వైకుంఠమంతా ప్రతిధ్వనించిపోయేటట్టు దేవతలంతా హరిహర సుతుణ్ణీ, శివ కేశవులనూ కీర్తించడం ప్రారంభించారు. నలువైపులనుండి శివ వైష్ణవ భక్తులంతా పరుగు పరుగున వచ్చి విష్ణుదేవుని ప్రాంగణంలో తేజోమయమూర్తై జగదానందకారకుడై శ్రీధర శంభు తనయుడై వెలసిన ఆ చిన్నారి పాదకమలాలను ముద్దుపెట్టుకుంటూ ఆ పసివాడి చరణాంచలాలను శిరస్సుతో స్పృశించారు. 'ఈ మహానుభావుడే, ఈ హరిహర సుతుడే నాకు ప్రాణదాత. మహాప్రభూ! శివకేశవ రూపా! నువ్వే నా రక్షకుడవు. నేను నీ భక్తుడను. నీ పాదదాసుడను' అంటూ దేవేంద్రుడు చేతులు జోడించాడు.

నారదుడు నవ్వుతూ 'నిజమే! ఈ హరిహర కుమారుడే మహిషి అగడాలను అరికట్టి నీ లోకాన్ని నీకు అప్పగించాల్సిన వాడు. కాని ఈ పసివాణ్ణి అప్పటి వరకు సాకేదెవరు? కడుపు తీపి లేని తల్లె వతుంటుందిలే పెంచి పెద్ద చేయక పోవటానికి అనుకుందామా అ మాయలాడి మాయ మయ్యె....' అని విష్ణుదేవుడి వైపు చూశాడు.

ఆయన తలదించుకుని మౌన ముద్రలో స్తంభించి పోయాడు. లక్ష్మీదేవి పక్కనే వుండడంతో విష్ణుమూర్తి మరింత ఇబ్బందిలో పడ్డాడు. శివుడి పరిస్థితి కూడా అలాగేవుంది. 'మహానుభావా! జగన్మోహిని రూపంలోవున్న విష్ణుదేవుడికి పుత్రభిక్ష పెట్టిన మగధీరా! రా! ఎక్కడెక్కడ ఇంకా ఏ ఏ ఘనకార్యాలు చేశావో చెప్పు?' అని పార్వతీదేవి త్రాచుపాములా బుసకొడ్తుందేమోనని పరమేశ్వరుడు వణుకుతున్నాడు. అంతలో ఆయన భుజం మీద చెయ్యి పడింది. తలపక్కకి తిప్పి చూసాడు. నారదమహర్షి!

'మాట దక్కించలేక పోయావు. ఇంత నిగ్రహం లేని వాడవని తెలిస్తే నీ తరఫున అసలు విష్ణువుకు మాటే ఇచ్చుండేవాడ్ని కాదు. త్రిమూర్తుల్లో ఒకరైన సంహార శక్తికి సంయమనం లేకపోతుందా అని భ్రమపడ్డాను. యుక్తాయుక్తాలు మరచి పోయి తొందరపాటులో మోహ వికారాలకు లొంగడంవల్ల కామం, కామం వల్ల క్రోధం క్రోధం వల్ల సమ్మోహం, సమ్మోహం వల్ల స్మృతి విభ్రమం, దానివల్ల బుద్ధి నశించడం, అందువల్ల సిగ్గువడడం సామాన్యులు చేసే పనను కున్నాను కాని నువ్వు కూడా ఇంత దుర్బలుడవనుకోలేదు' అన్నాడాయన.

శివుడు మాట్లాడకుండా ప్రతిమలా నిలబడి పోయాడు. బుద్ధిగా చేతులు కట్టుకుని కళ్ళు మూసుకుని ధ్యానిస్తున్నట్టు నిలబడ్డాడు. రెండు క్షణాల తర్వాత ఓ కన్ను కొంచెం తెరిచాడు. మహర్షి దెప్పి పొడవడం ఆపేసాడల్లేవుందని రెండోకన్ను కూడా మెల్లిగా తెరిచి చూసాడు.

మహర్షి తనవైపే చూస్తున్నాడు. నవ్వబోయి మళ్ళీ అంతలోనే ముఖాన్ని గంభీరంగా చేసుకుని 'ఏదైతే జరగకూడదో అదే జరిగిపోయాక తప్పొప్పుల్ని గురించి విచారించడం తెలివి తక్కువ. ఇంతకీ ఈ పసివాడి బాధ్యత ఎవరు స్వీకరిస్తారో చెప్పండి?' అన్నాడు.

ఆ ప్రశ్నకు విష్ణుమూర్తికి కోపం కడుపులోంచి గుండెల్లోకి తన్నుకొచ్చింది. ముఖం ఎర్రబడింది. 'నారాయణ నారాయణ అంటూ నువ్వే నన్ను అభాసుపాలు చేసావు. నేను జగన్మోహినిగా మారే వరకు నీకు నిద్రపట్టిందికాదు' అవడానికి బ్రహ్మచారివే గాని జగన్మోహిని ముఖాన్నీ, ముక్కునీ, పెదవుల్నీ, స్తనాల్నీ, నాభీదేశాన్నీ మృదువుగా స్పృశిస్తున్నట్టే వర్ణించి వర్ణించి శివుడికి గంగవెర్రులెత్తించావు. జగన్మోహిని కళ్ళు సుద్రంగా వున్నాయన్నావు. ఆవిడవి విశాల నయనాలన్నావు. బుగ్గలు లావుగా నునుపుగా వుండి చూపులే జారిపోయేట్టున్నాయన్నావు. ఆ పిల్లను కళ్ళారా చూడనన్నా చూడకపోతే ఈ జన్మెందుకని పార్వతీపతిని వెర్రి వెంగళప్పని చేసి నీ యిష్టం వచ్చినట్టు

అడించావు. బ్రహ్మచారి వంద మర్కటాల పెట్టు అని ఎందుకన్నారో నాకిప్పుడు తెలిసొచ్చింది. అసలు తప్పంతా నీదే. నువ్వూ, నీ శివుడూ ఈ పిల్లవాణ్ణి ఏం చేసుకుంటారో చేసుకోండి. నాకేమాత్రం సంబంధం లేదు అన్నాడు కావాలనే కొంచెం కటువుగా. మహర్షికి గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయింది. కొంచెం సర్దుకుని 'ఈ పిల్లవాడెవరికీ సమస్యగాబోవడం లేదు. శివ వైష్ణవ శక్తిగా ఉద్భవించిన ఈ శిశువు ముందు ముందు - వడ్డ వాళ్లను, లోబడ్డవాళ్ళను, చెడ్డవాళ్ళను, చెరచబడ్డవాళ్ళను, స్నేహం కోసం చేతులు చాచి ఆ చేతుల్నే కాల్చుకున్న వాళ్ళను, దుఃఖాల నరకాలలో ఏడ్చే వాళ్లను, సుఖాల మోసాలలో కూరుకున్న వాళ్ళను బయటపడేసే సకల బలోపేతుడవుతాడు. మానవుల్లో మానవుల్లోని దానవుల్లో, అహంకారం, మదం, మత్సరం ఆవేశించిన రాక్షసుల్లో, అధర్మం, అసత్యం, స్త్రీలోలత, అక్రమాలు చెలరేగిన దుర్మార్గ చక్రవర్తుల్లో దానవుడిని దండించే కలియుగ దేవుడవుతాడు. అధర్మానికి వడిగట్టిన మహిషాసురుల్ని సంహారించి ధర్మాన్ని పునరుజ్జీవింప చేస్తాడు. మంచివాళ్ళను అక్కున చేర్చుకుంటాడు. చేసిన తప్పులకి కుమిలి పోతూ పశ్చాత్తాపంతో దహించుకు పోయే వాళ్ళను ఓదార్చి ధైర్యం చెప్తాడు. మనుషుల్లో కోరికలు చెలరేగకుండా, బుద్ధి పెడదారిన పడకుండా, భూమికి పాపభారం పెరగకుండా భూలోకంలో ధర్మకర్మ ప్రవర్తనానికి, జీవన విధానాలకు మార్గాలు



ఏర్పరుస్తాడు' అన్నాడు.

'అయితే అవచ్చుగాక. నాకు మాత్రం ఈ పిల్లవాడక్కర్లేదు' అని ఖచ్చితంగా చెబ్దామనుకున్నాడు విష్ణుదేవుడు. కాని ఆ పసి పిల్లవాణ్ణి గురించి నారదుడు చెప్పేదంతా వింటుంటే ఆనందంతో నోటమాట రాలేదు. మెచ్చుకోలుగా పిల్లవాడి వైపు చూసాడు. నారదుడు ఇదంతా గమనిస్తూనే వున్నాడు. తనకు తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ అయిన శ్రీ మహా విష్ణువుకు

శ్రీ శాస్తనమస్కార పంచరత్నం

లోకవీరమ్ మహాపూజ్యమ్ సర్వరక్షాకరమ్ విభుమ్
పార్వతీ హృదయానందం శాస్తారం ప్రణమామ్యహమ్
- శ్రీ స్వామియేశరణం అయ్యప్పా!

విప్రపూజ్యం విశ్వం వంద్యం విష్ణుశంభో ప్రియం సుతం
క్షిప్ర ప్రసాద నిరతం శాస్తారం ప్రణమామ్యహం
- శ్రీ స్వామియేశరణం అయ్యప్పా!

మత్త మాతంగ గమనం కారుణ్యామృత పూరితం
సర్వ విఘ్న హరం దేవం శాస్తారం ప్రణమామ్యహం
- శ్రీ స్వామియేశరణం అయ్యప్పా!

అస్మత్ కులేశ్వరం దేవం అస్మత్ శత్రు వినాశనం
అస్మతిష్ఠ ప్రతాదారం శాస్తారం ప్రణమామ్యహం
- శ్రీ స్వామియేశరణం అయ్యప్పా!

పాండ్యేశ వంశతిలకం కేరళే కేళి విగ్రహం
ఆర్త త్రాణ పరం దేవం శాస్తారం ప్రణమామ్యహం
- శ్రీ స్వామియేశరణం అయ్యప్పా!

యస్య ధన్వంతరీ మాతా పితా రుద్రోభిషక్తమః
దం శాస్తారం మహో వైద్యం దయానిదం
- శ్రీ స్వామియేశరణం అయ్యప్పా!

తనమీద అలకపోయిందనుకుని మనసులోనే ప్రణమిల్లాడు. కొద్దిసేపు ఆగి ఆయనే అజ్ఞానాన్ని నశింపచేసేవాడూ, సకల శాస్త్రాలకు మూలమైనవాడూ గనుక శివుడే ఈ పిల్లవాణ్ణి కైలాసానికి తీసుకుపోయి విద్యాబుద్ధులు నేర్పి, సర్వకళా వల్లభుడగునట్లుగా, సర్వశాస్త్ర నిపుణుడగునట్లుగా బాధ్యతాయుతంగా పెంచడం అపేక్షణీయం. నిజానికి బిడ్డల్ని కనేది తల్లే అయినా వాళ్ళకు

మణికంఠుడు

ఆధారం కావల్సింది, వాళ్ళ మంచి చెడ్డలు చూడాల్సింది తండ్రే. న్యాయం చెప్పాల్సొస్తే ఈ పిల్లవాడి పోషణ భారమంతా మహా శివుడిదే' అన్నాడు. శివుడు అప్పటికే తప్పంతా తనదే అయినట్టు కుమిలి పోతున్నాడు. మారు మాట్లాడలేదు. బిడ్డను చేతుల్లోకి తీసుకున్నాడు.

ఆకాశవాణి పలికింది - 'శంకర నారాయణుల అనుగ్రహ ఫలితమైన ఈ చిన్నారి ధర్మ శాస్తగా ప్రసిద్ధుడవుతాడు. శత్రువులను వధించే సర్వశక్తి సంపన్నుడు, యజ్ఞ యాగాలను చేసేవారిని సంరక్షించేవాడు, విఘ్నాలను పారద్రోలేవాడు, కులమత వర్గ వర్ణ భేదాలకు అతీతమైనవాడు, లోక కళ్యాణాన్ని కాంక్షించేవాడు, సకల భోజ్య పదార్థాలని గ్రహించేవాడు. సంగీత ప్రియుడు, సంభాషణా చతురుడు, సమస్త భూతజాలమందు దయ కలిగినవాడు, ఎంత చెప్పుకున్నా, ఎన్నిసార్లు విన్నా, ఎన్నిసార్లు వినిపించినా, ఎన్నిసార్లు చదువుకున్నా, ఎంత ఆలోచించినా తనివితీరని అమృత హృదయుడూ అవుతాడు ఈ శిశువు. ఈ శిశువు ద్వారానే లోకాలన్నీ సత్యాన్ని దర్శించబోతున్నాయి.'

దేవతలంతా చేతులు జోడించి
ధర్మ శాస్తకు వందనం చేసారు.
భేరీతూర్యనాదాలు మ్రోగాయి.
పసివాడితో నడుస్తున్న పార్వతీపతిపై
పుష్ప వృష్టి కురిసింది.

(ఇంకావుంది)

సినిమా.. సినిమా..

చిన్నారి ముద్దులపాప

"జగపతిబాబు ఫొటోగ్రాఫరు- మోడల్ ఆర్టిస్ట్ సుధాకర్ మెడికల్ రెప్రెజెంటేటివ్ శివాజీరాజు కాస్మెటిక్స్ ఐటమ్స్ రెప్రెజెంటేటివ్ ఈ ముగ్గురు బ్రహ్మచారుల జీవితాల్లోకి అనుకోకుండా ఓ ఆరునెలల చిన్నారి పాప ప్రవేశించడంతో వారి జీవితాలు కొత్త మలుపులు తిరుగుతాయి బేబి సెంటిమెంట్‌తో క్రైమ్, కామెడీ మేళవించిన ప్రణయగాథ కావేరి అనే నాయికను, వాణి అనే కొత్త నటిని, ఆర్ వి ప్రసాద్ అనే విలన్‌ను పరిచయం చేస్తున్నాం ప్రముఖ సంగీత దర్శకుడు స్వర్గీయ కోదండపాణి పుత్రుడు ఈశ్వర్ ఈ చిత్రానికి సంగీతమిచ్చారు ఎం వి రఘు శిష్యుడు మోహన్ ఛాయాగ్రాహకుడు, డిసెంబర్ విడుదల," అన్నారు వాసిరెడ్డి ఈయన దర్శకత్వంలో వడ్డే రమేష్ నిర్మించే "చిన్నారి ముద్దుల పాప" చిత్రంలో డిస్కో శాంతి, రజిత, లక్ష్మీప్రియ, సంధ్య, కోట శ్రీనివాసరావు, ప్రదీప్‌శక్తి, బేబి సౌజన్య, బేబి మేఘన పాత్రధారులు



"తల్లిదండ్రులు"తో విజయశాంతి, బాలకృష్ణ

సీతారామయ్యగారి మనవరాలు

"కాకినాడలోని ఎం బి బి ఎస్ చదువుకునే వాసు ప్రతి వీక్‌ఎండ్‌కు తండ్రి వద్దకు వచ్చి ఆ వారమంతా తానేం చేసిందీ పూసగుచ్చినట్లు చెప్తుంటాడు," ఐతే, తను ప్రేమలోపడ్డ విషయంమాత్రం మరుగునపరిచేసరికి తండ్రిసీతారామయ్యలో పంతం తలెత్తుతుంది. ఫలితంగా తండ్రీ కొడుకుల ఎడబాటు ప్రేమించిన సుధారాణిని వాసు పెళ్ళాడి, అమెరికా వెళ్ళిపోతాడు వారి కుమార్తె క్రాంతి తమ కుటుంబ కథ తెలుసుకుని, అమెరికా నుండి తన తాతయ్యను కలుసుకోడానికి వస్తుంది ఆ తర్వాత కథ అనేక మలుపులు తిరుగుతుంది," అన్నారు క్రాంతి కుమార్ ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సీడెడ్ ప్రాంతంలో ప్రముఖ పంపిణీదారు అయిన దొరస్వామిరాజు నిర్మించే వి ఎం సి పిక్చర్స్ "సీతారామయ్యగారి మనవరాలు" చిత్రంలో ఎ ఎన్ ఆర్ , రోహిణి హత్తంగడి, మీనా, సుదర్శన్, కోట శ్రీనివాసరావు, నారాయణరావు, తనికెళ్ల భరణి, సుధాకర్, సారిక రామచంద్రరావు, రాజా, సరస్వతి, శ్రీశైలజ, శకుంతల, శ్రీలత, సుధారాణి, నీతూ, మాస్టర్ అమిత్, బేబి పావని పాత్రధారులు రెండు విశిష్టమైన పాత్రలలో దాసరి నారాయణరావు, మురళీమోహన్ కనిపిస్తారు మానస రాసిన "నవ్వినా కన్నీళ్ళే" ఆధారంగా గణేష్‌పాత్రో మాటలు రాశారు వేటూరి గీతాలకు కీరవాణి స్వరపరిచారు కె. ఎస్ హరి ఛాయ, భాస్కరరాజు శిల్పం, తార నృత్యాలు, శ్రీకర ప్రసాద్ కూర్పు నిర్వహిస్తున్నారు

[74వ పేజీ చూడండి]

సమాజమే "దేవళం"

-ఎన్. టి. ఆర్.

(గత సంచిక తరువాయి)

మహనీయ సంస్కర్త

"బుద్ధుని వంటి మానవత్వం గల సంఘ సంస్కర్త- నాకు మరెవ్వరూ కన్పించలేదు నా వాదం- తెలుగుదేశం సిద్ధాంతం- 'సమాజమే దేవళమని, పేద మానవుడే దైవమని

"అదే విధంగా మూఢ నమ్మకాలు మానవ మేధస్సును మత్తుగమ్మి, మాయజల్లిన ఆ తరాల క్రితమే, యీ సామాజిక విలువలను గుర్తించినటువంటి మహనీయ సంస్కర్త ఆ మహామహుడు అందుకే-అతని ప్రవచనం- సంఘం శరణం గచ్ఛామి; ధర్మం శరణం గచ్ఛామి, బుద్ధం (మంచి ఆలోచన) శరణం గచ్ఛామి ఈ ఆదర్శాలలోనే పరమార్థం గుర్తించిన ఆ మానవతావాదిని మించిన వేరే ప్రబోధకుడు లేడని నా నమ్మకం వారు మన దేశాన్ని పునీతం చేయడం జీవితాదర్శం ఇంత

'నటరత్న'తో ఆంధ్రపత్రిక సినీస్పెషల్ రిపోర్టర్ శ్రీ ధీశెట్టి జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ



సామాన్యునిలా స్నానం

మధురంగా మానవాళికి ప్రవచించడం, దేశం చేసుకున్నటువంటి అదృష్టం" అంటూ ప్రవచించారు శ్రీ రామారావు

ప్రపంచదేశాల్లో ప్రదర్శించిన పద్మశ్రీ ఆణిముత్యాలు

1951- "మల్లీశ్వరి"- తెలుగులో ప్రప్రథమంగా విదేశాలకు వెళ్ళిన చిత్రం వియత్నాం- పెకింగ్- పారిస్‌లలో ప్రదర్శింపబడింది

1962- "మహామంత్రి తిమ్మరుసు"- రష్యాలో ప్రదర్శింపబడింది

1967- "లవకుశ"- పారిస్‌లో ప్రదర్శింపబడింది

1964- "నర్తనశాల"- జకర్తాలో జరిగిన రెండవ ఆఫ్రో ఆసియన్ చలనచిత్రోత్సవంలో ప్రదర్శింపబడి బహుమతి పొందింది

1967- "కంచుకోట"- కైరోలో ప్రదర్శింపబడింది

1967- "ఉమ్మడి కుటుంబం" -మాస్కోలో జరిగిన చలన చిత్రోత్సవంలోనూ- 1968లో అంతర్జాతీయ ఉత్సవాల్లోనూ ప్రదర్శింపబడింది

★ ★ ★ ★

"తల్లిదండ్రులకు కన్న బిడ్డలందరూ సమానమే అయినా- ఏదో ఒక బిడ్డపై- ఏదో ఒక విషయంలో- ఒక ప్రత్యేకమైన అభిమానం వుంటుంది ఇది సహజం అట్లాగే- మీ పిల్లలందరిలో మీకెవరి మీద ప్రత్యేకమైన యిష్టం వుందో చెప్తారా?"


"అందర్నీ గౌరవించడం నా సంస్కృతి"

"నాకంటూ ఓ ప్రత్యేకత లేదు అందరూ నా కనుపాపలాంటి వాళ్ళే ప్రపంచంలో- అందర్నీ నేను ఆదరంతో, ఆప్యాయతతో చూడడం- అందర్నీ గౌరవంగా పిలవడం- గౌరవించడం- నా సంస్కృతి అందరి బిడ్డల్లాగే- నా బిడ్డల్నీ చూస్తాను అంతేగాని ఒక ప్రత్యేకత అంటూ లేదు ' అంటూ చెప్పారు శ్రీ రామారావు

"మీ సినీ జీవితంలో మీరు బాగా ఆనందపడిన సందర్భం– సంఘటన గురించి చెప్తారా?"

నేను నటించిన చిత్రం– అందులో నా పాత్రను– అందరూ హర్షించిన సందర్భంలో అలవికాని ఆనందం

దేవునిసేవలో



పొందుతాను"

"మీ 'జీవితం'– 'క్రమశిక్షణ', 'దీక్ష'– 'ఆరోగ్య సూత్రాలు' యీ తరానికే కాదు– రేపటి తరాలకు కూడా ఆదర్శం మీ 'దినచర్య చెప్తారా?"

బ్రహ్మముహూర్తం!

"ప్రతి ఉదయం- ఒకటిన్నర-రెండు గంటల మధ్య లేవడం నాకు అలవాటు ఆ

బ్రహ్మముహూర్తంలో– నిబిడీకృతమై నటువంటి నిర్మల ధీశక్తిని యోచనా శక్తినీ గౌరవించడం నా ధర్మంగా– సంస్కృతీ పరమైనటువంటి ఆచార విధానంగా– మలచుకోవడం జరిగింది ఎన్ని ఒడుదుడుకులనైనా అధిగమించి, ఏ అడ్డంకులనైనా దాటేటటువంటి ఒక సరైన ఆలోచనా విధానం – నాకిప్పటికీ– సూచనప్రాయంగా- ఆ 'దివ్య ఘడియ'ల్లో పుటకరిస్తూనే వుంది. ప్రపంచ మంతా సుషుప్తావస్థలో వుండి, భూమ్యాకాశాల నిర్మలత్వంలో– ఆ పవిత్రమైన చల్లని ఘడియలు– స్పందించే దివ్యత్వానికి మించినది ఏ ఆరాధ్యంలోనూ లేదు– అన్నది యీ నాటికీ నాకు సంభవించేటటువంటి అనుభవం కాబట్టి– ఆ అలవాటే నా జీవితాన్ని పూర్తిగా పెనవేసుకొంది అదే జీవితాంతం కొనసాగుతుంది"– అన్నారు శ్రీ తారకరామారావుగారు

సప్తాశ్వాల కళ్ళేలను చేతబట్టి– లిప్తపాటు కూడా తేడా రాకుండా, కాలరథాన్ని నడుపుకొస్తున్న తేజోమూర్తి సూర్యభగవానుని సారథ్యం ఎంతటి గొప్పదో– ఆ నాడూ– యీనాడూ– ఏనాడు కూడా– తన దినచర్యను, జీవిత గమనాన్ని సెకండ్లూ, నిముషాలు తేడా లేకుండా ఇరవై ఐదేళ్ళ నాటి లాగే అరవై ఏడేళ్ళ నాడు కూడా ఒకే పద్ధతిలో – ఒకే క్రమశిక్షణలో – జీవన రథాన్ని నడుపుకొస్తున్న మానవతామూర్తి– ఒక్కరే శ్రీ ఎన్టీఆరే

★ ★ ★ ★



1966 డిసెంబరు 11వ తేదీన-'నటరత్న' శ్రీ ఎన్టీఆర్, తన బృందంతో సేకరించిన 10 లక్షల రూపాయలను "జాతీయ రక్షణనిధికి" అప్పటి ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రికి, హైద్రాబాదు నిజాం కళాశాల ఆవరణలో సమర్పిస్తున్నప్పటి దృశ్యం

ఆంధ్రపత్రిక గురించి

తెలుగువారి నిరంతర సేవలో 83 సంవత్సరాల సువర్ణ చరిత్ర గల "ఆంధ్రపత్రిక" గురించి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్ శ్రీ ఎన్. టి. రామారావు ఇలా

'పల్లెటూరిపిల్ల'లో.



చెప్పారు

దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారిచే ప్రారంభించబడిన యీ పత్రికకు పరమార్థం వుంది ఆ పరమార్థాన్ని గుర్తించే తెలుగు ప్రజలందరూ దీనిని గౌరవభావంతో, ప్రోత్సహించడం– ఆదరించడం యీనాటికీ జరుగుతోంది అటువంటి మధురస్మృతి – మదిలో కదిలించే యీ 'వార్తలవాహిని – అదే అనుభూతిని ఆదరాన్ని శాశ్వతంగా- యీ గడ్డ మీద పొందాలనేదే– 'నా కోరిక'

"సర్ ఇంతవరకూ అనేక విషయాలు వివరించారు కృతజ్ఞుడ్ని ఇక రాజకీయాల విషయానికొస్తే ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం పార్టీ గురించి మీ ఆలోచన ఏమిటి?" అంటూ ప్రశ్నించాను

శ్రీ రామారావుగారు చెప్పసాగారు

1983 లో తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల కాలంలో – ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక స్థానాలు గెల్చుకొని రాష్ట్ర నాయకత్వాన్ని చేబట్టిన చరిత్ర పురుషుడు శ్రీ ఎన్టీ ఆర్– భారతదేశం పార్టీ గురించి చెప్పిన వివరణ ఏమిటి? ఆయన ఆలోచన ఏమిటి?? వైవారం

(ఇంకా వుంది)

సీరియల్

భారత మహాకవిత్రయం

భాగవతుల సుబ్రహ్మణ్యం

ఇంతవరకూ సాగిన కథ-12 : చాళుక్య ప్రభువు రాజరాజనరేంద్రుల కులబ్రాహ్మణుడు నన్నయభట్టారకుడు. మహామంత్రి వజ్జియ, నన్నయల సలహాపై రాజరాజనరేంద్రుడు విజయాదిత్యుడిపై యుద్ధానికి సన్నద్ధమవుతాడు. సోమేశ్వర త్రైలోక్య మల్లుడు రాజ్యబహిష్కరణ చేసిన నారాయణభట్టు - నన్నయద్వారా రాజాశ్రయం సంపాదించి అగ్రహారాలు దానంగా పొందుతాడు నన్నయ రచించే ఆంధ్రమహాభారతం ఆచంద్ర తారార్కం నిలిచివుండాలంటూ అధర్వణాచార్యుడు నన్నయను ఆశీర్వదిస్తాడు అధర్వణాచార్యుడి శాపం మూలంగా చిదమార్యుడు ఉన్మత్తుడవుతాడు. నన్నయ రచించిన ఆంధ్రమహాభారతంలోని కొన్ని పర్వాలను రాజరాజనరేంద్రుడు విని సంతృప్తి చెందుతాడు.

[గతసంచిక తరువాయి]

41

శాలివాహన శకం .. వత్సరం 983.

కులోత్తుంగుడిప్పుడు సువిశాల చోళ సామ్రాజ్యానికి యువ సామ్రాట్టు...

చిన్న మేనమామ తనకు పట్టం కట్టిననాడే చోళ-చాళుక్య సామ్రాజ్యాల్ని రెండు కన్నుల్లా చూసుకుంటానని ప్రమాణం చేశాడతడు.

అభయధర విజయధర బిరుదులు వహించి స్తుతి పాత్రుడయ్యాడు. గంగాతీర పర్యంతం విస్తరించి వున్న చోళ రాజ్యంలో అంతఃకలహాలు రూపు మాపాడు.

సభానర్తకుడు మంత్రిగా చోళరాజ్యాన్ని సర్వజన రంజకంగా పరిపాలిస్తూ కావ్య విలాస గోష్ఠిలో తేలియాడుతున్నాడు కులోత్తుంగ చోళుడు. ఎన్నో ద్రావిడ కావ్యాల్లో 'ఉభయ కులోత్తముడు'గా అభివర్ణితుడయ్యాడు. ఈ మధ్యనే 'వీర చోళీయం' గ్రంథాన్ని అంకితం పుచ్చుకున్నాడు.

చాళుక్య రాజ్యాచారం ప్రకారం చోళ రాజ్యంలో కూడా పరిపాలనా పద్ధతులు సంస్కరించాడు. 'మహా ప్రధాన మండలి'ని నియమించాడు. ఈ మండలి 'ఆలోచనా సమావేశాల కాలం' లో అధ్యక్షుడిగా వుండడానికి 'సర్వాధికారి ' అనే పదవిలో ఒక అమాత్యుని నియమించాడు. సర్వాధికారి ఒక్కొక్కసారి రాజును సైతం శాసించవచ్చు! ఆ పదవికున్న ఔన్నత్యం అంతటిది.

చోళ రాజ్యానికి చిరకాలంగా తన సేవలందిస్తూ వచ్చి, క్లిష్టసమయాల్లో ఎన్నోసార్లు బాసటగా నిల్చిన, 'జయన్ దమ్మి'ని సర్వాధికారిగా చేశాడు. చమూపతి 'సోరి యవరసన్'ను సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించి నిశ్చింతగా రాజ్యపాలనా భారాన్ని చేపట్టాడు.

మరదలు మధురాంతకీదేవితో ప్రణయం, పరిణయంగా మారి రాజ్యాధికార సంక్రమణవరకూ వచ్చినా కులోత్తుంగుడికి స్వాతిశయం పెరగలేదు. పైపెచ్చు వినమ్ర విధేయతలు అతిశయించాయి

కులోత్తుంగుడికి చిరకాలంగా ఒక ఆలోచన వుంది. అది తానిప్పట్లో బయటపెట్టడం అంత భావ్యం కాదు. చిన మామ రాజేంద్ర దేవుడికి సమ్మతమే అయినా అది తగిన సమయం ' కాదని ఊరుకున్నాడు.

'దక్షిణాపథమంతా ఒక్కరి ఏలుబడిలోనే వుండాలి '. సంపూర్ణ దక్షిణదేశాధీశుడు. సర్వం సహా చక్రవర్తి అని తాననిపించుకోవాలి.. అదీ కులోత్తుంగుడి ఊహ. సరిహద్దుల్లో కళింగ-కర్ణాట రాజన్యులను సంధితోనైనా వశపరుచుకోగలిగితే, గజబలం అపారంగా వున్న చేదిరాజు యశః కర్ణదేవుని జయించగలిగితే అదేమంత కష్టం కాదు

రాజ్య విస్తరణ కాంక్ష ఒక్కటే తన లక్ష్యం కారాదు రాజ్యంలోని ప్రజలు సుభిక్షంగా వుండే చర్యలు చేపట్టడం కూడా తన విధి కావాలి .

అటువంటి సంస్కరణలు ఇప్పటినుంచే ప్రారంభించాలి...

కులోత్తుంగుడి నిర్ణయాలు అచిరకాలంలోనే అమల్లో కొచ్చాయి.

'తనరాజ్యంలో అన్నార్తులుండరాదు'- అనుకున్న కులోత్తుంగుడు మొదట చేపట్టిన చర్య వ్యావసాయిక భూముల్ని అభివృద్ధి చెయ్యడం అందులో భాగంగానే కావేరీనదికి అపరిమితంగా కాలువలు తవ్వించడం ఫలితంగా బంజరులు సైతం సాగులో కొచ్చాయి. మొదటి చర్య అన్ని విధాలా సఫలీకృతమైంది

తత్క్షణం- అతడి దృష్టి ధనాగారంమీదకు మళ్లింది. ప్రభుత్వ ఖజానా అంటే తరగని ఖనిలా వుండాలి అంటే.. ఆదాయ మార్గాలు, రాబడి పన్నులు మెరుగుపరచాలి. అలాగని అవి ప్రజలను బాధించేవిగా వుండకూడదు

మహా ప్రధాన మండలితో యోచించి, మొత్తం రాజ్యంలో వున్న భూమినంతా అతి సూక్ష్మంగా కొలిపించాడు. ఆ కొలతలు సరిగ్గా వుంచేందుకు కృషి చేశాడు. ఫలితంగా రాబడి ఖచ్చితంగా వస్తుందన్న కులోత్తుంగుడి ఊహ నిజమైంది.

ప్రభుత్వ పత్రాల్లోకి ఎక్కకుండా, ఎక్కడా అడుగుమేరైనా భూమి తప్పిపోకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ చర్యా విజయవంతం కాగానే అంతః కలహాలు- మతకలహాలు మట్టుబెట్టడం మీద దృష్టి సారించాడు. శైవ వైష్ణవాల్ని సమానంగా ఆదరించాడు అలాగని జైనాన్నీ- బౌద్ధాన్నీ విస్మరించలేదు.

ఇంతలో-

చేదిరాజు యశఃకర్ణదేవుడు, తమ రాజ్య సరిహద్దుల్లో తోక ఝాడిస్తున్నాడన్న వార్త చేరింది కులోత్తుంగుడికి.

సరిగ్గా అదే సమయంలో.

తన మాతృభూమి వేంగీ రాజ్యంపైకి చిన్ననాయున దండెత్తనున్నాడని వచ్చిన వార్త మరింత కలవరపరచింది.

42

వాతాయనపు పట్టుతెరలు, పిల్ల తెమ్మెరలకు దారి ఇస్తూ చిత్రంగా కదుల్తున్నాయి...

శారదవేళ. వినీలాకాశంలో మేఘాలు నిర్మలంగా ప్రకాశిస్తున్నాయి.

అది అర్థరాత్రం...

మంత్రాంగ మందిరంలో ఆ ముగ్గురూ తీవ్రంగా సమాలోచన జరుపుతున్నారు. రాజరాజ నరేంద్రుని అసహనానికీ నాటి సమావేశమే తర్పణం.


వేగుల వార్తలు దైనందిన వినూత్న రీతులను మోసుకొస్తున్నాయి.

నిన్నటి వార్త నేడు లేదు. నేటి సమాచారం రేపటికే మార్పు

కేవలం వారం రోజుల్లోనే ఎంత పథక రచన జరిగింది?

వైరికింత బలం ఎలా వచ్చి వుంటుంది?

ఇది త్రైలోక్య సోమేశ్వరుడి కుటిల రాజ తంత్రమా?...



మహాభారతంపై క్విజ్-1

1. "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్" అన్న కవి ఎవరు?
2. దేవతల గురువు పేరు?
3. "జగద్ధితంబు"గా (జగత్తు హితం కోరి) భారతం రాస్తున్నానని చెప్పిన దెవరు?
4. ద్రౌపదికి మరో పేరుంది. ఏమిటది?
5. సత్యవతికీ, పరాశరునికీ పుట్టిన దెవరు?
6. విరాటరాజు కొల్వులో అజ్ఞాతంగా ఉన్నప్పుడు భీముడి పేరేమిటి?
7. పాండవులది ఏ వంశం?
8. తెలుగులో భారతం వ్రాయుటం భవ్యపురుషార్థంగా భావించిందెవరు?
9. తెలుగు భారతంలో ఆఖరి పర్వం పేరేమిటి?
10. కవిత్రయ భారతంలో మొత్తం పద్యాల సంఖ్య ఎంత?

- డి. ఎస్. శాస్త్రి

సమాధానాలు :

1. నన్నయ 2. బృహస్పతి 3. నన్నయ 4. కృష్ణ 5. కృష్ణ ద్వైపాయనుడనే వ్యాస మహర్షి 6. వలలుడు 7. చంద్రవంశం 8. తిక్కన 9. స్వర్గారోహణ పర్వం 10. 21,557

సందేహం లేదు! అతడి అవిశ్రాంత విజిగీషుతోడు విజయాదిత్యుడొకడు. మళ్లీ ఏ ముఖం పెట్టుకొని తన సవతి తమ్ముడు అతడ్ని శరణు వేడాడో తనకర్థం కాలేదు. చాళుక్య వంశానికే మాయని మచ్చ తెచ్చాడు...

అనలతడి యుద్ధరచనా సంవిధానమే అయోమయంగా వుంది.

ఇప్పటికి నాలుగుసార్లు వెంట వెంటనే తన పథకాన్ని మార్చి నట్టు చారులు వార్త తెచ్చారు.

మొదటి పథకం ప్రకారం, విజయాది త్యుడే స్వయంగా చక్రకూటం అనే కొండ దుర్గం ప్రాంతంలో విడిసి వుండేటట్టు, అతడి రెండో కొడుకు కుమార విక్రముడు దేవ రాష్ట్రం (నేటి విశాఖపట్టణం ప్రాంతం) వైపు నుంచి వేంగిని తాకేటట్టు తొలి వార్తలు.

'వజ్రహస్తదేవుడు' కళింగను ఏలుతున్నం తకాలం, దేవరాష్ట్రం 'చామరాజు' పరిపాల నలో వున్నంతకాలం తాను సవతి తమ్ముడితో తలపడితే తూర్పు వైపునుంచి విజయాదిత్యు డిదే పైచేయి అవుతుంది.

నాగకుల భూషణుడూ, మలయభాస్కర బిరుదాంకితుడు, మేఘగిరినాథుడూ, భీమ భూపాలుని తనయుడూ అయిన చామరాజు విజయాదిత్యుడికి కొమ్ముకాస్తున్నాడు. కళిం గాంధ్రా నికి చామరాజు ఘన దుర్గమకుడ్యం లాంటి సరిహద్దు వంటి వాడు.

ఏ ప్రయోజనాన్ని ఆశించాడో, విజయా దిత్యుడి వ్యూహరచన మారింది...

రెండోసారి వచ్చిన వార్తల ప్రకారం విజ యాదిత్యుడి పెద్దకొడుకు- ఇమ్మడి శక్తివర్మను యుద్ధంలో దించడానికి సన్నాహాలు జరుగుతు న్నాయని వినికిడి....

మూడో విడతలో పథకం మళ్లీ ఇంకో సారి సమీక్షించారని, పునర్నిర్మితమైందని, రహస్యంగా ఎవరెవరు ఎక్కడెక్కడ ముట్ట డించాలో సమాలోచనలు సాగుతున్నాయని కర్ణాకర్ణిగా వినవచ్చింది.

చివరికి- అదీ మారిపోయిందని, విశ్వ సనీయంగా వచ్చిన కడపటి వార్తల మేరకు విజయాదిత్యుడి రెండోకొడుకు కుమార విక్ర ముడే చక్రకూటం దుర్గాన్ని ముట్టడించబో తున్నాడని తెలిసింది.

కర్ణాట రాజు త్రైలోక్య సోమేశ్వరు డీమధ్య, సమరోత్సాహి మధుసూదనుని సర్వ సైన్యాధీశుణ్ణి చేసిన విషయం గతంలోనే నమ్మ కంగా తెలిసింది. అతడే గనుక రంగంలోకి దిగితే, తానే స్వయంగా అతడికి గట్టిపోటీ అవుతాడని రాజరాజ నరేంద్రుని ఊహ.

చక్రకూటంలో కుమార విక్రముడ్ని ఎదుర్కోడానికి తగిన సమవుజ్జీ ఎవరన్నదే ప్రస్తుత చర్చనీయాంశం....

నన్నయ వజ్జియలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. చక్రకూటం సామాన్య మైన దుర్గం కాదు. కొండ దుర్గం. కోటకు నాలుగువైపులా ఫిరంగి బురుజులున్నాయి. పైకి వెళ్లడానికి-కొండ నిట్టనిలువుగా వుండే వైపు మాత్రమే మెట్లున్నాయి. ఆ దారి శత్రుదుర్గమం. పైగా అపాయకరం. ఒకవేళ శత్రువులు ఆ మార్గం గుండాపైకి వస్తే వారి మీద తోయడానికి తోవ పొడుగునా బండ రాళ్ల అమరిక వుంది. కోటకు మూడు మహా ద్వారాలు....చెక్కుడు రాళ్లతో కట్టిన కట్టడాలున్నాయి. మహా ద్వారాన్ని ఆనుకొనే దుర్గాధీశుడి మందిరం వుంది. ప్రత్యేక ఏర్పా ట్లెన్నో ఆ మందిరంలో వున్నాయి. గంధ కపు ధూమం కలిగించే ఆకులు కలిగినవీ- ఫిరంగి మందు గుండు సామగ్రి నింపినవీ ఎన్నో కొట్టడులున్నాయి. అక్కడికి దగ్గర లోనే వున్న ఒక సహజమైన గుహలో, వెయ్యి మంది మల్లయోధానుయోధులు నిత్యం తమ విద్య పరీక్షించుకుంటూ వుంటారు.

ఇంత విస్తృతమైన ఏర్పాట్లున్నందువల్ల నన్నయ చక్రకూటం వెళ్లి, అక్కడ దండెత్తు తున్న వైరిని నిర్జించడానికి ప్రభువు అనుమతి వేడాడు. స్వామిభక్తితో నన్నయ కూడా తన యుద్ధ విద్యా ప్రదర్శనకు వేడుక పడుతు న్నాడు.

ఇంత వార్ధక్య దశలో కూడా నన్నయ కెంత దీక్ష? ఎంత శ్రద్ధాసక్తులున్నాయి!... కార్యభార నిర్వహణలో ఎంత చొరవ చూపి స్తున్నాడు?... రాజరాజనరేంద్రుడు తన ప్రధాని పట్ల కించిత్ గర్వపడ్డాడు.

కాని...

ఆంధ్ర భారత రచనా సంగ్రామంలో ఇప్ప టికే అవిశ్రాంతిగా పోరాడుతున్న ఆ వృద్ధుని ఇంకా తాను కష్టపెట్టడమా? నిరంతర చింత నతో వివిధ పద్య రచనా రీతులతో మేధోశ్రమ చేస్తున్న ఈ పరమ బ్రహ్మణ్యమూర్తిని రణ రంగానికి చేజేతులా తానెలా పంపగలడు?.... ఎంత బ్రతిమాలినా తన పట్టువిడవక యుద్ధా వని కేగ నుంకించుచున్న ఆ ఉత్తమ వేద విప్రుని ఎలా నివారించగలడు? ఈ సున్నిత సమస్యకు పరిష్కారమేమిటి?

మహామాత్యులు వజ్జియ ప్రగ్గడ కూడా దిక్కు తోచడంలేదు.

ముందిప్పుడు చక్రకూటానికి ఎవర్ని పంపాలి? అనే సమస్యను పక్కన పెట్టి, నన్నయను యుద్ధ విముఖుని చేసే భారం తాను వహించాడు వజ్జియప్రగ్గడ.

సంభాషణను క్రమంగా భారతాంధ్రీకర ణవైపు మళ్ళింపజూశాడు.

అదృష్టవశాత్తు తన మనోభావాన్ని అర్థం చేసుకున్నట్టుగా-ప్రభువు కూడా భారత ప్రశంసా-ప్రస్తావనా తేవడంతో నన్నయ ఉద్రే కానికి కించిత్ అంతరాయం కలగక తప్ప లేదు.

గవాక్షంలోంచి దోబూచులాడుతూ వల కరిస్తున్న నిర్మల జ్యోత్స్నాభిసారికల వంక

చూస్తూ 'శరదృతు వెంత మనోహరమైందో కదా నన్నపార్యా!' అన్నాడు రాజరాజనరేంద్రుడు.

"అవును ప్రభూ! ముఖ్యంగా శారద రాత్రులు నా కత్యంత ప్రీతిపాత్రాలు. ఇక్కడికి వచ్చేముందు, నేనీ వేళ రాసిన పద్యం శరద్రాత్రి మీదనే!...."

'గుర్తున్నట్లయితే మాకా పద్యం కర్ణామృతం కావించకూడదూ?'

'అవశ్యం!' అంటూ పద్య పఠనాసక్తుడయ్యాడు నన్నయ.

'శారద రాత్రు లుజ్వలలసత్తర హారకహార పంక్తులన్
జారు తరంబులయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణక
ర్పూర పరాగ పాండు రుచి పూరములంబర పూరితంబులై'

పద్యం విని అదిరిపడ్డాడు రాజరాజు....

ఎందుకో ఆ ప్రభువుకు నాల్గవ పాదంలో నిగూఢార్థం గోచరించింది.

అది తాననుకుంటున్నట్టు విపరీతపు టూహ కాదు గదా!

'కర్పూర పరాగ పాండురుచి పూరంబులు, అంబర పూరితంబులై' వున్నాయనా? లేక కర్పూర పరాగ పాండు రుచి పూరములన్....వరకు విరిచి-చివరి మాటగా 'పర పూరితంబులై' అనే పద గుంభనాన్ని పొందుపరిచినట్టా?

ఇక-ఇతరులచేతనే భారతం పూర్తి చేయబడుతుందనో-చెయ్యాల్సి వస్తోందనో భావించి నన్నయ భట్టారకులీ పదం ప్రయోగించలేదు కదా!?....

తన కలవరపాటును కప్పి పుచ్చుకుంటూ "ఎంత శ్రవణపేయంగా ఉంది? ముఖ్యంగా 'నవకైరవ గంధబంధురో దార సమీర సౌరభం' అనుభవైక వేద్యమే తప్ప వివరించ సాధ్యం కానిది కదా!" అన్నాడు రాజరాజు.

'అవునవును! తారకహార పంక్తుల వర్ణన మాత్రం అనితర సాధ్యం కాదా?' వజ్జియ ప్రశంస అది.

'సైవికహార పంక్తులు నేత్రాల ముందు మెదుల్తూవుంటే, ఈ అప్రస్తుత ప్రశంస లేమిటి ప్రభూ?' నన్నయ ఇద్దరినీ మార్చి మార్చి చూస్తూ అన్నాడు.

ఎంత సమయ చైతన్యంతో కూడిన మాట అది....!

అంటే - ఒక పక్క తాము ఉద్రేకోపశమనం కోసం , విషయ విస్మరణార్థం సంభాషణను పక్కదారి పట్టించడాన్ని నన్నయభట్టారకులు గ్రహించేశారన్నమాట!

అయితే కృతనిశ్చయులై ఉన్నవారిని వివారింప శక్యం కాదు.

కానిమ్ము, కానున్నది కాక మానదు.

'భూసుర శ్రేష్ఠా! తమ నిర్ణయం తిరుగు లేనిదా?' చివరి ప్రయత్నంగా అడిగిచూశాడు వజ్జియ.

'ప్రభుసేవా పరాయణతకు బద్ధకంకణుడైన ఈ నన్నయ నిర్ణయాలు శిలాసదృశాలు. ఎంత కఠినతరమైనవైనా ఆచరించి తీరుతాడీ నన్నయ' - మళ్లీ ఆవేశపూరితుడవుతూ దృఢంగా పలికాడు.

యుద్ధభూమిలో తనతోపాటే ఉంటూ, అనుక్షణం తనతోనే సంచరిస్తూ వుండేలా మాట తీసుకునిగాని రాజరాజు, నన్నయ యుద్ధప్రవేశాన్ని అనుమతించడానికిచ్చగించ లేదు.

తరువాత...

చిత్రకూట దుర్గాన్ని శత్రుపక్షం కాకుండా కాపాడ్డానికి, యువరాజు కులోత్తుంగ చోళుణ్ణి వియోగించాలన్న నిశ్చయంతో ఆ రేయి తెల్లవారింది.

43

శోభకృతునామ సంవత్సరం... వైశాఖ మాసం....

విజయాదిత్యుడి అంతరంగం కూడా, చంద్రగాడ్పుల విలయమై, వేడి ఎగజిమ్ముతోంది...

ఇన్నిసార్లు పథకం మార్చిన తన చివరి పన్నాగం ఎంతవరకు ఫలిస్తుందోనన్న ఆదుర్దా ఎక్కువైంది. దాంతో శరీరంలోంచి వేడి ఆవిర్లు బయల్దేరాయతడికి.

ఆ ఉష్ణతాపాన్ని హరించడానికి ఎటువంటి శీతలోపచారాలూ సరిపోవటంలేదు.

రాజరాజ నరేంద్రుడి వెంట నన్నయ యుద్ధానికి సన్నద్ధుడవుతున్నాడన్న విషయం అతడ్ని నిలవరించుకోనీయడంలేదు.

చిత్రగతుల కవిత్వం లిఖించటమే కాక, సమయస్ఫూర్తితో అప్పటి కప్పుడు వ్యూహాలు కూడ పన్నగల చతురమతి నన్నయ. అటువంటివాడు యుద్ధభూమిలో వుంటే తన వైరికే విజయం సులభ సాధ్యమవుతుంది.

నన్నయ, రాజరాజుల మైత్రీబంధం విచ్ఛేదనా దుర్భేధ్యం... ఇద్దరూ ఒకేచోట రణావనిలో వుంటే త్రైలోక్య సోమేశ్వరుడే కాదు... ముల్లోకాలు ఏకమైనా ఏమీ చెయ్యలేవు.


తన ఊహకు భిన్నంగా జరిగింది ఇదొక్కటే! నన్నయను తాను యుద్ధక్షేత్రంలో ఊహించలేదు.

ఎవరెవరు ఎక్కడెక్కడ వేంగిని చుట్టుముట్టాలో, తాను నిర్ణయించే నాటికే ఈ నన్నయ చర్య తెలిసి వుంటే పథకం మళ్లీ ఇంకోసారి మారి వుండేది! కాని ఇప్పుడా అవకాశం చెయ్యిదాటిపోయింది. ఎక్కడి కక్కడ పటిష్టంగా తన ఆజ్ఞలు ఇంతకుముందే అమలు జరిగిపోయాయి.

రాజరాజనరేంద్రునికి సమవుజ్జీగా తాను భావించిన కర్ణాట ప్రధాని మధుసూదనుడు వేంగిని కొల్లిపాక దగ్గర ముట్టడిస్తున్నాడు. అతడా పనిమీద అక్కడికి కదిలి వెళ్లిపోయాడు కూడా!

ఓ బలంవాడి, గాంగవాడి రాష్ట్రాల దగ్గర కులోత్తుంగుడిని అఖండ సేనావాహినితో తాకడానికి, తన రెండో తనయుడు కుమార విక్రముడు కదిలి వెళ్లాడు.

తనకూ - హైహయ రాజకన్య మాళవీ



మహాదేవికీ జన్మించిన ఇమ్మడి శక్తివర్మ మీద తానెన్నో ఆశలు పెట్టుకున్నాడు. హైహయులు చేది రాజైన యశఃకర్ణదేవునికి బంధువులు. కాలఛురి రాజవంశీకులు, ఛురకత్తులే నెత్తురుగా పారే వంశం వారిది. అటువంటి క్షేత్రం (భూమి)లో జన్మించిన తన జ్యేష్ఠ తనయుడు శక్తివర్మ నిజంగా సమరైక భైరవుడే! వేంగి దక్షిణపు సరిహద్దువైపు నుంచి చొచ్చుకుపోవడానికి అతడు సమాయత్త మవుతున్నాడు. తూర్పువైపున చామరాజా, ఉత్తరాన అడప అప్పనార్యుడు దిగ్గజాల్లా యుద్ధం కోసం కాసుక్కూర్చున్నారు.

అష్టదిగ్బంధనలో వుందిప్పుడు వేంగి...

ఎవరెద్దుపడతారో వేచిచూడాల్సిందే...!

తన మనసుకు తానే ఊరట కలిగించుకుని, కొంత మనో స్వాంతన పొందాడు విజయాదిత్యుడు.

అతని అంచనా ప్రకారమే యుద్ధం అన్ని వైపులా ఒకేసారి ప్రారంభమయ్యే సూచనలు కనబడ్డాయి.

సర్వ లోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజాధిరాజ, రాజ పరమేశ్వర, పరమ భట్టారక, పరమ బ్రహ్మణ్యః, మాతా పితృపాదానుధ్యాతః, త్యాగ సింహాసనాసీనః, చండికా ప్రసాద పరిలబ్ధ సామ్రాజ్య చిహ్న' సంభావితుడైన రాజరాజనరేంద్రుడు ద్రాక్షారామ భీమేశుని దర్శనం చేసుకొని, నన్నయ వెన్నంటియుండగా రణసీమ ప్రవేశించాడు.

కవచాలు తొడిగించిన అశ్వసేనను అశ్వికులు, దిట్టంగా సారాయి పట్టించి వదిలిన గజసేనను హస్తిపకులు తోడ్కొనిరాగా- సంధి విగ్రహాధికారులు ఇరుపక్షాలా రణశంఖాల్ని పూరించారు

44

'ధర్మార్థ కామమోక్షేషు- వైచక్షణ్యం కలాసుచ!

ప్రీతిం కరోతి కీర్తించ- సాధు కావ్య నిబంధనమ్!'

అని తన భర్త లిఖించిన మహాభారత 'ఫల స్వరూపం' గుర్తెరిగిన మాణిక్యాంబ, నిరంతర భారత పఠనంతో పొద్దుపుచ్చుతోంది. మనో వైక్లబ్యాన్ని దూరం చెయ్యడానికి ఆమెకు ఇంతకంటే మంచి సాధనమేదీ గోచరించలేదు. బహు పురాణ సముచ్చయమైన భారత కథా పఠనమే ఆమె ఆహార పానీయాలుగా గ్రహించసాగింది. తన భర్త పరమ భట్టారకుడు మహాకవి యుద్ధానికి వెళ్లిననాటి నుండీ ఆమె దినచర్యే మారిపోయింది

గృహకృత్యాలన్నీ పెద్దప్పగారు చూసుకుంటున్నారు. తోడుగా సోదరి సమాన, నారాయణభట్టు భార్య కుముది వుండనే వుంది.

నన్నయ యుద్ధావని కేగినప్పుడే నారాయణభట్టును కుటుంబసమేతంగా తన గృహాన నిలిపి వెళ్లాడు. బలవంతంగా మాటలతోనే కట్టేసి, మైత్రీబంధం మీద ఆనపెట్టి మరీ మిత్రుని తన ఇంటికి తెచ్చుకున్నాడు.

శరదృతువు వెళ్లిపోయింది. హేమంతం వచ్చింది.

నీప విటపిలోనికి మాత్రం అప్పుడే శశిరం ప్రవేశించింది. .

సాధారణంగా మాఘ, పాల్గుణాల్లో అన్ని చెట్లూ ఆకులు రాలుస్తాయి. వేప మాత్రం హేమంతంలోనే ఆకులు రాల్చుతుంది. కారణం - చైత్ర మాసారంభ వేళ... ఉగాది నాటికి వేపపూత సిద్ధం కావాలి కదా!

సృష్టిలో ఇలాంటి విచిత్రాలెన్నో ..

అసలు నిరంతరం పరిభ్రమించే కాలచక్రమే ఓ సృష్టి వైచిత్ర్యం.

పుష్యమాసం. ..

ఉత్తరాయణ పుణ్యకాలం ...

మకర సంక్రాంతి వెళ్లిన నాలుగోనాటి రాత్రి...

మాణిక్యాంబ మానసం- కల్లోల తరంగితమైన జలధిని తలపింప జేస్తోంది.

గత మాసం రోజులుగా నిద్రే ఎరుగని ఆమెకు మాగన్నుగా పట్టిందో కునుకు.

అందులో ఓ దుస్వప్నం ..

దిగ్గున లేచి కూర్చుంది మాణిక్యాంబ...

మంగళసూత్రాలు తీసి కళ్లకద్దుకుంది....

అప్రయత్నంగా వ్యాసపీఠిపై నున్న భర్త లిఖించిన భారతం అందుకుంది.

ఆదిపర్వం ఐదో ఆశ్వాసంలో 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్'

అనే పద్యపాదం దగ్గర ఆమె దృష్టి నిలిచిపోయింది.

రాజ్యం అల్లకల్లోలంగా వున్నట్లే తన మనస్సు కూడా మహా ఆందోళనగా వుంది. క్రమంగా వైరాగ్యం ఆవహించేలా వుంది...

'మతి దలపగ సంసారం
బతి చంచల మెండమావులట్టుల సంప
త్ప్రతతు లతి క్షణికంబులు
గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్'

అనుకుందామె ఆ పద్యం సన్నగా చదువుతూ,

సమీపంలోనే నిద్రిస్తున్న ఆమె పెద్దప్పగారు, పక్క గదిలో విశ్రమిస్తున్న నారాయణభట్టు దంపతులు ఆ అర్ధరాత్రిపూట నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వినవచ్చిన ఆ చిరుస్వరానికే మేలుకున్నారు.

ఆ రాత్రి మాణిక్యాంబ ప్రవర్తనకు వాళ్లు విస్తుపోయారు.

యుద్ధ వర్తమానాలు ఎప్పటికప్పుడు తెలుస్తున్నాయి. కనుక ఆందోళన చెందవద్దని ఊరడించి మళ్లీ నడుం వాల్చారు.

మాణిక్యాంబ కెందుకో ఊరట కలగలేదు. ఆమె మనస్సేదో కీడు శంకిస్తోంది - ఆ ఉదయం నుంచే.

మధ్యాహ్నమయ్యేసరికి ఆమె అనుమానమే వాస్తవమై కూర్చుంది.

అయిపోయింది. అనుకున్నంతా జరిగిపోయింది.

'సమరే మరణం వీరధర్మం' అన్న నానుడిని నిజం చేసేశాడు నన్నయ.

'తస్మాదాయు రాయుషో నహుషః నహుషాద్యయాతి...' అంటూ పురాణ పురుషుల వంశ వర్ణనతో భారతాన్ని తెనిగించిన తన పతి, ఆనాటితో పరమ పౌరాణికుల వరుసలో చేరిపోయాడన్న వార్త విని మాణిక్యాంబ మూర్ఛిల్లింది.

* * * *

అక్కడ యుద్ధభూమిలో...

నన్నయ వియోగంతో రాజరాజనరేంద్ర ప్రభువు పసిబాలుడిలా రోదిస్తున్నాడు.

కంటికి రెప్పలా తాను, నన్నయను కాపాడుకొస్తున్నా ఈ ఘోరం ఎప్పుడు జరిగిపోయిందో అతడికి అంతుపట్టలేదు.

తృటిలో - ఏ ఏమరుపాటు క్షణంలో నన్నయ కనుమరుగయ్యాడో, ఎలా నిహతుడయ్యాడో అర్థం కాలేదు.

కలం సన్యాసం

గదిలో ఒక మూల
తెరచిన కలంతో
ఆలోచనా ప్రపంచంలో
విహంగంలా ఎగురుతూ
భావాల కల్పవల్లులను కూర్చి
భాషారంగు లద్ది
ఆవేశాల హంగులు చేర్చి
ఉద్రేకాల తేనెలుపూసి
తయారైన "ఫినిష్డ్‌ప్రోడక్ట్"ని
పరచిన కాగితంపై ఉంచపోతుంటే...
కర్మ్యానుంచి సరకుల ధరలు మిన్నం
టుతున్నాయి
మధ్య తరగతి జీవితం త్రిశంకు స్వర్గం
మీ కాగితాల ఖరాబుకు సెలవులేదు
మీ ఆలోచనా ప్రపంచంలో అలజడులు
లేవు...
మెరుగైన సగభాగపు ఉపన్యాసం
నా కలం సన్యాసానికి కారణం!

వి. లక్ష్మణరావు

భారత మహా కవిత్రయం

సాయంత్ర మయ్యేసరికి, నన్నయ స్వర్గ స్థుడైన వార్త రాజమహేంద్రి అంతటా ప్రాకి పోయింది.

కుటుంబ సభ్యులూ - ఆప్త మిత్రులతో పాటు పుర ప్రజలందరూ శోకసాగరంలా రణ భూమివైపు పరుగులు తీశారు.

పొద్దు వాటారుతుండగా, నన్నయ భౌతిక దేహాన్ని ఒక ప్రత్యేక శిబిరంలోకి చేర్చారు...

మరణశయ్య కిరువైపులా మాణిక్యాంబ, కుముది- నారాయణభట్టు, రాజరాజనరేం ద్రులు...

పాదాల చెంత మోకరిల్లిన సాహితీ ప్రియ మిత్రుడు పావులూరి మల్లన...

శిబిరం ఎదుట అశేష జనవాహిని....

"విష్ణుసన్నిభా అని, రాజనారాయణా అనీ, శ్రీనాధమూర్తీ పరాక్రమ సన్నిభా అనీ ఇక నన్ను ఆప్యాయంగా సంభావించే వారెవరు...?" అంటూ రాజరాజనరేంద్రుని మానసం దుఃఖాతిరేకంతో ఊగిపోయింది.

"సహజ పాండిత్యంతో, శబ్దసిద్ధుడూ- అర్థసిద్ధుడూ ఐన తన మిత్రుడు ఇక తనతో 'శబ్దార్థ చర్చ' సాగించే అదృష్టం, అప్పుడే తనకు దూరం అయిపోయిందా....?!" అని నారాయణభట్టు శోకించసాగాడు.

"నన్నీ! ఎవర్రా ఇక నాకు మిగిలింది? నువ్వులేని ఈ శూన్య సాహితీసీమని నేనే రీతి పాలించను? నా గంటమిక సాగేనా? ఏ దుర్విధి నిన్ను మాకు దూరం చేసిం దిరా...?" నారాయభట్టు మిత్రుని కౌగలిం చుకొని రోదిస్తున్నాడు.

మాణిక్యాంబ ఏడ్చి- ఏడ్చి భర్త పాదాల చెంత వాలిపోయి, స్పృహ కోల్పోయింది. కుముది, కుసుమలు ఆమెకు శైత్యోపచారాలు చేస్తున్నారు.

అయినా వాళ్లని ఓదార్చటం ఎవరి తరమూ కావటంలేదు....

కొంతవడికి క్షాత్రమూర్తి రాజరాజనరేం ద్రుడే ముందుగా దుఃఖంలోంచి తేరుకున్నాడు. అతడి వయనాల్లోంచి రుధిర ధారలు స్రవి స్తున్నా కాని, మనసు మాత్రం కర్తవ్యాన్ని ప్రేరేపిస్తోంది.

మహామహుడైన నన్నయ భట్టారకుల ఆత్మశాంతికి తాను చేయగలిగిందొక్కటే...!

ఏ శత్రువుల బారిన పడకుండా, కాపా డాలని వేంగీ రాజ్య పరిరక్షణా దీక్షా కంకణ బద్ధుడై తనతోపాటు నన్నయ రణసీమ కేగి వచ్చాడో- ఆ లక్ష్యంతోనే తాను విజృంభిం చాలి. వేంగీ భూమిని వేదభూమిగా సంభావిం చిన మత్యమరాధిపాచార్యుల ఆశయం నెర వేర్చాలి. తానిప్పుడు రాజ్యకాంక్షతో కాదు- రాజ్య రక్షణకై యుద్ధం చెయ్యక తప్పదు.

దృఢ మనస్కుడై కృతనిశ్చయుడైనా, అంతలోనే మళ్లీ దుఃఖాతిరేకం...

'నా రసనకు సామ్రాజ్యపు
దీరులు దీవులు కషాయతిక్తములై చె
న్నారెడి, ఏక భారత కృతి
పారాయణ మొకడె బ్రతుకుబాట తలం
పన్'

అనుకొనే అదో విధమైన అధీరత్వం.

ఆ విచిత్రావస్థలోనే, ఆ రాత్రంతా గడి పాడు రాజరాజనరేంద్రుడు.

ఆంధ్ర భారతం అవిచ్ఛిన్నంగా కొన సాగించే చర్య చేపడతానని నన్నయసాక్షిగా ప్రమాణం చేశాడు.

'నీ మేలు వేంగి రాజ్య
శ్రీ మ జ్జలజాక్షినౌనట జెరగని బొట్టై
భూమి గల యంత కాలం
బో ముత! మాంగళిక విధి మహా
మధురముగన్'

అని ఆ మహనీయునికి అశ్రుతర్పణం విడిచాడా ప్రభువు.

కాల దుర్యోగ మెంత తీవ్ర తరం?
దాన్ని తప్పించటం ఎవ్వరి తరం?

(ఇంకా వుంది)

కవిత్రయం

ప్రతివారమూ అత్యంతాసక్తితో చదివిస్తూ - మమ్మల్ని సాహిత్యలోకంలో విహరింప జేస్తున్న భాగవతుల సుబ్రహ్మణ్యం గారి "భారత మహా కవిత్రయం" సీరియల్ బాగుంది. సాహిత్య సంపదల్ని అందించే విలువయినట్టి ఇతివృత్తాన్ని ప్రచురించడంలో మీకు సాటిలేరని నిరూపించారు. రచయితగార్కి - మీకు మా హృదయపూర్వక సాహిత్యాభి వందనములు.

-ముత్యంపేట గౌరీశంకరశర్మ
-ముదిగొండ అమరనాథశర్మ
హైద్రాబాద్-7.

వస్తాడే మా బావ

1940 మే నెల 31న విడుదలైన వాహినీ వారి "సుమంగళి"లో నటించిన హీరోయిన్ మాలతి ఆ నాటి సూపర్‌హిట్ పాట 'వస్తాడే మా బావ' ద్వార పరిచయమైంది.

ఆమె ఎన్.టి.ఆర్.తో హీరోయిన్‌గా 'పాతాళభైరవి'లో ఒక వెలుగు వెలిగి, చిల్లర వేషాలు వేసుకుంటూ గత రెండు సంవత్సరముల క్రింద కటిక దారిద్ర్యముతో బాధపడి చనిపోయినది. గత 50 సం.ల క్రిందట జరిగిపోయిన సంఘటనలను తెలియచేయుశక్తి ఒక ఆంధ్రపత్రికకు మాత్రమే కలదని, అవి అమూల్యమైన సాహిత్య విలువలతో అలనాటి వ్యాస విన్యాసములు చక్కగా ఈనాటి వారికి తెలియ చేయటము క్రొంగ్రొత్తతనము తొంగి చూస్తున్నది.

చల్లపల్లి వాసుదేవరావు, అనపర్తి

న్యూఢిల్లీ లేఖ...

మీయొక్క వారపత్రికలో 'న్యూఢిల్లీ లేఖ' అను వ్యాసాన్ని జయ్‌దుబాషీగారు వ్రాసి నారు. దానిలోని వ్యాసాలు కూలిపోతున్న కమ్యూనిజం. ఆయొక్క వ్యాసాన్ని చదివి, ఇక్కడున్న కమ్యూనిష్టులు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. అలాగే దాని తర్వాత వారపత్రికలో "ఎవరు పాపిష్టులు" అనే వ్యాసంలో ఎవరు మతమౌఢ్యులో విపులీకరించారు.

వై. నాగరాజు, (వామాలగుండ)

వీక్లీ పోస్ట్

మేటి చిత్రాలు

అలనాటి చిత్రాలు మేటి చిత్రం శీర్షిక అద్భుతంగా వున్నది. ఈ వారం శ్రీ భీశెట్టిగారు ప్రచురించిన "పెంపుడు కొడుకు" సినిమా వివరాలు ఎప్పుడో చిన్నతనంలో గుర్తుండీ, లేని ఆ సినిమా కళ్ళముందు మెదిలేట్లు చేశారు. వారికి నా ధన్య వాదములు. శ్రీ రేలంగిని గురించిన వ్యాసం. ఫోటోలు నయనానందకరముగా వున్నాయి. శ్రీ అకురాతి శేషాచలంగారి కృషి అద్భుతము.

శ్రీ కృష్ణలీలలు (1935), లవకుశ (1934), సతీసావిత్రి (1933), లంకాదహనం (1936), పాశుపతాస్త్రం (1939), మైరావణ (1940), దశావతారములు (1937), నరనారాయణ, రుక్మిణీ కళ్యాణం, మోహినీ రుక్మాంగద (1937) ఆదిగాగల చిత్రాల అనాటి స్టిల్స్ సమాచారం అందించమని శ్రీ భీశెట్టిని మరీ మరీ కోరుతున్నాను.

- కె.యల్.ఎన్. మూర్తి, సత్తెనపల్లి

ధ్రువతారలు

సినీ వినీలాకాశంలో ధృవతారలుగా వెలుగొంది, వ్యక్తులుగా మహోన్నత శిఖరాల నధిరోహించిన నటసామ్రాట్ అక్కినేని, నటరత్న యన్.టి.ఆర్. గూర్చి శ్రీ భీశెట్టిగారు వ్రాస్తున్న వ్యాసాలు శైలిరీత్యా, విషయ వివరణరీత్యా చాలా యింట్రెస్టింగా వున్నాయి. ముఖ్యంగా శ్రీ రామారావుగార్ని గూర్చి వ్రాస్తున్నపుడు వుదహరించిన పాటల చరణాలు సందర్భోచితంగా నిండుదనాన్ని చేకూర్చాయి.

న్యూఢిల్లీ లేఖ

సకాలంలో అందనందువల్ల న్యూఢిల్లీ లేఖ యీ సంచికలో యివ్వలేకపోతున్నాము. పై సంచికనుంచి ఎప్పటిలాగే కొనసాగుతుంది.

-ఎడిటర్.

అంతేగాక అలనాటి చిత్రాలమీద సేకరించిన సమీక్షలు ఓ చక్కటి ఫ్లాష్‌బ్యాక్- వ్యాసాలు మాత్రం వారపత్రికకే వో ప్రత్యేక అలంకారం.

ఎస్.వి. రామారావు,
స్క్రిప్టు రైటర్ (ఏలూరు)

నందమూరి

విశ్వవిజేత శ్రీ నందమూరి తారకరామారావుగారి గురించి స్పెషల్ రిపోర్టర్ శ్రీ భీశెట్టిగారు చాలా విషయాలు తెల్పగలిగారు. శ్రీ నందమూరి గారి గురించి ఎన్ని తెలిపినా ఇంకా తక్కువే అనిపిస్తుంది. సినీప్రపంచంలో గాని, రాజకీయంలో గాని, చాటుమాటుగా తిట్టేవారు సైతం ఎదురు పడితే ఎంతో మార్పు వచ్చి భక్తి, విశ్వాసం ఏర్పడుతుంది. నిజంగా దైవాంశ సంభూతుడేమో ననిపిస్తుంది. ఎన్నో అష్టకష్టాలు పడి, ఎంతో ఎత్తుకు ఎదిగి, గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కారంటే నిజానికి మన తెలుగువాడవటం మనందరికీ గర్వకారణమే కదా!

నటి దీపిక ముఖచిత్రం (28-12-90)తో వెలువడిన పత్రిక "యువతా-కవితా"లో వచ్చి గోళ్ల సుధగారి అజ్ఞాన అంచుల్లో... బాగుంది. కవితలకు మీరిస్తున్న ప్రాధాన్యత అభినందనీయం. అలనాటి మేటి చిత్రాలు శీర్షిక బాగుంది. ముఖ్యంగా ఈమధ్య హైదరాబాద్ నగరంలో జరిగిన మారణహోమం తలుచుకుంటేనే బాధ కలుగుతుంది. రజాకార్ల సమయంలో కూడా ఇలాంటి ఘాతుకాలు చూడలేదని వయోవృద్ధులు అన్నారంటే ఎంతటి దారుణమో మరి! నిజంగా మానవత్వమున్న మనుషులెవరూ చేయని పనులివి. మీకు మా నూతన సంవత్సర (1991) శుభాకాంక్షలతో.

పోలోజు వెంకటాచార్రి,
బోడుప్పల్

* * * *

ఎన్.టి.ఆర్. 'నటరత్న' ఎలా అయ్యారు? అనే మీ పత్రికలో ప్రచురించిన వ్యాసము చదివి చాలా ముగ్ధులమయినాము.


మరి చిత్తూరు వి. నాగయ్యగారు ఏ విధంగా ప్రజలను తన సంగీతముతోను, నటనతోను మనలను ఎంతగా అలరించారే... మరి వారి జీవిత విశేషాలు తెలియజేస్తూ ఫొటోలతో ఒక వ్యాసం ప్రచురించవలసిందిగా మీకు మనవి చేస్తున్నాము.

క్షమించండి. కీర్తిశేషులు గురించి కాక, ఇప్పుడు జీవించి వున్నవారిపైనే మీరు ఇటువంటివి వ్రాయాలని అనుకుంటున్నారా?

బండారుపల్లి కృష్ణమోహనరావు,
గుంటూరు.

సాహితీ పజిల్

గెల్చుకోండి రు. 200



కూర్పు: పింగళి వి. కృష్ణారావు

గళ్ళనుడి కట్టు-35

ఆధారాలు

నిలువు

2. తిమ్మడు కాదు సోదరుడు
4. చదువుల బడి
5. చెరసాలలో దేవుని కన్నది
7. సౌందర నందకర్త, ఇంకొక ఏడు వీరికి జోడు
8. ఏరువాకకు దీనికి దగ్గర సంబంధం
9. కుండ మీదుండేదే, తపస్సు చేస్తున్నఅర్జునుడిమీదపడింది
10. దక్షిణ దిక్కుకు రాజు భయంకరుడు
13. దాశరధీ కరుణాపయోనిధీ
14. సుప్రసిద్ధ కవి
16. ధాతకు అక్షరం చేర్చండి రాజపుతాడు

అడ్డం

1. విష్ణువు వస్త్రం జలచరం లాగే ఉంటుంది
3. అరవిందుని నాటకం
5. దేవుడ్ని స్త్రీ అనుకుంటే ఇలా అంటారు
6. కందకు అరటికి సమానంగా ఉండేది
11. జాషువా గారి ఖండకావ్యం రాత్రి సంచరిస్తుంది
12. కృష్ణుడు పెరిగిన చోటు
15. పది నిలువు చేతి లోది
17. గోదారిలో మాత్రం త్రోవ ఉండదా!
18. పదమూడు నిలువు వారి అత్తగారిల్లు
19. ఉల్లి మేలు ఈమె చేయదట.

ఆధారాలున్నాయి. నుడి కట్టు గళ్లు నింపండి! ఈ కూపన్ కత్తిరించి మీ చిరునామా రాసి పంపండి. ఆల్ కరెక్టు సొల్యూషన్ పంపిన వారికి రు. **200/-**లు బహుమతి లభిస్తుంది-ఒకరి కన్నా ఎక్కువ మంది కరెక్టు అన్సర్లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే.

ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపినవారి పేరు..

పూర్తి చిరునామా..

....పిన్ కోడ్..............

ముగింపు తేది : 22-1-'91

ఇంటర్‌వ్యూ

ఎలా చెప్పను నా మనసులోని భావం? ఎన్.టి.ఆర్.ఇంటర్‌వ్యూ పత్రికకే అందం. అతని పేరు ప్రఖ్యాతులు అనంతం. రైతు కుటుంబంలో అతని జన్మం... అయ్యాడు నటునిగా అనంతరం రామునిగా అతని వేషధారణం చూచిన వారికి కల్గించును భక్తి భావం జయించాడు అతని నటనతో విశ్వ నాయకునిగా అతని సేవాభావం అందించింది పేదలకు సహాయం. పేదల పాలిట అతనో కల్పవృక్షం. అతని ధ్యేయం పేదరిక నిర్మూలనం అందుకు కృషి చేస్తాడు నిరంతరం. అతడు మానవత్వానికి ప్రతిరూపం. అతడు ఆ దేవుని ప్రతిబింబం. ఇదికేవలం నా అభిప్రాయం!

-కుమారి సుధ, కశింకోట

గమనిక

సాహితీ పజిల్-35 ఆధారాలలో కొన్ని అచ్చుతప్పులు దొర్లాయి. ఈ కారణంగా తిరిగి అదే పజిల్‌ను పాఠకుల సౌకర్యార్థం యిక్కడ యిస్తూ గడువు పొడిగిస్తున్నాము-

-ఎడిటర్

కారణజన్ముడు

నాటి రాముని మనం ప్రత్యక్షంగా చూడలేదు. రాముని మించిన రాముడు నేటి తారక రాముడు, వీరు కారణజన్ములు. చరిత్రకారులు వీరిమాటలలో మాధుర్యం పిల్లలకు సైతం తెలుసు. అన్నం తింటున్న సమయంలోనైన పిల్లలు ఆయన మాటలు వింటే ఎంగిలిచేతితోనైన వచ్చి వినేవారు. డబ్బు ఎన్నో రకాలుగా సంపాదించవచ్చు. కొన్ని సంపాదనలు తృప్తి నిస్తాయి. ఎందరో ప్రజాపాలకు లౌతారు. కొందరు మాత్రమే ప్రజాదరణ పొందుతారు. ప్రతి మనిషిలోను దైవాన్ని చూడలేం, కొందరిలోనే చూడగలం. తారకరాముని పాలన కొంతవరకు చూసినందుకు ధన్యులం.

పి.వి.రామారావు, అనకాపల్లి.

నటరత్న

ఆంధ్రసచిత్రవారపత్రికలో, మా ప్రియతమ నాయకుడు, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావుగారి గురించి వ్రాస్తున్న ఇంటర్వ్యూ ఎక్సలెంట్‌గా ఉంది. ప్రత్యేకించి శ్రీ భీశెట్టిగారి వర్ణన కళ్ళకు కట్టినట్టుగా వుంది. ప్రపంచ చలన చిత్ర రంగంలో " నటరత్న" ధరించినన్ని పౌరాణిక పాత్రలు మరే నటుడు ధరించలేదని నిస్సంకోచంగా చెప్పవచ్చును.

నిన్నటికీ-నేటికి -రేపటికి శ్రీ రామారావుగారు ఒక్కరే " ఎదురులేని మనిషి" అని చెప్పడానికి ఆనందిస్తున్నాను. మీ సంపాదకీయం ఎప్పటికప్పుడు హాటు, హాటుగా ఉంటున్నందుకు అభినందిస్తున్నాను.

కోదండరాం, బెంగుళూరు.



"అమ్మ"తో దృశ్యం



"జగదేకసుందరి" దివ్యభారతి

సినిమాస్కోప్‌లో "నేనేరా పోలీస్"

"పిల్లిని గదిలో పెట్టి హింసిస్తే పులిగా మారుతుంది. అలానే ని[illegible] యుతీని అణచివేస్తే, అది విజృంభిం[illegible] అవినీతి అంతం చూస్తుంది. ఇదే [illegible] చిత్రం ఇతివృత్తం," అన్నారు అనిల్ కుమార్. ఈయన కథ- స్క్రీన్ ప్లే- దర్శకత్వంలో వాలి వీరేశం, కల్వ మల్లికార్జునప్ప నిర్మించే శ్రీ శివశాంతి మూవీస్ సినిమాస్కోప్‌లో నిర్మించే "నేనేరా పోలీస్" చిత్రంలో నరేష్, వాణీ విశ్వనాధ్, సత్యనారాయణ, రామిరెడ్డి, బాబ్జి, అరుణ్ కుమార్, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, సూర్య, అన్నపూర్ణ, సూర్యకాంతం పాత్రధారులు. దివాకర్‌బాబు సంభాషణలకర్త. వేటూరి గీతాలను రాజ్-కోటి స్వరపరిచారు. శరత్ ఛాయ, రాంచంద్ర సింగ్ శిల్పం, కళ నృత్యాలు, వి. ప్రసాద్ సహకార దర్శకత్వం, శ్రీనివాసరావు నిర్వహణ, సత్యం- నాగేశ్వరరావు కూర్పుతో ఈ చిత్రాన్ని సమర్పించే వి. మనోహర్‌రెడ్డి "నవంబర్ 30 నుంచి డిసెంబర్ 31 వరకు ఒకే షెడ్యూల్‌లో హైదరాబాద్ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు.

సుమన్‌తో కాట్రగడ్డ ప్రసాద్ చిత్రం

"నూతన వత్సరారంభాన ఆనవాయితీగా కొత్త చిత్రం షూటింగ్ ప్రారంభిస్తున్నాం. సుమన్ సరసన తొలిసారిగా దివ్యభారతి, యమున నటిస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు శరత్ ఈయన దర్శకత్వంలో కాట్రగడ్డ ప్రసాద్ సమర్పించే శ్రీ అన్నపూర్ణ సినీ చిత్ర తాజా చిత్రానికి ఓంకార్ కథ, మాటలు రాశారు. రాజ్-కోటి సంగీతం, మహీధర్ ఛాయ, శ్రీనివాసరాజు శిల్పం, శివశంకర్ నృత్యాలు, దోనేపూడి ప్రసాద్, ప్రొడక్షన్, మురళి- రామయ్య కూర్పుతో టి.ఆర్. తులసి నిర్మాత.

-జి.వి.జి.